ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి



సజల శ్రద్ధ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

సంకల్పం
సంరక్షణ

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

సంపుటి 6
సంచిక 9
డిసెంబర్ 2005
పార్థివ మార్గశిరం
విడిప్రతి రూ॥ 8.00
సం॥ చందా రూ॥ 85
3సం॥ చందా రూ॥ 250
10 సం॥ చందా రూ॥ 750

కూర్పు
సుందర్ గ్రాఫిక్స్

## సర్వమ్ అశ్వమేధః

– శతపథ బ్రాహ్మణం 13/3/1/4

కోరికలన్నింటినీ తీర్చుకోవడం కోసం ప్రజాపతి అశ్వమేధయజ్ఞం చేశాడు. శతపథ బ్రాహ్మణం ఆ వాస్తవాన్ని ఇలా వర్ణించింది:

**"ప్రజాపతిరకామయత సర్వాన్ కామాన్ ఆప్నుయా సర్వా వ్యష్టీర్ వ్యశ్నువీయేతి స్వపతమ్ అశ్వమేధ త్రిరాత్రం యజ్ఞతుమ్ అపశ్యత్ తమాహరత్ తేనాయజత్ తేనేష్టవో సర్వాన్ కామాన్ ఆప్నోతి । సర్వావ్యష్టీర్ వ్యాశ్నుత సర్వాన్ హవై కామనాప్నోతి సర్వావ్యష్టీర్ వ్యశ్నుతే యో అశ్వమేధేన యజతే ॥"**

– శతపథ బ్రాహ్మణమ్ 13/4/1/1

అనగా–

నా కోరికలన్నీ తీరాలి, నాకు పదార్థాలన్నీ లభించాలి – అని ప్రజాపతి వాంఛించాడు. ఆయన ఆ త్రిరాత్రి (మూడురాత్రుల) యజ్ఞక్రతువును, అశ్వమేధాన్ని చూచాడు. దానిని స్వీకరించాడు. దానితో యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞం చేసి తన కోరికలన్నిటినీ నెరవేర్చుకున్నాడు. పదార్థాలన్నిటినీ పొందాడు. అశ్వమేధ యజ్ఞం చేసిన వ్యక్తి తన కోరికలన్నిటినీ నెరవేర్చుకుంటాడు. అతడు పదార్థాలన్నిటినీ పొందుతాడు.

H H H

**పరిస్థితులు మనఃస్థితికి నీడలు మాత్రమే.**

# విషయ సూచిక

**ముఖచిత్రం : అశ్వమేధం**


| | | |
|---|---|---|
| 1. | **సంపాదకీయం :** | |
| | సర్వమ్ అశ్వమేధః | 1 |
| 2. | **విషయ సూచిక** | 2 |
| 3. | **దేవసంస్కృతి దిగ్విజయ యాత్ర** | 3 |
| 4. | **కోరికలు తీర్చే కామధేనువు - యజ్ఞం** | 6 |
| 5. | **యజ్ఞానికి మూలాధారం శాస్త్రీయత** | 9 |
| 6. | **దేవసంస్కృతికి జీవనాడి యజ్ఞం** | 13 |
| 7. | **కృతయుగ అవతరణకు ఇది నాంది** | 16 |
| 8. | **అశ్వమేధం, సవిత, గాయత్రీ సాధన** | 20 |
| 9. | **సౌరశక్తిని మధించే ప్రక్రియ అశ్వమేధం** | 23 |
| 10. | **సూక్ష్మ జగత్తును సంస్కరించే అశ్వమేధ యజ్ఞం** | 27 |
| 11. | **యజ్ఞాలకు రారాజు అశ్వమేధం** | 30 |
| 12. | **యజ్ఞబలి, దేవ దక్షిణ** | 33 |
| 13. | **యజ్ఞ విజ్ఞానం - యజ్ఞ కుండ విజ్ఞానం** | 35 |
| 14. | **గురుదేవుల అమృతవాణి** | |
| | యజ్ఞసంస్కృతి పునరుద్ధరణ మహాకాలుని సంకల్పం | 40 |
| 15. | **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 24** | |
| | హిమాలయం నుండి ఆహ్వానం - 4 | 43 |
| 16. | **వార్తలు :** | |
| | భీమిలి శక్తిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు | 47 |


# చందాదారులకు విజ్ఞప్తి

యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందాను

ఐష్ట్ర జూఈజుఖజుఊజు స్త్రజుఖజుఊష్ట్ర ఊష్ట్రఏఐఊ – ఔఏఐ౹శ్రీజూఐఐ ఈ౹౹ఐంశ్రీ, ఐఖఈజూష్ట్రజుఔజుఈ

పేరుమీద బ్యాంకు డ్రాఫ్టు ద్వారాకాని, చెక్కుద్వారాకాని పంపగోరుతాము. మీరు పంపే మనియార్డరులో మీ పేరు, చిరునామా, పిన్‌కోడ్ వ్రాయగలరు.

**హైదరాబాదులోని యుగశక్తి గాయత్రీ కేంద్రం సెల్ నంబర్– 09392506888. క్రొత్త నెంబర్ – 040 – 30986922.**

# మదురై అశ్వమేధానికి భూమిపూజ

మధురైలో 2005 డిసెంబరు 29 నుండి 2006 జనవరి1 వరకు జరుగుతున్న అశ్వమేధ యజ్ఞానికి అక్టోబరు 23న ఆదరణీయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ భూమిపూజ జరిపారు.

డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ అక్టోబరు 22న సౌరాష్ట్ర విద్యాలయంలో "వర్తమాన సమస్యలకు పరిష్కారం ఆధ్యాత్మికత" అనే విషయంపై ఉపన్యాసం ఇచ్చారు. గుప్త ఆడిటోరియంలో "అశ్వమేధ యజ్ఞం – రాష్ట్ర నిర్మాణంలో దాని భూమిక" అనే విషయంపై ఉపన్యాసం ఇచ్చారు.

"గాయత్రీ మంత్ర జపం ద్వారా ప్రజ్ఞా చక్షువు తెరుచుకుంటుంది. గాయత్రి సద్బుద్ధిని ప్రసాదించే మంత్రం. మంచినీ, చెడునూ తెలుసుకునే సామర్థ్యాన్ని ఆ మంత్రం కలిగిస్తుంది" – అని వారు ఆ ఉపన్యాసంలో బోధించారు. వారు ఇంకా ఇలా అన్నారు–

"నేడు మనిషిని శారీరికమైన అలసటకన్న మానసికమైన ఉద్రిక్తత ఎంతగానో వేధిస్తోంది. ఈ ఉద్రిక్తతకు మూల కారణాలు క్రమబద్ధత లేని జీవితం, వ్యతిరేకాత్మకమైన ఆలోచన. ఆలోచనలనుండి శీలం నిర్మాణం అవుతుంది. సదాలోచన చేసే వ్యక్తి సత్కర్మ కూడా చేస్తాడు. సత్కర్మ శుభాన్ని కలిగిస్తుంది. ఆలోచనను సరిదిద్దే ఔషధం గాయత్రీ మంత్రం."

23న భూమిపూజకు ముందు డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ మీనాక్షి దేవాలయానికి వెళ్లి మీనాక్షి అమ్మవారిని దర్శించి పూజ చేశారు.

భూమిపూజ తర్వాత వారు రాజా ఇంజనీరింగ్ కాలేజీలో అశ్వమేధ యజ్ఞసమితి సభ్యులను, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

H H H

## డిసెంబరు, జనవరి – 2006 నెలలలో పర్వదినాలు

**డిసెంబరు :**

6. నాగపంచమి.
7. సుబ్రహ్మణ్య షష్టి.
10. దత్తాత్రేయ జయంతి.
11. గీతా జయంతి.
23. స్వామి శ్రద్ధానంద బలిదానం.
25. మదన్‌మోహన్ మాలవ్యా జయంతి క్రిస్‌మస్


**జనవరి :**

5. గురుగోవిందసింగ్ జయంతి.
12. వివేకానంద జయంతి.
23. నేతాజీ జయంతి.
26. రిపబ్లిక్ దినోత్సవం.
30. గాంధీజీ వర్ధంతి.

**భోగం కోసం కాక – ఉపయోగం కోసం వస్తువులను సేకరించు.**

# దేవసంస్కృతి దిగ్విజయ యాత్ర

నేడు ప్రపంచంలో ప్రబలి ఉన్న హింసా ప్రవృత్తిని, బాధను, పాపాన్ని కలియుగ ప్రభావంగా పేర్కొంటారు. కాని అది భ్రమ మాత్రమే. కృతయుగం నుండి ద్వాపరయుగం వరకు, ప్రతి యుగం లోనూ రాక్షసులు విజృంభిస్తూనే ఉన్నారు. వారిని నాశనం చేయటానికి దేవతలందరి శక్తి సంఘటిత మహాశక్తిగా ప్రకటితమయి రాక్షసులను రూపుమాపింది. పురాణాలలో దీనినే దేవాసుర సంగ్రామంగా అభివర్ణించారు. కాలచక్రం ఒకే ఇరుసుపై పరిభ్రమిస్తూ ఉంటుంది. ఋతువులు పునరావృతమవుతున్నట్లే యుగాలూ పునరావృతమవుతున్నాయి. ప్రతి యుగంలోనూ శక్తివంతులైన రాక్షసులను సంఘటిత దైవశక్తి ఓడించి దేవత్వ స్థాపన జరిపింది.



మార్కండేయ పురాణంలో 73వ అధ్యాయం నుండి 85వ అధ్యాయం వరకు ఈ విషయం చక్కగా వర్ణింపబడింది. అసురులను సంహరించిన ఘనత దుర్గామాతకు చెందింది. ఆమెయే దేవతలందరి సంఘటిత శక్తి. 'మహాశక్తి'. ఋషులు చిందించిన రక్తపు బొట్లతో సీత ఆవిర్భావం జరిగి రావణుని పతనానికి కారణమయింది. అలాగే, దేవతల సంఘటిత శక్తి మహాశక్తిగా ప్రకటితమయింది. ఇదే మానవ చైతన్యము, ప్రాణశక్తి, ప్రాణ గంగోత్రి, గాయత్రి. ఈమె దేవత్వబీజము, అధిష్ఠాన దేవత, వేదమాత, దేవమాత.

ఈ మహాశక్తి సృష్టి ఆరంభంలో మొట్టమొదటిసారిగా ప్రకటితమయింది. విష్ణుమూర్తి నిద్రపోతున్నాడు. ఆయన నాభి నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించాడు. విష్ణుమూర్తి చెవి గుబిలి నుండి మధు కైటభులనే రాక్షసులు ఉద్భవించి బ్రహ్మను చంపడానికి ఉద్యుక్తులయ్యారు. మహామాయ విరాట్ పురుషుడిని నిద్రలేపింది. విష్ణుమూర్తి 5,000 సంవత్సరాలు వారితో యుద్ధం చేశాడు. గెలవడం అసాధ్యం అయింది. అప్పుడు మహామాయ తన సమ్మోహన శక్తితో ఆ రాక్షసులు విష్ణుమూర్తినే ఏదైనా వరం కోరుకోమనేలా చేసింది. విష్ణుమూర్తి వారి మరణాన్ని వరంగా కోరుకున్నాడు. దేవతలు ఆ మహాశక్తిని పరంజ్యోతి, మహా ప్రాణము, ఆదిశక్తి, సర్వకారణస్వరూపము అని సంబోధిస్తూ ప్రార్థించారు. ఇవన్నీ గాయత్రీ మాత యొక్క విశేషణములే. పరమాత్ముని స్త్రీ రూపము, మాతృ స్వరూపము ఆమె.


వాస్తవానికి భగవంతుడు ఎప్పుడూ నిద్రపోడు. ఎవరి చెవిలోనుండి ఎవ్వరూ పుట్టరు. శ్రద్ధ, విశ్వాసాలు భగవంతుని సంకేతాలు. మానవునిలో అవిశ్వాసం మొదలవుతుంది. వ్యక్తి దుర్మార్గుడు, అహంకారి అవుతాడు. అపరాధాలు పెరుగుతాయి. భగవంతునికి తన సృష్టి పట్ల చాలా ప్రేమ. అందుకే వారిని ప్రేమతో, జ్ఞానంతో సరైన దారిలో పెట్టాలని అనుకుంటాడు. పిల్లలు మాటలు పెడచెవిని పెట్టినపుడు తండ్రి దండిస్తాడు. తండ్రి ఒకప్పుడు ఊరుకున్నా తల్లి వారిని కొట్టి సరైన దారిలో పెడుతుంది. ఇదే పరమాత్ముని మహామాయ.

రెండవ కథ. మహిషాసురుడు విజృంభించి ఇంద్రుని ఓడించాడు. దేవలోకాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దేవతలంతా బ్రహ్మను ముందుంచుకొని శివుని వద్దకు, విష్ణుమూర్తి వద్దకు వెళ్ళి మొరపెట్టుకొన్నారు. రాక్షసుని ఆగడాలకు కోపించిన శివ, విష్ణువుల ముఖముల నుండి తేజస్సు వెలువడింది. మహాశక్తి ఉద్భవించింది. ఆమె హుంకారానికి ముల్లోకాలు గజగజలాడాయి. మహిషాసురుడు తన సేనాపతులైన చిక్షురుడు (క్రిమికీటకాలవలె జీవించేవాడు). చామరుడు (శారీరక సౌందర్యానికి ప్రాముఖ్యం ఇచ్చేవాడు). ఉదగ్రుడు (తిండిపోతు), మహాహను (దేన్నో ఒకదాన్ని చంపి తినేవాడు). అసిరోమా (రోమరోమాల్లోనూ హింస నిండినవాడు) వాష్కలుడు (ఇతరులు బాధ పడుతుంటే చూచి సంతోషించేవాడు). బిడాలుడు (పిల్లిలాగా చోరదృష్టి కలవాడు) లను యుద్ధానికి పంపాడు. వారందరూ సంహరింపబడ్డారు. తరువాత దుర్ధరుడు (చెడుపనులు చేసేవాడు), దుర్ముఖుడు

**ప్రగతి పథంలో ఎదురయ్యే కష్టాల వల్ల ప్రభావితం కాకపోవడమే సంతృప్తి.**

(కుటిలుడు) అనే తన అంగరక్షకులను పంపాడు. వాళ్లు చనిపోయాక మహిషాసురుడు (పంచభూతములతో నిర్మింపబడిన శరీరమైనప్పటికీ, దయా దాక్షిణ్యములు లేక రాక్షసుడైనవాడు) తానే స్వయంగా యుద్ధానికి తలపడ్డాడు. మాయావి అయిన రాక్షసుని చూచి కోపంతో తన వాహనమయిన సింహం నుండి దూకి ఆ దేవి అతనిని కాళ్లతో త్రొక్కి చంపింది.

ఈ కథలోని నీతి ఇది: కోరికలు మితిమీరినపుడు మానవుడు ఏ పాపానికైనా ఒడికడతాడు. నేటి కల్తీ, లంచగొండితనం, నల్లబజారు, మాంసాహారం, జీవహింస మొదలైనవి ఇలాంటివే. ఇటువంటి పరిస్థితిలో పరమాత్మ యొక్క కళ్యాణకరశక్తి దేవతలను సంఘటితపరుస్తుంది. వీరందరి ప్రాణశక్తి ఏకమై అసురులతో తలపడితే అసుర ప్రవృత్తులన్నీ నశించిపోతాయి. దేవతలు జయిస్తారు. అంతటా సుఖశాంతులు విస్తరిస్తాయి. మనస్సును సంస్కరించే తేజోశక్తియే గాయత్రి. ఈమె మహామాయ. గాయత్రీ ఆరాధన చేత చెడు సంస్కారాలనే అసురులు నాశనం అవుతారు. మహిషాసురుడు దేవి యొక్క దివ్య జ్యోతిలో లీనమైనాడు. అనగా – ఆత్మబోధ స్థితికి ఎదగడానికి మానవుడు మహిషాసుర సైన్యం లాంటి దుర్గుణాలన్నింటితోనూ పోరాడి విజయం సాధించాలి. అప్పుడతను పాప కార్యములను అసహ్యించుకుంటాడు.



అశ్వ ధ్వజం

మహిషాసుర సంహారం తర్వాత దేవతలు పరాశక్తిని ఇలా స్తుతించారు: "సమస్త విశ్వమునందు నీ శక్తి వ్యాపించి ఉంది. త్రిమూర్తులు కూడ ఈ రహస్యాన్ని కనుగొనలేరు. నీవే జగత్కారకురాలవు. ప్రకృతివి. దేవతలకు స్వాహావు. పితరులకు స్వధావు. మూర్తీభవించిన వేదానివి. మొత్తం జగత్తును రక్షించేదానివి. జ్ఞానాన్ని, వివేకాన్ని ప్రసాదించేదానివి. లక్ష్మి, సరస్వతి, గౌరి ముగ్గురూ నీవే. నీ శక్తి, బలము అపారమైనవి". ఈ అర్థమంతా గాయత్రిలో ఇమిడి ఉంది. కనుక ఆమెయే గాయత్రి.

మూడవ కథ శుంభ, నిశుంభులనే రాక్షసులది. వారు దేవతలందరినీ పీడించసాగారు. దేవతలు పరాశక్తిని శరణువేడారు. అప్పుడామె పార్వతీ దేవి నుండి అంబిక రూపంలో వెలువడింది. ఆమె రూపం అత్యంత మనోహరం. అందువల్ల శుంభుడు ఆమెను పరిణయమాడదలచాడు. తననెవ్వరు యుద్ధంలో ఓడిస్తారో వారిని వరిస్తానని అంబిక చెప్పింది. శుంభుడు మొదట ధూమ్రలోచనుడిని, తర్వాత చండముండుని పంపాడు. వారి సంహారం తర్వాత రక్తబీజుడు వచ్చాడు. రక్తబీజుని నుండి ఒక్క రక్త బిందువు క్రింద పడ్డా ఇంకో రక్తబీజుడు ఉద్భవిస్తాడు. కనుకనే అతని రక్తబిందువు ఒక్కటికూడ క్రిందపడకుండా త్రాగేయాలని కాళీమాతతో దేవి చెప్పింది. కాళీమాత అలాగే చేసింది. రక్తబీజుడు సంహరింపబడ్డాడు.

తర్వాత నిశుంభ సంహారం జరిగింది. శుంభుడు యుద్ధానికి వచ్చాడు. దేవికి సహాయంగా ఉన్న సప్తమాతృశక్తులు బ్రహ్మాణి, మహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహీ, నారసింహీ, ఐంద్రీలను చూపిస్తూ–వీరందరి సహాయంతోనే నీవు యుద్ధం చేస్తున్నది. నీవే చేస్తున్నట్లు, నీవు పరాక్రమ శాలివని ప్రగల్భాలు పలుకుతున్నావు. అన్నాడు శుంభుడు. దాంతో దేవి వారందరినీ తనలో ఐక్యం చేసుకుంది. ఘోరమైన యుద్ధం జరిగింది. శుంభుడు నిర్జించబడ్డాడు. దేవతలందరు ఆదిశక్తియైన ఆ దేవిని ఇలా ప్రార్థించారు:

"నీవే ఆపదలో ఉన్నవారిని రక్షించే దానివి. నీవే జగన్మాతవు. జగదీశ్వరివి. సమస్త శక్తులు, విద్యలు నీ రూపములే. జగజ్జననివైన నీకు నమస్కరిస్తున్నాము".


ప్రార్థనకు సంతోషించి దేవి వరమొసగి వారిని ఓదార్చింది. రాక్షసులు విజృంభించినపుడల్లా నేను వివిధ రూపాలతో వచ్చి మిమ్మల్ని రక్షిస్తాను – అని అభయం ఇచ్చింది.

దుర్గా సప్తశతిగా ప్రఖ్యాతి పొందిన మార్కండేయ పురాణంలో ఆదిశక్తిగా గాయత్రియే గడచిన మూడు యుగాలలోను దేవత్వాన్ని స్థాపించినట్లు ప్రమాణం ఉన్నది.

దేవపుత్రుల పిలుపు అందుకుని ఆ అదృశ్య మహాశక్తి

**దేవత రాయిలో, కర్రలో, మట్టిలో లేదు–భావనలో ఉంది.**

పరాప్రకృతిగా దర్శనం ఇచ్చింది. దుర్గ ఆమె యొక్క ప్రత్యక్ష రూపమే. ఆ అవతరణ వల్ల ప్రేరణ పొందిన దేవీపుత్రులు దేవసంస్కృతి దిగ్విజయ యాత్రను ప్రారంభించారు. అశ్వమేధ యజ్ఞముల పరంపరతో ప్రారంభమైన యాత్ర ఇది. తంత్రశాస్త్రం ప్రకారం దీని కేంద్రం సూర్యచక్రం. ఉపాసన పరంగా ఇది సవితా ప్రధానం. దీనిని అందరికీ అందించి పాపాలను నాశనం చేయాలి. అశ్వమేధ యజ్ఞంలోని విధానాలు, వ్యవస్థలు, కర్మకాండ, విస్తరణ అన్నీ ఈ దేవాసుర యుద్ధం పరిధిలోనివే.




గతంలో అశ్వమేధం సాంస్కృతిక సమైక్యతను సాధించింది. రాజ్యాలు, రాజులు వేరయినా, సంస్కృతి ఒక్కటేనని ధృవపరచింది. సదాలోచన, సత్‌కర్మ, సద్వ్యవహారణలకు మరోపేరు దేవసంస్కృతి. మానవాళి ప్రగతికి మూలాధారాలు ఇవే. ప్రస్తుత అశ్వమేధ యజ్ఞం దేవసంస్కృతి జరిపిన దిగ్విజయ యాత్రకు ఆధునిక రూపం. ఈ దిగ్విజయ యాత్రలో దేవత్వానికి విజయం తథ్యం. మహామాయ ఇందుకు తగు సాధనాలను సమకూర్చింది. కనుక కలియుగంలో పాపం తప్పదనే మాటను మరచిపోవాలి. మంచిని కోరే వారందరూ దేవసంస్కృతి దిగ్విజయ ధ్వజం నీడకు చేరుకుని రాక్షసత్వాన్ని రూపుమాపడానికి నడుం బిగించాలి.

అనువాదం: బాసంగి శ్రీరాములు

H H H

## స్వామి భవానీ దయాల్

భవానీ దయాల్ స్కూలుకు వెళుతున్నాడు. త్రోవలో అతను ఒక దయనీయ దృశ్యాన్ని చూశాడు.

వృద్ధాప్యంలో ఉన్న ఒక కూలీ మోయలేక మోయలేక బరువును మోస్తూ వంగిపోయిన నడుముతో నెమ్మదిగా ముందుకు నడుస్తున్నాడు. అతని వెనుక తెల్లదొర ఒకడు బెత్తం పుచ్చుకుని వస్తున్నాడు. నెత్తిమీద ఉన్న బరువు వల్ల వృద్ధుని అడుగులు తడబడుతున్నాయి. వెనకనుండి కఠినమైన స్వరంతో వినిపిస్తోంది – 'అరే తొందరగా నడు. బండి దాటిపోయిందంటే నీ చర్మం ఒలిచేస్తాను.'

భావనీ దయాల్ ఇది చూసి సహించలేకపోయాడు. మనిషా, రాక్షసుడా అని అనుకున్నాడు. కొంచెం ముందుకు పోయి కూలీ కాళ్లు వణికి క్రింద పడిపోయాడు. ఆంగ్లేయుడు అతనిని లేపి బెత్తంతో వరుసగా కొట్టసాగాడు. ఆ స్థితిలో కూడా ఆ కూలీకి ఎవరూ సహాయం చేయలేదు.

ఇంతలో ఆ ఆంగ్లేయునికి తెలిసింది. ఎవరివోగాని లేత చేతులు తన చేతుల్ని పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. చూస్తే ఒక భారతీయ బాలుడు దూకి ముందుకు వచ్చి నిలుచున్నాడు. ఆంగ్లభాషలో చెప్పడం మొదలుపెట్టాడు – 'ఇతడు నిర్దోషి. ఇతనిని వదలిపెట్టండి. ఇతడు ఏ అపరాధమూ చేయలేదు.' ఆంగ్లేయుడు వృద్ధుడిని కొట్టడం ఆపి అన్నాడు. – 'ఈ పశువు నా సామానులన్నీ పాడు చేశాడు. నీవు చెప్పావు కనుక వీడిని విడిచిపెడుతున్నాను.'

'లేదు సర్, సామాను పాడవటం ఇతని తప్పు కాదు. తప్పంతా మీది. ఈ వృద్ధుడు ఇంత సామాను మోయలేడని మీకు తెలుసు. తెలిసి కూడా ఇతని నెత్తిపై ఇంత సామాను పెట్టారు. మనిషిని మనిషిగా గుర్తించాలి.

తన మాట పూర్తి చేసి భవానీ దయాల్ స్కూలుకు వెళ్లిపోయాడు. కానీ అక్కడ ఉన్నంతసేపూ అతని మనస్సు చదువు మీద లేదు. ఆ సంఘటన అతని మనస్సు కలచివేసింది. ఈ అన్యాయాన్ని ఎదిరించాలని అతను సంకల్పించుకున్నాడు.

తరువాత కాలంలో అతను గ్రామ గ్రామానికి వెళ్లి జనజాగరణ చేయసాగాడు. ఆ కార్యంలోనే తన జీవితం అంతా గడిపాడు. సహాయనిరాకరణోద్యమం కోసం, స్వదేశీ ప్రచారోద్యమం కోసం శ్రమించి పనిచేశాడు. తరువాత సన్యాసాశ్రమాన్ని స్వీకరించాడు. ఆ తర్వాత ఆయనను స్వామి భవానీ దయాల్ అని పిలువసాగారు. దేశసేవకై సమర్పింపబడిన ఆ సన్యాసి జీవితం ధన్యమైంది.

**భావశుద్ధి, ఆలోచనా శుద్ధి, క్రియా శుద్ధి – ఇదే నిజమైన శుద్ధి. కర్మకాండలన్నీ ఇందుకే.**

# కోరికలు తీర్చే కామధేనువు - యజ్ఞం

కోరికలను వదులుకోకూడదు. వదులుకోవలసినవి కోరికల రూపాన్ని, ఆ కోరికలు తీర్చుకోవడానికి నీచ పద్ధతులను అనుసరించడాన్ని. తన హితంతో పాటు ఇతరుల హితాన్ని కూడ సాధించేవే ఉత్తమమైన కోరికలు. అలాంటి కోరికలను తీర్చుకోవడానికి అత్యుత్తమ సాధనం యజ్ఞం. మన మహర్షులు తమ జీవితాలను ధారపోసి కనుగొన్న సాధనం, తమ దివ్యదృష్టితో దర్శించిన సాధనం యజ్ఞం.

కామ్య యజ్ఞం (ఒక ప్రత్యేక కోరికను తీర్చుకోవడానికి చేసే యజ్ఞం) అందుకు అన్ని విధాలా సమర్థమైనది. ఆశించిన ఫలితాలను సాధించేందుకు అవసరమైన స్పందనలనూ, వాతావరణాన్ని యజ్ఞం ఉత్పత్తి చేస్తుంది. కోరుకున్న ఫలితాలు అక్కడికక్కడ, అప్పటికప్పుడు వచ్చినట్లు పలుమారులు కనుగొనబడింది. కామ్య యజ్ఞములను నిర్వహించే వివిధ విధానాలు తెలిసిన అగ్నిహోత్రులు ప్రాచీన కాలంలో ఉండేవారు. ఉపద్రవాల నివారణకూ, అద్భుత విజయాల సాధన ప్రక్రియను ప్రారంభించడానికీ వారా విధానాలను ఉపయోగించేవారు. ఇపుడా విధానాలు దాదాపు లోపించిపోయాయి. కనుక, ఈ యజ్ఞాలలోని రహస్యాలను పరిశోధించడం నేడు అవసరం. తద్వారా మన ఋషులు నిర్మించిన కృతయుగాన్ని తిరిగి నిర్మించగలుగుతాము.

కామ్య యజ్ఞాలను గురించి అక్కడక్కడ కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి. అయితే అవి సూచనలు మాత్రమే. మన పూర్వీకుల శక్తి సామర్థ్యాలు ఎలాంటివో అవి స్పష్టం చేస్తాయి. వాటిలో కొన్ని :

**లతా వర్వసు వివిద్దిద్యా సోమస్య**
**జుహుయతదసంయుమా ॥**
**సోమే సూర్పణా సంయుక్తే ప్రయోక్తౌ క్షయ శాంతయే:**

అనగా –

అమావాస్యనాడు "సర్పలత" మూలిక ఆహుతులు వేసి యజ్ఞం చేస్తే క్షయవ్యాధి నశిస్తుంది.

**కుసుమై శంఖ వృక్షస్య హుత్వా కుష్ఠ వినాశయేత్ ।**
**అపస్మార వినాశాస్తదపామార్గస్య తండులే ॥**

అనగా –

శంఖ వృక్షం పువ్వులు ఆహుతులు వేసి యజ్ఞం చేస్తే కుష్ఠువ్యాధి నయమవుతుంది. అపామార్గ గింజలు ఆహుతులుగా వేసి యజ్ఞం చేస్తే అపస్మారం (మూర్ఛరోగం) నయమవుతుంది.

**కందన్వయ సంయుక్తం కర్పూర తండులం యావం।**
**లవంగ సుఫలం బాజ్యం సితచామరస్య దారుకే ॥**
**అ పం న్యున విధిః ప్రోక్తో గాయత్ర్యాః ప్రీతికారకః ।**

అనగా –

రక్తచందనం, శుక్లచందనం, కర్పూరం, బియ్యపు గింజలు, బార్లీ, లవంగం, కొబ్బరి, నేయి, పటికబెల్లం, మామిడి చెక్క ఆహుతులు వేసి యజ్ఞం చేస్తే ఆ వ్యక్తి గాయత్రికి ప్రీతిపాత్రుడు అవుతాడు.

**క్షీరోదన తిలాన్ దూర్వా క్షీరద్రుమ సాపెదర్వాన్ ।**
**పృథక్ సహస్ర త్రితపం జుహుయాన్ మంత్రసిద్ధకే॥**

అనగా –

24 లక్షల ఓంకార సహిత గాయత్రీ జపం చేసి సిద్ధి పొందాలంటే – పాలు, వరి అన్నం, సాపే గింజలు, దూర్వా, పాలు కలిగిన చెట్ల (మర్రి వంటివి) సమిధల 3000 ఆహుతులు వేయాలి.

సూర్య గాయత్రీ మంత్రంతో ఏ ఆహుతులు వేస్తే ఏ ప్రయోజనం కలుగుతుందో ఇలా చెప్పారు –

**సామెడిభిక్షిత్ర వృక్షస్యర్ హృత్వా పుత్రం వాప్నుయాతి॥**

అనగా –

క్షిత్ర వృక్షం సమిధతో ఆహుతులు వేస్తే దంపతులకు కొడుకు పుడతాడు.

**అహంకారో సిద్ధి బాధకః – అహంకారం సిద్ధికి ఆటంకం.**

**బృహినాంక శతం హుత్వా దీర్ఘచాయు వాప్నుయాతి।**

అనగా -

రోజూ వంద బార్లీ ఆహుతులు వేస్తే ఆయుష్షు పెరుగుతుంది.

**సువర్ణ కమలం హుత్వా శతాయాయుర్ వప్నుయాత్।**
**దూర్వాభిపయస్య వాపి మధునా సర్పి సాపివా ॥**
**శతం శతం సప్తాహమ్ అపమృత్యు వ్యపోహతి ।**
**శామి సపిడి భరంతనే పయసా వాచ సర్పిసా ॥**

అనగా -

స్వర్ణ కమలం పువ్వులు ఆహుతులు వేస్తే మనిషి వంద సంవత్సరాలు జీవిస్తాడు. దూర్వా, పాలు, తేనెలతో రోజూ వంద ఆహుతులు వేస్తే అకాల మృత్యువు రాదు. శమీ, పాలు, వెన్నలు ఆహుతులు వేస్తే అకాల మృత్యువు రాదు.

**హోమాత్తిలాఘృతాద్యశ్చ ధర్మ కామార్థ మోక్షదః ।**
**పూజా మంత్రాన్ పఠేద్యస్తు ముక్త భోగోదివం వ్రజేత్ ॥**

అనగా -

నూవులు, నేయి మున్నగు ఆహుతులు వేస్తే ధర్మార్థ కామ మోక్షములను సాధించవచ్చు. మంత్ర జపములు చేసేవారు భౌతిక సుఖములు అనుభవించి ఆతర్వాత స్వర్గానికి వెళతారు.

**కదంబ కలికా హోమాద్ యక్షిణి సిధ్యతి ధృవమ్ ।**
**బంధూక కింశుకాదీని వశ్యాకర్షయ హోమయేత్ ।**
**బిల్వం రాజ్యాయ లక్ష్మీర్థం పాటలాన్ చంపకానపి।**
**పద్మాని చక్రవర్తిత్వే భక్ష్య భోజ్యాని సంపదే ॥**

**దూర్వా వ్యాధి వినాశాయ సర్వసత్వ వశీకృతేః ।**
**ప్రియాంగు పాటలీ పుష్పం చూతపత్రం జ్వరాంతకమ్॥**

**మృత్యుంజయో మృత్యు జితస్యాద్ వృద్ధిశ్యాత్తిలహోమతః ।**
**రుద్రశాంతిః సర్వశాంత్యా అర్థ ప్రస్తుత ముచ్యతే ॥**

అనగా -

కదంబ మొగ్గను ఆహుతులుగా వేస్తే యక్షిణి యొక్క అతీత శక్తులు లభిస్తాయి. బంధూక కింశుకాదులను ఆహుతులుగా వేస్తే వ్యక్తిని వశీకరణ చేసుకోవచ్చు. బిల్వములు ఆహుతులుగా వేస్తే రాజ్యం లభిస్తుంది. పాటల చంపకములతో హవనం చేస్తే సంపద లభిస్తుంది. పద్మములతో హవనం చేస్తే చక్రవర్తి పదవి, భక్ష్య భోజ్యములు, సంపద లభిస్తాయి: దుర్వాతో హవనం చేస్తే వ్యాధి నశిస్తుంది. పాటలీ పుష్పంతో హవనం చేస్తే వశీకరణ శక్తి కలుగుతుంది. మామిడి ఆకుతో హవనం చేస్తే జ్వరం పోతుంది. మృత్యుంజయ మంత్ర జపం చేస్తే అకాల మృత్యువు నివారణ అవుతుంది. నువ్వులతో హవనం చేస్తే ఆయుష్షు పెరుగుతుంది. రుద్రశాంతి జరిపితే అందరూ శాంతిస్తారు.

**శ్రీ గేహే విష్ణు గేహే వా శ్రియం పుణ్యం ధనం లభేత్ ।**
**ఆజ్యాక్తైస్తందులై లక్ష్మిం జుహుయత్ఖదిరానలే ॥**

**రాజ్యావశ్యో భవేద్ వృద్ధి శ్రీన్చ వశ్యాదుత్తరోత్తరమ్।**
**సర్వ పాంభో అభిషేకేన నాశ్యతే సకలాగ్రహమ్ ॥**

అనగా -

లక్ష్మి ఆలయంలో కాని, విష్ణు ఆలయంలో కాని యజ్ఞంతో పాటు లక్ష్మీపూజ చేస్తే సంపద లభిస్తుంది. ఖదిర అగ్నిలో లక్షసార్లు బియ్యం, వెన్న ఆహుతులుగా వేస్తే రాజు వశమవుతాడు, సంపద పెరుగుతుంది. పాంభో అభిషేకం చేస్తే గ్రహ దోషాలు తొలగుతాయి.

**సంసాధ్యేశాన మంత్రేణ తిలహోమో వశీకరః ।**
**జయః పద్మైస్తు దూర్వాభిః శాంతికామా పలాశజైః ॥**

**పుష్టిశ్యాతకౌ క పక్షేన మృతిద్వైశాదికం భవేత్ ।**
**గ్రహక్షుద్రభయాపత్తిం మనుర్భవేత్ ॥**

అనగా -

ఈశాన మంత్రంతో తిలహోమం చేస్తే అందరూ

**ఆత్మ సంస్కరణకు కాని, ఆత్మ వికాసానికి కాని, లోక కళ్యాణానికి కాని గడిపే కష్టమయ జీవన క్రమం- తపస్సు.**

వశమవుతారు. పద్మాలతో హవనం చేస్తే విజయం లభిస్తుంది. దూర్వాతో హవనం చేస్తే శాంతి లభిస్తుంది. పలాశ పుష్పాలతో హవనం చేస్తే పుష్టి లభిస్తుంది. కాకపక్షములవల్ల అన్ని పాపములూ నశిస్తాయి. గ్రహ దోషాలు, భయం, విపత్తు మున్నగునవన్నీ నశిస్తాయి.

ఇలాంటి ప్రయోగాలు అనేకం ప్రాచీన శాస్త్రాలలో వర్ణించబడి ఉన్నాయి. ఇవన్నీ ఆయా ప్రయోజనాలను సాధిస్తాయి. అయితే, ఈ యజ్ఞాల ద్వారా వ్యక్తిగతమైన ప్రయోజనాలు మాత్రమే లభిస్తాయి. మానవాళి అంతకూ ఆరోగ్యం, ఐశ్వర్యం, వివేకం లభించడానికై స్మృతికర్తలైన ఋషులు ఏక కంఠంతో ఇలా ఆదేశించారు–

**అశ్వమేధాప్యాయితా దేవాం వృష్టయుత్యర్జేన**
**మానవః ।**
**ఆప్యాయనం వైకుర్వంతి యజ్ఞాః కల్యాణహేతవః ॥**

అనగా –

అశ్వమేధం వల్ల ప్రసన్నులైన దేవతలు శ్రేయస్సునూ, ఆనందాన్నీ వర్షిస్తారు.

కలియుగ దోషాలను తొలగించి కృతయుగ వాతావరణాన్ని నిర్మించడానికై ప్రస్తుతం మహాయజ్ఞాల పరంపర సాగుతోంది. యాజకుల (యజ్ఞంలో పాల్గొన్న వ్యక్తుల) కోరికలు తీర్చడంలో ఇవి అలౌకికమైన శక్తి కలిగినవి. ప్రాచీన కాలంలో పృథువు, అంబరీషుడు మున్నగు రాజులు, వశిష్ఠుడు, దేవలుడు మున్నగు ఋషులు ఇలా మహాయజ్ఞాలు నిర్వహించారు. తద్వారా మానవులందరినీ పూర్ణకాములను చేశారు. పుణ్యప్రదములైన వారి కోరికలన్నీ తీరేటట్లు చేశారు. యుగ పరివర్తన ఉద్యమం భారీయెత్తున అలా మహాయజ్ఞాలను ప్రస్తుత కాలంలో నిర్వహిస్తోంది. ఈ మహాయజ్ఞాలలో పాల్గొనే వ్యక్తులకు అదృష్టం కలసివస్తుంది. వారికి సంతృప్తి లభిస్తుంది. వారిలో ఆధ్యాత్మిక పరివర్తన జరుగుతుంది. ఫలితంగా వారు కలకాలం ఆనందం అనుభవిస్తారు.

H H H

## ఆత్మవత్ సర్వభూతేషు

కాశీ హిందూ విశ్వవిద్యాలయ సంస్థాపకుడు మహామనా మదనమోహన మాలవ్యా అప్పటికి చిన్నవాడు. ఒకరోజున కుక్క ఒకటి బాధతో అరుస్తూ ఉంటే ఆయన చూశాడు. దాని చెవి దగ్గర ఒక గాయం అయింది. బాధ భరింపలేనిదిగా వుంది. తట్టుకోలేక అది అటు ఇటు పరుగెత్తుతోంది.

కుక్క అరుపులను మాలవ్యా వినలేకపోతున్నాఉ. దానికి సేవ చేయాలని తహతహలాడిపోయాడు. పరుగుపరుగున ఒక పశు వైద్యశాలకు వెళ్లాడు. 'డాక్టర్, ఒక కుక్క చెవికి గాయం అయింది మందు ఇవ్వండి' – అన్నాడు 'మదన్‌మోదన్, నీకెందుకు ఈ పని? ఈ స్థితిలో దానికి పిచ్చి ఎక్కే అవకాశం ఉంది. ముట్టుకోగానే  అది కరవవచ్చు' – అని డాక్టరు చెప్పాడు.

ఎంత చెప్పినా మాలవ్యా ఒప్పుకోలేదు. మందు తీసుకొని వెళ్లాడు. బాధతో కొట్టుమిట్టాడుతున్న కుక్క ఎవరినీ దగ్గరకు రానివ్వటం లేదు. మాలవ్యా ఒక గుడ్డను మందులో తడిపి పొడుగాటి వెదురు కర్ర కొనకు చుట్టాడు సందులో ఒక మూల పడిఉన్న కుక్కకు మందు వేయసాగాడు.

మందు మంట పుడుతోంది. మందు సోకగానే కుక్క మొరుగుతోంది. ఎగిరిమీదపడాలని ప్రయత్నిస్తోంది. అయినా మాలవ్యా నిదానంగా మందు వేస్తూనే ఉన్నాడు.

మందు వేసిన తరువాత కుక్కకు బాధ తగ్గింది. అది నిద్రపోయింది. కుక్కకు ఉపశమనం కలిగిన మీదటనే మాలవ్యా అక్కడి నుండి కదిలాడు. ఆయన మనస్సు శాంతించింది.

ప్రాణులకు సేవ చేయటమే భగవంతునికి నిజమైన పూజ.

**విద్య అంటే కేవల అక్షర జ్ఞానం కాదు. సరైన దిశను చూపేది విద్య.**

# యజ్ఞానికి మూలాధారం శాస్త్రీయత

## ఉష్ణశక్తి { జీవశక్తి = యజ్ఞాగ్ని

ఉష్ణశక్తినీ, జీవశక్తినీ సమ్మేళనం చేయడం ద్వారా ప్రాచీన మహర్షులూ, మహాయోగులూ ఒక నూతన శక్తి రూపాన్ని సృష్టించి పరమాద్భుతమైన విజయం సాధించారు. ఆ శక్తి రూపమే యజ్ఞాగ్ని (యజ్ఞంలో నుండి వెలువడే అగ్ని). ఈ యజ్ఞాగ్నిని శాస్త్రీయంగా అవగాహన చేసుకోవడానికై దిగువ అంశాలు అయిదింటిని పరిశీలించవలసి ఉంటుంది:

(1) యజ్ఞ కుండముల వివిధ రూపాలకు కారణాలు;

(2) సమిధల ఎంపిక, విశిష్టమైన వాటి మండే గుణాలు;

(3) సరైన స్వరములతో మంత్రముల ఉచ్చారణ;

(4) యజ్ఞ సమయం;

(5) హవన సామాగ్రి యొక్క గుణధర్మాల విశ్లేషణ.

## వేడిమిద్వారా రసాయనిక మార్పు

వివిధ పరిమాణములలో, రూపములలో ఉన్న హవన కుండములలో సమిధలు, హవన సామాగ్రి మండడం వల్ల ఉత్పన్నం అయ్యే వేడిమీ, వెలుగూ వాతావరణంలో వివిధ విధములైన మార్పులను తీసుకువస్తాయి. వైజ్ఞానిక ప్రయోగముల ద్వారా ఈ వాస్తవం ఋజువు చేయబడింది. సమిధలను మార్చడం వల్ల ఉత్పన్నం అయ్యే వేడిమి తీవ్రతలో, మంట లక్షణంలో స్పష్టమైన మార్పు కలుగుతుంది. ఉదాహరణకు– పలాశ కర్ర వల్ల జనించే మంట లక్షణానికీ కీకర కర్రవల్ల జనించే మంట లక్షణానికీ మధ్య ఉన్న తేడాను మనం తేలికగా గుర్తించవచ్చు.

వేడిమివల్ల ద్రవ్యంలో రసాయనికమైన మార్పు కలుగుతుందన్నది అందరికీ తెలిసిన విషయమే. ఫలితంగా–ఆ ద్రవ్యం యొక్క మూల గుణంలో కూడా మార్పు వస్తుంది. వివిధ ద్రవ్యములను కాల్చడం ద్వారా క్రొత్త ద్రవ్యములు ఉత్పత్తి కావడంలో ఉన్న రహస్యం ఇదే. హవన సామాగ్రిలో రెండు రకాల రసాయనాలు ఉన్నాయి–

(1) తీవ్రమైన ఉష్ణోగ్రతలో సైతం కాలనివి. అనగా–వాటిలోని మూలతత్వం నశించదు.

(2) యజ్ఞ అగ్ని మంటలో తమ తత్వాన్ని కోల్పోయేవి.

## వాయు స్థితిలో సంయోగ అవకాశం హెచ్చు

ద్రవ్యముల రసాయనిక లక్షణాలు వాటి భౌతిక స్థితిమీద ఆధారపడి ఉంటాయి. ద్రవ్యములలో ఇమిడి ఉన్న వివిధ విభాగములు ఘన స్థితిలో ఉన్నప్పుడు – ఇతర ద్రవ్యముల విభాగములతో వాటి సంయోగానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. అయితే, ఆ ద్రవ్యములను మరింత సూక్ష్మ స్థితికి మార్చితే – ఉదాహరణకు వాయు స్థితిలోనికి మార్చితే – ఆ రెండు ద్రవ్యముల మధ్య పరస్పర సంయోగం జరిగే అవకాశం పెరుగుతుంది.

ఒక ఘన సెంటీమీటరు పదార్థాన్ని మనం వేయి సూక్ష్మ భాగములుగా విభజిస్తే – వాటి మొత్తం ఉపరితల వైశాల్యం పదిరెట్లు పెరుగుతుంది. కానీ, సాధారణంగా ఒక ఘన సెంటీమీటరు పదార్థంలో ఎన్నో సూక్ష్మకణాలు (మూలద్రవ్యాలు, మాలెక్యూల్‌లు) ఉంటాయి. ప్రతి సూక్ష్మ కణం వ్యాసార్థాన్నీ నానోమీటర్లలో కొలవవలసి ఉంటుంది. కనుక సూక్ష్మ స్థితిలో దాని ఉపరితల వైశాల్యం బ్రహ్మాండంగా పెరుగుతుంది. ఈ విధంగా ఇతర కణాలతో పరస్పర సంయోగానికి వాటికి గల సామర్థ్యాన్ని ఎన్నోరెట్లు పెంచవచ్చు. మామూలు స్థితిలో ప్రాణవాయువుతో కలియజాలని కణాలు వాయు స్థితిలో దానితో కలియగలుగుతాయి. ఇనుము, సీసము వంటి ఖనిజములను అత్యధిక ఉష్ణోగ్రతలో ఉంచి సూక్ష్మ

**లోక కల్యాణం కోసం చేసే త్యాగ – బలిదానం యజ్ఞం.**

స్థితిలోనికి మార్చి, వాటిని గాలిలో ఉంచినపుడు అవి ధగధగ మెరుస్తాయి; అందమైన ఎర్రని తళుకు ఏర్పడుతుంది. పంచదార, బొగ్గు మున్నగునవి సూక్ష్మ స్థితిలో గాలిలో కలిసినపుడు కిర్రుమనే శబ్దం ఏర్పడుతుంది. ఈ విధంగా ద్రవ్యములను సూక్ష్మ రూపములలోనికి మార్చడం ద్వారా వాటి రసాయనిక చర్యను పెంచవచ్చు.

## హవన సామాగ్రి సువాసన ప్రభావం

మరో విశేషం ఉంది. సూక్ష్మ కణాలకు వంపు ఉంటుంది. సూక్ష్మత పెరిగిన కొద్దీ ఈ వంపు తగ్గుతుంది. అనగా – ఆ కణం పరిమాణం తగ్గుతుంది; ఫలితంగా వాటి రసాయనిక చర్య పెరుగుతుంది.

హవన సామాగ్రిలోని సువాసన కలిగిన నూనె త్వరగా మండుతుంది. వాయు స్థితికి మారిన తర్వాత అది బాగా విస్తరిస్తుంది. ఫలితంగా– దాని ప్రభావం బాగా వ్యాప్తి చెందుతుంది. ఈ వాసన నూనెల సూక్ష్మ కణాల వ్యాసార్థం ఘనస్థితిలో ఉన్నప్పటి వ్యాసార్థం కన్న $10^{-6}$ నుండి $10^{-9}$కి తగ్గుతుందని కనుగొనబడింది. వడపోసిన హవన సామాగ్రి ప్రభావం కన్న అదే హవన సామాగ్రిని హవనం చేయడం వల్ల కలిగే ప్రభావం హెచ్చుగా ఉంటుంది.

హవన సామాగ్రిని ఆహుతి చేసినపుడు వెలువడే ఆవిరులలో ఎన్నో ద్రవ్యాలు కనుగొనబడ్డాయి. ఆల్డిహైడ్‌లు, ఎమీన్‌లు, ఫినాల్‌లు మున్నగునవి ఇప్పటికే గుర్తించబడ్డాయి. క్షారపదార్థాలను హవన సామాగ్రిలో నిషేధించారు. ఎందుకంటే ఉప్పు (సోడియం క్లోరైడ్) విడిపోయి క్లోరిన్ వాయువు ఉత్పత్తి అవుతుంది. ఈ క్లోరిన్ వాయువు మనుషులకూ, సూక్ష్మజీవులకు హానికరమైనది. హవనంలో నేతిని నిర్ణీత ప్రమాణంలో వాడతారు. ఇందువల్ల రెండు ప్రయోజనాలు కలుగుతాయి–

(1) నేయి మంటను రగుల్చుతుంది. ఆ మంట ఉష్ణోగ్రతను అదుపు చేస్తుంది.

(2) ఆవిరి స్థితిలోనికి మారిన తర్వాత అది హవన సామాగ్రిలోని సూక్ష్మకణాలను ఆవరించి, వాటిపై ఋణవిద్యుత్తును నిర్మాణం చేస్తుంది.

## గాలిని క్షాళన చేసే హవనం

హవనం వల్ల కలిగే ప్రయోజనాలలో మొదటిది: అది గాలిని క్షాళన చేస్తుంది. యజ్ఞస్థలంలోని అధిక ఉష్ణోగ్రతలవల్ల అక్కడి గాలికి వేడిమి, వెలుగు అందుతాయి. ఆ గాలి పైకి లేస్తుంది. ఆ గాలి వదలిన ఖాళీ స్థలాన్ని పరిసర స్థలాల నుండి వచ్చిన గాలి పూరిస్తుంది. మంట యొక్క అధిక ఉష్ణోగ్రత వల్ల ఈ గాలి క్షాళన చెందుతుంది.

## కాషాయ రంగు ప్రభావం

వివిధ వర్ణములు కలిగిన సూర్యకిరణముల తరంగ దైర్ఘ్యం (వేవ్ లెంగ్త్) వేర్వేరుగా ఉంటుంది. కనుక రోగక్రిములపై వాటి ప్రభావం కూడా వేర్వేరుగా ఉంటుంది. ఈ ప్రభావాన్ని కనుగొనడానికి ఒక ప్రయోగం జరపబడింది.

పెక్కు గిన్నెల లోపలి భాగాలకు వివిధ రంగులు వేశారు. దోమలు హెచ్చుగా ఉన్న గదిలో ఆ గిన్నెలను ఉంచారు. సూర్యోదయ సమయంలో ఆ గిన్నెలు అన్నింటిపై మూతలు బిగించారు. సాయంత్రం మూతలు తెరిచారు. మిగిలిన గిన్నెలలో కన్న కాషాయ రంగు పూసిన గిన్నెలో దోమలు బాగా తక్కువగా ఉన్నాయి. మంట రంగు కూడా కాషాయమే. అగ్నిహోత్రం యొక్క ప్రభావం, దాని ప్రయోజనం ఇలా స్పష్టం అయినాయి.

## క్రిమిసంహారకంగా హవన వాయువు

క్రిములను నాశనం చేయడానికై శాస్త్రవేత్తలు రెండు రకాల వస్తువులను కనుగొన్నారు. అవి ఏంటీసెప్టిక్‌లు, డిజిన్‌ఫెక్టెంట్‌లు. మొదటి రకం వస్తువులలోని ద్రవ్యములు

**ధర్మం అంటే కర్తవ్య పరాయణత, సదాచారం.**

మనుషులను క్రిములనుండి రక్షిస్తాయి. కాని క్రిములను చంపవు. రెండవరకం వస్తువులలోని ద్రవ్యములు క్రిములను చంపుతాయి. కొన్ని ద్రవ్యములకు ఈ లక్షణాలు రెండూ ఉంటాయి. వాటి సాంద్రతపై ఆ లక్షణాలు ఆధారపడి ఉంటాయి. అయితే, నిపుణులు మాత్రమే ఈ ద్రవ్యములను సక్రమంగా వాడగలుగుతారు. వాటిని సరైన అనుపాతంలో, సరైన సాంద్రతలో వాడే పద్ధతి మామూలు వ్యక్తులకు తెలియదు. కనుక, వాటి వాడకం వల్ల ప్రయోజనానికి బదులు హాని జరుగవచ్చు.

అయితే – హవనవాయువులో ఈ లోపం ఉండదు. దానిలో ఏదయినా హానికరమైన భాగం ఉంటే – నేతి ఆవిరి దాన్ని నాశనం చేస్తుంది. కనుక హవన వాయువు ప్రభావం ప్రయోజనకరంగా ఉంటుంది. హవనవాయువులో ఉన్న క్రియోసోట్, ఆల్డిహైడ్, పీనాయిల్, ఆవిరిగా మారే లక్షణం కలిగిన ఇతర సువాసన ద్రవ్యాలు కూడా ఈ ప్రయోజనాన్ని కలిగిస్తాయి. అందరూ దీని ప్రయోజనాన్ని పొంద గలుగుతారు. హవనవాయువు నీటినీ, స్థలాన్నీ కూడ క్షాళన చేస్తుంది. హవన వాయువు ద్వారా "పర్జన్య" సృష్టి అవుతుంది. పర్జన్య అనగా జీవశక్తి యొక్క వర్షం.

## పర్జన్యం ద్వారా క్షాళన

ఈ పర్జన్యం పంటలనూ, వన మూలికలనూ క్షాళన చేస్తుంది. ఆవిధంగా క్షాళన అయిన ధాన్యాలూ, మూలికలూ శరీరంలో వ్యాధినిరోధక శక్తిని నిర్మాణం చేస్తాయి. రోగం శరీరంపై దాడి చేయవచ్చు. శరీరంలో ప్రవేశించనూవచ్చు. అయినా ఆరోగ క్రిమి శరీరంలో ఎక్కువసేపు నిలిచి ఉండలేదు. శరీరంలోని ఆత్మరక్షణ యంత్రాంగం (ఇమ్యూన్ సిస్టమ్) వాటిని వెనువెంటనే నాశనం చేస్తుంది. లేడిపిల్లలపై, ఎలుకలపై జరిపిన ప్రయోగాలవల్ల హవన వాయువు యొక్క క్రిమి సంహారక, రోగ వినాశక లక్షణాలు ఋజువు అయినాయి.

## ప్రయోగం ద్వారా ధృవీకరణ

రోగ క్రిములు కలిగిన ద్రావణాన్ని తయారు చేశారు. దానిని ఆరోగ్యంగా ఉన్న జంతువులలోనికి సూదిమందు ద్వారా ఎక్కించారు. ఆ జంతువులకు ఆ రోగం వచ్చింది. అదే ద్రావణాన్ని హవన వాయువుతో కలిపి, మరికొన్ని జంతువులలోనికి ఎక్కించారు. ఈ జంతువులకు ఆ రోగం రాలేదు. ఈ ప్రయోగం పలుమారులు జరిగింది. అయినా ఆ ఫలితమే వచ్చింది.

హవన వాయువు వ్యవసాయానికి కూడా ప్రయోజనకరమని కనుగొన్నారు. భూమిలో రెండు రకాల క్రిములు ఉన్నాయి. మొదటి రకం క్రిములు భూసారాన్ని పెంచుతాయి. రెండవ రకం క్రిములు భూసారాన్ని నాశనం చేస్తాయి. రెండవ రకం క్రిములను సంహరించే క్రిమిసంహారక మందులను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వీటి వాడకం వల్ల మొదటి రకం క్రిములు పెరుగుతాయి. భూసారం వృద్ధి చెందుతుంది. అయితే ఈ పద్ధతిలో ఒక అసౌకర్యం ఉంది. ఆ క్రిమి సంహారక మందును భూమి నుంచి వెంటనే తొలగించకపోతే, అది భూసారాన్ని పెంచే క్రిములను కూడ సంహరిస్తుంది.

మరో ప్రయోగం జరిగింది. హవన వాయువును భూమిలోనికి పంపారు. భూసారం అద్భుతంగా పెరిగినట్లు కనుగొన్నారు. పుష్టికరమైన ద్రవ్యాలతో భూమి నిండినట్లు కనుగొన్నారు. పర్జన్యనూ, మేఘాలనూ క్షాళన చేసి, తద్వారా ధాన్యాలనూ, మూలికలనూ క్షాళన చేసి, పుష్టి చేసే ద్రవ్యములు హవన వాయువులో ఉన్నాయి.

వాతావరణంలో రెండు వాయుమండలాలు ఉన్నాయి. మొదటి వాయు మండలం భూమి ఉపరితలం నుండి ఆరు మైళ్ల వరకు వ్యాపించి ఉంటుంది. రెండవ వాయు మండలం 625 మైళ్ల వరకు వ్యాపించి ఉంటుంది. మేఘాలు మొదటి వాయు మండలంలో మాత్రమే ఏర్పడతాయి.

**ఇతరుల శ్రేయస్సులోనే, ఇతరులకు సాయపడడంలోనే నిమగ్నులు అయ్యేవారు దేవతలు.**

మేఘాలు ఏర్పడడానికి అవసరమయ్యే అంశాలు:

1. గాలిలో నీటి ఆవిరి ఉండడం;
2. ఉష్ణోగ్రత;
3. వాయు పీడనం;
4. ధూళి కణముల సంఖ్య, పరిమాణం, ఆకారం;
5. పొగ కణాలు.

## మేఘాలకు క్షాళన, పుష్టి

ఈ మేఘాలను స్వచ్ఛంగా, పుష్టికరంగా చేయడానికి అత్యుత్తమ పద్ధతి – యజ్ఞ వాయువును వాటిలోనికి పంపడం. ప్రాచీన కాలంలో అగ్నిహోత్రాలు, యజ్ఞాలు భారీ సంఖ్యలో జరిగేవి. ఫలితంగా – వానలు స్వచ్ఛంగా, పుష్టికరంగా ఉండేవి. అందువల్ల ధాన్యాలూ, మూలికలు స్వచ్ఛంగా, పుష్టికరంగా ఉండేవి. ధాన్యంలోని సూక్ష్మభాగం మనస్సుకు పుష్టిని ఇస్తుంది. కనుకనే – ప్రాచీనమైన యజ్ఞ సంస్కృతికి చెందిన ప్రజల మనస్సులు నిర్మలంగా ఉండేవి. మంచితనంతో నిండి ఉండేవి. యజ్ఞానికి అంకితమైన ఈ దైవప్రేరిత మానవులు తాము దేవతలుగా మారారు, భువిపై దివిని సృష్టించారు. ఆ యజ్ఞ సంస్కృతి వారి వారసత్వంగా నేటికీ మనమధ్య ఉన్నది. ఆ యజ్ఞ సంస్కృతిని విస్తరించడం తక్షణావసరం.

## కాలుష్యాలకు విరుగుడు

నేడు వాతావరణం నానాటికీ దిగజారిపోతోంది. వాతావరణ కాలుష్యం మానవులను భయకంపితులను చేస్తోంది. ఆ కాలుష్యం, ఆ విషం అంతటా వ్యాపిస్తోంది. కనుక యజ్ఞం మరింతగా అవసరం అవుతోంది. వాస్తవానికి – కలుషితమైన భావనలూ, కలుషితమైన ఉద్దేశ్యాలూ జీవులలో, నిర్జీవులలో రాజ్యమేలుతున్నాయి. ఫలితంగా – రోగాలూ, మానసిక ఆందోళనలూ, ఘర్షణలూ ప్రపంచమంతటా వ్యాపిస్తున్నాయి. ఈ సమస్యకు సమర్థవంతమూ, శాస్త్రీయమూ అయిన ఒకే ఒక పరిష్కారం అశ్వమేధ యజ్ఞ అనుష్ఠానం.

## శోధ సంస్థాన్‌లో పరిశోధనలు

ప్రాణశక్తి, ద్రవ్యరాశుల సంయుక్త బలంతో ఉత్పత్తి అయ్యే యజ్ఞాగ్ని పైకి ఒక ధార్మిక చర్యగా కనబడవచ్చు. అయితే, దీని శక్తి సామర్థ్యాలు, దీని ప్రభావం అద్భుతమైనవి. హరిద్వార్‌లోని బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్‌లో పనిచేస్తున్న వైజ్ఞానిక – తత్వవేత్తలు గత 20 సంవత్సరాలలో విస్తృతంగా, విజయవంతంగా పరిశోధనలు జరిపి ఈ వాస్తవాన్ని ధృవపరచారు. ప్రాచీన కాలంలో – ప్రకృతి సమతూకాన్నీ, సమాజపు సమతూకాన్నీ పునఃస్థాపన చేయడానికై వివిధ సమయాలలో రాజసూయ యజ్ఞాలూ, అశ్వమేధ యజ్ఞాలూ నిర్వహించబడ్డాయి. ప్రస్తుతం సాగుతూన్న అశ్వమేధ యజ్ఞాల పరంపర ఆ యజ్ఞ విజ్ఞానపు మూల సూత్రాలకు క్రొత్త రూపం ఇస్తూన్నది.

## భువిపై దివి అవతరణ

ఈ అశ్వమేధ యజ్ఞ పరంపర నిర్వహణ ఫలితంగా – తమోగుణంలోని విషం క్రమంగా హరించుకుపోతుంది. సత్వగుణం దినదిన ప్రవర్ధమానం అవుతుంది. ఈ మహాయజ్ఞం విశ్వశ్రేయస్సుకూ, విశ్వకళ్యాణానికీ ప్రాతిపదిక, విత్తనం. భువిపై దివిని అవతరింపజేయాలనే మన కలను సాకారం చేసే బృహత్ ప్రణాళిక ఇది.

## అపురూప అవకాశం

ఈ అశ్వమేధ యజ్ఞ అనుష్ఠానాలను నిర్వహించడంలో, విజయవంతం చేయడంలో మనతో ఎలా సహకరిస్తారనే విషయాన్ని బట్టి విశ్వశాంతినీ, విశ్వప్రగతినీ, విశ్వ అభ్యుదయాన్నీ కాంక్షించే వారి నిజాయితీని మనం అంచనా వేయగలుగుతాము. జీవితంలో లభిస్తూన్న ఈ అపురూప అవకాశాన్ని అందరూ సద్వినియోగపరచుకోవాలి.


H H H

**అంతఃకరణ శుద్ధియే మంత్రదీక్ష – సూత మహర్షి.**

# దేవసంస్కృతికి జీవనాడి యజ్ఞం

మన సంస్కృతీ సంప్రదాయాలను తత్వదర్శకులైన ఋషులు ఎంతో విజ్ఞతతో, సూక్ష్మదృష్టితో, ప్రయోజన దృష్టితో, వాస్తవిక దృష్టితో రూపొందించారు. కనుకనే వారు యజ్ఞాన్ని దేవ సంస్కృతికి వెన్నెముకగా వర్ణించారు. ధర్మ కార్యాల్లో యజ్ఞమును తప్పనిసరిగా నిర్వహించేవారు.

శాస్త్రాల్లో భగవంతుడిని యజ్ఞపురుషుడన్నారు. శతపథ బ్రాహ్మణములోని 'యజ్ఞో వైవిష్ణుః' పై మాటను నిర్ధారిస్తున్నది. ఋగ్వేద ప్రారంభంలో యజ్ఞాన్ని సద్గురువనీ మార్గదర్శక పురోహితుడనీ అన్నారు. ప్రసిద్ధ జ్యోతిష గ్రంథములు సిద్ధాంత శిరోమణి, లగధ జ్యోతిష్యములలో, గోపథ బ్రాహ్మణములో న్యాయ దర్శనంపై వాత్సాయన భాష్యములో యజ్ఞ మంత్రములు వేద విషయములని వక్కాణించారు.



సామాన్య జీవితం కూడ యజ్ఞ కర్మలతో ముడిపడి ఉంది. పుట్టుక నుండి మరణం వరకు జరుగు షోడశ సంస్కారములలో యజ్ఞం అనివార్యం. ఈ సంస్కారాలు జీవితంలో పశు ప్రవృత్తిని నిర్మూలించి దేవప్రవృత్తిని అభివృద్ధిచేయడానికి జరుపుతారు. హోలీ పండుగ వార్షిక యజ్ఞము. 5 సార్లు ఆహుతులు వేసే బలివైశ్వ యజ్ఞము తప్పనిసరి. చనిపోయిన తర్వాత కూడ భౌతిక శరీరాన్ని చితికి ఆహుతి చేస్తారు. దీనిని బట్టే మానవ జీవితం, యజ్ఞం ఎలా విడదీయరానివో తెలుస్తుంది. కనుకనే దేవ సంస్కృతి యజ్ఞ సంస్కృతిగా ప్రసిద్ధి పొందింది.


పరమార్థ ప్రయోజనాల కోసం చేసే సత్కర్మలే యజ్ఞం. 'యజ్' ధాతువు నుండి ఉత్పన్నమైన యజ్ఞ శబ్దానికి మూడు అర్థాలున్నాయి - (1) దేవపూజ (2) సమష్టి జీవనం (3)దానం. ఈ మూడూ వ్యక్తి అభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడతాయి. దేవపూజ అంటే మంచి వ్యక్తిత్వం. సౌశీల్యం, దైవ గుణములు కలిగి ఉండడం. (2) సమష్టి జీవనం అంటే సహకారం, ఐకమత్యం, సమాజానికి కట్టుబడి ఉండడం. (3) దానం అంటే ప్రపంచమంతా ఒకే కుటుంబమనే భావన, ఔదార్యం, సహృదయత. యజ్ఞం ఈ మూడింటికి ప్రతినిధి. తెల్లజెండా దీని ప్రతీక. జ్ఞానయజ్ఞపు ఎర్రకాగడా యజ్ఞాగ్నికి ప్రతినిధి. యజ్ఞ కార్యంలో సద్భావనలను సత్కర్మలుగా మార్చగల ప్రేరణ ఉంది. సత్కర్మలను తపస్సనీ, సద్భావనలను యోగమని చెపుతారు. యజ్ఞ పరమైన సిద్ధాంతాలలో ఆత్మ ప్రగతికి, భౌతిక ప్రగతికి కావలసిన శ్రమ, శిక్షణ కూడ ఉన్నాయి. యజ్ఞమును సామూహికంగా నిర్వహించాలి. కనీసం పతి, పత్ని ఇద్దరూ కలసి యజ్ఞం చేయాలి. యన్.సి. వంద్యోపాధ్యాయ తన "డెవలప్‌మెంట్ ఆఫ్ హిందూ పాలిటీ అండ్ పొలిటికల్ థియరీస్" గ్రంథంలో ఋగ్వేదంలోని అనేక మంత్రాలను ఇందుకు ఉదాహరణలుగా చూపారు. పాశ్చాత్య పండితుడు ఏ బార్ద్ "రెలిజియన్ ఆఫ్ ఇండియా" అనే గ్రంథంలో యజ్ఞం ఏ విధంగా మానవ సమాజానికీ ప్రకృతికీ మధ్య మధురమైన సంబంధాన్ని ఏర్పరచే వ్యవస్థయో వర్ణించారు. ఉపయోగకరమైన వస్తువులను ఆహుతి చేసి వాయురూపంలో వ్యాపింపజేసి మానవాళికి హితము చేకూర్చడం, వసోధారలో

**అంతఃకరణపై ఉన్న మాలిన్యాల క్షాళనయే నిజమైన పూజ.**

సమష్టి కోసం వ్యష్టి సమర్పణ చేయడం అనే భావన ఉన్నాయి.

యజ్ఞ కార్యాలకు చాలా సమిధలు సమకూర్చడం, యజ్ఞకుండముల, మండపాల నిర్మాణం – ఈ విధంగా యజ్ఞ ప్రారంభం నుండి చివరివరకు సామూహికంగా చేస్తేనే పనులు సమకూరుతాయి. యజ్ఞ కార్యముల వలన సౌశీల్యం, సమాజ నిష్ఠ మొదలైన సద్గుణాలకు ప్రేరణ కలుగుతుంది. సర్వతోముఖ ప్రగతికి, సుఖశాంతులకు యజ్ఞం రాచబాట.

యజ్ఞము యొక్క విశేషాలు ఋగ్వేద, అధర్వణ వేదములందు, శతపథ, శాంఖాయన బ్రాహ్మణములందు, మహాభారతమునందు వర్ణించబడ్డాయి. యజ్ఞాగ్ని విశేషాలు: 1.ఎప్పుడూ వేడిగా ఉండటం 2.వెలుగును, అనగా మంచిని, అనుసరించడం 3.దరిచేరిన వారిని తమలాగ తయారు చేయడం 4.లభించిన వాటిని అందరికీ పంచడం 5.మన ఆలోచనలను, స్వాభిమానాన్ని ఉన్నతోన్నతం చేసుకోవడం. ఆత్మను స్వర్గానికి తీసుకువెళ్లే వాహనం యజ్ఞాగ్నియే. ఈ 5 సద్గుణాల మహిమను తెలిసికొని, ఆచరించిన వారికి దేవత్వము, దేవతల వరములు పూర్తిగా లభ్యమవుతాయి.



శతపథ బ్రాహ్మణం "యజ్ఞో భువనస్య నాభిః" అన్నది. అనగా – విశ్వ బ్రహ్మాండ చక్రమునకు ఇరుసు యజ్ఞం. యజ్ఞ తత్వానికి కేంద్రం పవిత్రత, ఉదారత, సహకారం అను త్రివేణి. ఈ మూడు గుణముల ద్వారా ప్రపంచంలో సుఖం, సౌందర్యం, ఔన్నత్యం లభిస్తాయి. గ్రహ నక్షత్రాలు ఒక దానినొకటి ఆకర్షించుకుంటున్నాయి. ఇచ్చిపుచ్చు కుంటున్నాయి కూడా. జీవాణు, పరమాణు జగత్తు ఈ సిద్ధాంతం ఆధారంగానే గతి తప్పక నడుస్తున్నది. మేతవల్ల పశువులు పోషించబడుతున్నాయి. వాటి వలన ఎరువు, ఎరువుచే పైర్లు, పైర్ల ద్వారా జీవులు శరీర యాత్రను జరుపుతున్నాయి. సముద్రం నుండి మేఘం, మేఘం నుండి వర్షం, వర్షాల వలన నదులు, వాటితో సముద్రాలు. భూమి వరుణుల సహకారమే జీవుల మనుగడకు ఉపయోగపడుతున్నది. శరీరంలోని అవయవాలు ఒక దానికొకటి సహకరిస్తున్నాయి. ఈ సహకారం ఆధారంగా అర్థశాస్త్రము, రాజనీతి శాస్త్రము మొదలైన శాస్త్రాలు మానవ ప్రగతికి ఉపయోగపడుతున్నాయి. యజ్ఞ పరంపర ద్వారా జడ, చేతనాలు సువ్యవస్థితంగా ఉన్నాయి. అందుకే యజ్ఞ తత్వాన్ని విశ్వానికి నాభిగా పేర్కొన్నారు.

యజ్ఞంలో భౌతిక విజ్ఞానం కూడ ఇమిడి ఉంది. వాయు మండలాన్ని శుభ్రపరచటానికి చేసే ఈ ప్రక్రియ మానవుడికి అతిముఖ్యమైన ప్రాణవాయువు నందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నది. ప్రస్తుత కాలంలో ప్రపంచమంతటా పర్యావరణ కాలుష్యం తీవ్రంగా ఉన్నది. కనుక, యజ్ఞ కార్యములను పునరుద్ధరించాలి, విస్తరింపజేయాలి. మనీషి యమ్. మోనియర్ తమ గ్రంథం "ఏనిషెంట్ హిస్టరీ ఆఫ్ మెడిసిన్"లో రోగ కారకములైన క్రిములను నాశనం చేసే శక్తి యజ్ఞాగ్ని యొక్క తేజస్సులో ఉన్నదనీ, అంత సులభమైన, చౌక అయిన క్రిమిసంహారకం ఇప్పటి వరకు అన్వేషింపబడలేదనీ తెలిపారు. యజ్ఞ ప్రక్రియ శారీరక, మానసిక రుగ్మతలు పోగొట్టడంలో విజయవంతమయింది. దీనికి ప్రమాణాలు ఋగ్వేద, యజుర్వేదాలలో ఉన్నాయి. యజ్ఞ చికిత్సను పునరుద్ధరిస్తే శారీరక, మానసిక రుగ్మతలను నివారించడంలో సత్ఫలితాలు లభిస్తాయి.

యజ్ఞంలో భౌతిక విజ్ఞానమే గాక, అంతకంటే ఎక్కువ శక్తివంతం, సమర్థవంతం అయిన సూక్ష్మ విజ్ఞానం ఇమిడి

**భావనా విహీనమైన క్రియ నిరర్థకం; క్రియా విహీనమైన భావన వ్యర్థం.**

ఉంది. యజ్ఞం వల్ల సూక్ష్మ జగత్తులోని అదృశ్య వాతావరణంలో దైవత్వం విస్తరిస్తుంది. ఇది సర్వజనులకు సుఖశాంతులు లభించడానికి అదృశ్యంగా సహకరిస్తుంది. వాయు కాలుష్య నివారణయే గాక, వాతావరణ నిర్మాణం కూడ యజ్ఞము యొక్క ప్రముఖ ప్రయోజనం. పవిత్ర వేద మంత్రముల ఉచ్చారణ వలన విశ్వ చైతన్యంలో పవిత్రతను నింపే దివ్య ప్రకంపనలు ఉత్పన్నమవుతాయి. సామాన్య అగ్నిని దేవాగ్నిగా మార్చే కార్యం అధ్వర్యుడు, ఉద్గాతవంటి విశిష్ఠ యాజకుల శ్రద్ధ సంకల్పాల వల్ల సాధ్యమవుతుంది. పవిత్రమైన హవన ద్రవ్యములను ఆహుతులుగా వేస్తారు. దీనివల్ల ఉత్పన్నమయ్యే శక్తి చేత సూక్ష్మ జగత్తులో ఉపయోగకరమైన పరివర్తనం కలుగుతుంది. ఈ ఉపయోగ తత్వములు మనకు తెలియకుండానే విశ్వకళ్యాణ భూమికను నిర్మాణం చేస్తాయి.



మృగ ధ్వజం

ఈ ప్రక్రియ ప్రభావం చేత మేఘాలు వర్షిస్తాయి. చూపులకు ఇవి మేఘాలే. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే ఇవి వర్షించేది ప్రాణవర్షాన్ని. పూర్వం యజ్ఞ కర్మ, మేఘ కర్మల పరస్పర సహకారం ఉండేది. దుర్భిక్ష పరిస్థితులలో విశిష్టమైన యజ్ఞముల చేత కరవును నివారించేవారు. యజ్ఞము వల్ల మేఘాలలో ప్రాణతత్వ ముత్పన్నమవుతున్నది. ఈ ప్రాణతత్వ వర్షము చేత జడ, చేతనాలలో నవ జీవనం, సమర్థత, ఉల్లాసము కలుగుతాయి. గడ్డియందు, ఓషధులలోనూ జలం అన్నం మొదలైన వాటిలోను ఈ ప్రాణతత్వం ప్రవేశిస్తుంది. వీటిని తిన్న మనుష్యులలో, పశువులలో ప్రాణశక్తి పెంపొందుతుంది.

మానవ జీవితంతో యజ్ఞం ఎంత అభిన్నమైనదో భగవద్గీతలో ఈ విధంగా ఉంది. భగవంతుడిలా చెప్పారు:

**సహ యజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః**
**అనేన ప్రసవిష్యధ్వమేష వోస్త్విష్ట కామధుక్ ॥**

**దేవాన్ భావయతానేన, తేదేవా భావయంతు వః**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమ వాప్స్య థ ॥**

–(3–10,11)

అనగా – ప్రజాపతి మానవుని, యజ్ఞాన్ని ఒకేసారి సృష్టించాడు. ఈ యజ్ఞములవలన మీరు ఉత్తరోత్తరా బుద్ధికుశలురు అవుతారు. మీ కోరికలు సిద్ధిస్తాయి. మీరు దేవతలకు, దేవతలు మీకు సహకరిస్తారు. ఈ విధమైన పరస్పర సహకారం ద్వారా మీకు శుభాలు కలుగుతాయి.

శాస్త్రకారులు కూడ ఇలా వివరించారు.

**యస్య రాష్ట్రే పురేచైవ భగవాన్ యజ్ఞపురుషః**
**ఇజ్యతేస్వేన ధర్మేణ జనైః వర్ణాశ్రమాన్వితైః**
**తస్య రాజా మహాభాగ గాయత్ర్యై పరితుష్యతి**
**విశ్వాత్మా తిష్ఠతో నిజశాసనే**
**తస్మిన్ తుష్టే కి మప్రాప్యం జగతమీశ్వరేశ్వర**

అనగా – ఏ దేశంలో ప్రజలు ధర్మపాలన చేత యజ్ఞపురుషుని ప్రసన్నుని చేస్తారో అచ్చట గాయత్రీ మాత అనుగ్రహం వర్షిస్తుంది. సుఖశాంతులు వృద్ధి పొందుతాయి.


యజ్ఞ ప్రక్రియ కలిగించే సత్ పరిణామాలు విస్తృతమైనవి. ప్రస్తుతం అశ్వమేధ యజ్ఞం కోసం మహత్తరమైన కృషి జరుగుతోంది. యుగ పరివర్తనలోని స్థూల తత్వం, సూక్ష్మ తత్వం ఇందులో ఇమిడి ఉన్నాయి. ప్రజల మనస్సును, విశాల వాతావరణాన్ని సంస్కరించి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించే సూత్రాలు ఇవి.

H H H

**అంతఃకరణను పరిశుద్ధం చేసుకుంటే, అది ప్రభువుకు ఆలయం అవుతుంది.**

# కృతయుగ అవతరణకు ఇది నాంది

దేవభూమి భారతానికి బంగారం వంటి గతాన్ని నిర్మించిన ప్రక్రియలలో అశ్వమేధ ప్రక్రియ మిక్కిలి గొప్పది. దీనివలన కలిగిన ఫలితాలు, చక్కని పరిణామాలే దేశ ప్రజలను జగద్గురువులుగాను, జ్ఞాన విజ్ఞానాలలో చక్రవర్తులుగాను తీర్చిదిద్దగలిగాయి. దేవ సంస్కృతి యొక్క చరిత్రను అధ్యయనం చేయడానికి, పరిశోధించడానికి అంకితమైన చరిత్రకారుడు కె.ఎల్.బాశమ్ రచించిన "ది వండర్ దట్ వాజ్ ఇండియా(అద్భుత భారతం)" అన్న పుస్తకంలో భూఖండంలోని వివిధ దేశాలలో నివసించిన ప్రజలలో తమ దేశాన్ని దేవతగాను, ఉపాస్యదైవంగాను భావించినవారంటూ ఉంటే వారొక్క భారతీయులేనని పేర్కొనబడింది. ఏమిల్ బేనవేనిస్తే గారి పరిశోధన గ్రంథం "వేదిక్ ఇండియా" ప్రకారం అశ్వమేధం జాతి ఉపాసనకు వైదిక పద్ధతిగా క్షత్రియుడైన పాలకుడు, ప్రజలు కలిసి చేసే ఒక వైదిక కార్యం.


త్రిశూల పతాకం

అనేకమంది చరిత్రకారులు అశ్వమేధమంటే రాజకీయ ఏకీకరణ అని భావించారు. చరిత్రవేత్తయైన సి.ఎ.బ్రౌంసకే తన పరిశోధన గ్రంథం "ఎ హిస్టరీ ఆఫ్ హిస్టారికల్ రైటింగ్"లో చరిత్రకారుల భావనను త్రోసి పుచ్చారు. వారి ఉద్దేశ్యంలో – రాజకీయ ఏకీకరణకు నాడు, నేడు కూడా ప్రయత్నం కొనసాగుతోంది. కానీ ఆ ప్రయత్నాల వలన వైదిక భారతవాసులు అశ్వమేధానుష్ఠానము వలన సాధించిన ఫలితం లభించలేదు.

గ్రీసు, రోమ్‌ల విజయోద్యమాలు రాజకీయ ఏకీకరణకే కదా? చాణక్యుని చేతిలో చిక్కిన సికిందర్, సైల్యూకస్‌లు ఈ విధమైన రాజకీయ భావంతోనే నిండిన వారు. "విశ్వాన్నంతటినీ ఒకటి చేస్తా"నన్న పాట పాడేవాడు హిట్లర్. ఇరవైయ్యవ శతాబ్దం రెండవ దశకంలో మార్క్సుయొక్క సామ్యవాద నినాదంతో స్టాలిన్ రష్యాలో చిన్నస్థాయిలో ఇదే భావాన్ని అమలు పరచే ప్రయత్నం చేశాడు. కానీ ఈ పనికిరాని ప్రయత్నాల వలన కలిగిన ఫలితాలకు, అశ్వమేధం వల్ల కలిగే ఫలితాలకు భూమికి, ఆకాశానికి మధ్య ఉన్నంత తేడా ఉంది.

చరిత్రజ్ఞుడైన బ్రౌంన్ తెలిపినట్లు అశ్వమేధ యజ్ఞానుష్ఠానమన్నది రాజకీయ దిగ్విజయాన్ని సాధించే ఉద్యమం గాక సాంస్కృతిక దిగ్విజయ సాధనకు చేబట్టిబడిన ఉద్యమం. చరిత్రవేత్తయైన ఎ.బార్థ్ ప్రకారం–ఇందులోని సాంస్కృతిక స్వరూపానికి ప్రముఖ ఉదాహరణ యజ్ఞ నిర్వహణలో పురోహితుని నేతృత్వం. శాసకుడైన రాజు కేవలం వ్యవస్థాపకుడుగా మాత్రమే వ్యవహరిస్తాడు. కాని పురోహితుని పాత్ర సంచాలక పాత్ర. ఈ మహత్తర యజ్ఞం యొక్క ఉద్దేశ్యం రాష్ట్ర దేవత పట్ల, జీవన మూల్యముల పట్ల విశ్వాసాన్ని జాగృతం చేయడం, ఉత్తమ జీవిత విధానాలలో శిక్షణ ఇవ్వడం. ఈ సాంస్కృతిక ఏకత కొరకు చేసే ప్రయత్నం జాతిని రాజకీయంగా, భౌగోళికంగా, భావాత్మకంగా సమర్థవంతం, శక్తివంతం, దృఢవంతం చేసేది. ఈ విషయాలనే పేర్కొంటూ శతపథ బ్రాహ్మణం జాతిని, అశ్వమేధాన్ని అభిన్న అంగాలుగా వర్ణించింది.

**శ్రీర్వై రాష్ట్రం ! రాష్ట్రం వై అశ్వమేధః !**
**తస్మాత్ రాష్ట్రీ అశ్వమేధేన యజేత్ ॥**
**సర్వా వై దేవతాః అశ్వమేధే అన్వాయతా ।**
**తస్మాత్ అశ్వమేధ యాజీ సర్వదిశో అభిజయతి ॥**


శతపథ బ్రాహ్మణమ్ 13/1/2/9/3

అనగా –

సమృద్ధియే జాతి. జాతియే అశ్వమేధం. జాతి పరాయణులు అశ్వమేధం చేయాలి. దేవ గణాలు అశ్వమేధ యజ్ఞంలో పాల్గొంటారు. అశ్వమేధాన్ని అనుష్ఠించేవారు అన్ని విజయాలనూ సాధిస్తారు.

**అద్దం కదులుతూ ఉంటే ముఖం అందులో కనపడదు. మనస్సు చంచలంగా ఉంటే అందులో ప్రభువు కనపడదు.**

ప్రాచీన భారత చరిత్రలో ఇటువంటి సర్వవిజయులైన రాజుల, ప్రజా నాయకుల వివరాలు అనేకం లభిస్తాయి. వారు తమ సత్ప్రయత్నముల ద్వారా కేవలం దేవ సంస్కృతి యొక్క ఘనతను పెంచడమే గాక, దేశ ప్రజలలో దేవత్వాన్ని నింపడానికి ప్రయత్నించి సఫలులయారు. మహాభారతంలోని అశ్వమేధ పర్వములో సువర్చ యొక్క కుమారుడు అవిక్షితుని వివరణ లభిస్తుంది. ధర్మము నందు అనురాగం గల ధైర్యశాలి, జితేంద్రియుడు అయిన అవిక్షితుడు – ఆయన మరియొక పేరు కారంధముడు – నూరు అశ్వమేధ యజ్ఞములను చేసినాడు. మహాభారతకారుడు ఆయన పరాక్రమాన్ని – "య ఇజే హయమేధానాం శతేన విధివ్రత్పభుః" అని ప్రశంసించారు. పురాణాలలో మరుత మాంధాతల అశ్వమేధాలను గురించి విస్తారమైన చర్చ ఉన్నది.




శ్రీమద్భాగవత మహాపురాణంలో భూమిని సస్యశ్యామలం చేయడానికి నూతన విధానాలను పరిశోధిస్తూ పృధు మహారాజు నూరు అశ్వమేధాలను అనుష్ఠించడానికి సంకల్పించడం, దానివలన కలిగిన మంచి ఫలితాలు వివరింపబడినాయి. వాటి ప్రకారం –

**అథాచిన్తిత రాజా తు హయమేధ శతేన సః**
**బ్రహ్మావర్తే మనోః క్షేత్రే యత్ర ప్రాధీ సరస్వతీ**

భాగవతం చ.స్కం. అ.22/1

అనగా–

పృధువు పశ్చిమ వాహినియైన సరస్వతీ నది ఉన్న, బ్రహ్మ, మనువులకు చెందిన బ్రహ్మావర్త క్షేత్రాన్ని ఎన్నుకున్నారు.

పృధువువలెనే ఋషభదేవుని పుత్రుడు భరతుడనువారు ఎవరి పేర ఈ దేశానికి భరత వర్షమన్న పేరు కలిగిందో వారు – నూరేసి మార్లు అశ్వమేధాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అవన్నీ అసాధారణ యజ్ఞాలే.

**ద్రవ్య దేశకాలవశ్శుయ – శ్శద్ధ త్త్విగ్విధోదేశోప చితైః**
**సర్వైర్లపి క్రతోభిర్య ధోపదేశం శతకృత్వ ఇయాజ**

– భాగవతం 5/4/16

అనగా–

అవన్నీ ద్రవ్యం విషయంలో, దేశ కాలాల విషయంలో, యౌవ్వన, శ్రద్ధాదులలో, ఋత్విక్కుల విషయంలో మిక్కిలి గొప్పయజ్ఞాలు.

రాజయి కూడా అంబరీషుడు అశ్వమేధ యజ్ఞము చేయుటవలన ఋషిత్వమును పొందిన వైనాన్ని పురాణకారుడు ఇలా తెలిపారు:

**ఇజేఽశ్వమైధైరధి – యజ్ఞ – మీశ్వరం**
**మహావిభూత్యోపచితాంగ – దక్షిణైః ।**
**తతైర్వ శిష్మాసీత గౌతమాది భిర్ధన్వన్య**
**మిస్రోతమ్ సౌ సరస్వతీమ్ ॥**

**యస్యక్రతుషు గీర్వాణైః సదస్యా ఋత్విజో జనాః**
**తుల్య లూ పాంచానిమిషా ధ్య దృశ్యన్త సువాససః ॥**

**స్వర్గో న ప్రార్థితో యస్య మనుజైరమర ప్రియః**
**శ్రష్వద్భి రూపగా యద్భిరుతమ్ శ్లోకధేష్టితమ్ ॥**

– భాగవతం 9/22,23,24

అనగా–

ఆర్య రాజర్షి, ప్రసిద్ధ భక్తుడైన అంబరీషుడు అనేక అశ్వమేధాది మహాయజ్ఞముల ద్వారా యజ్ఞపతియైన భగవంతుని ఆరాధించేవాడు. ఆయన యజ్ఞాలకు, యజ్ఞాంగాలకు, యజ్ఞ దక్షిణ లియ్యడానికి తన సంపదనంతటినీ ఖర్చు పెట్టేవాడు. ఆయన చేసిన యజ్ఞాలకు ప్రధాన ఋత్విక్కులుగా వశిష్ఠుడు, అసితుడు, గౌతముడు వంటి మహర్షు లుండేవారు. సరస్వతీ నది ప్రవహించే ధన్వదేశ పుణ్యక్షేత్రంలో అంబరీషుడు యజ్ఞములను చేసేవాడు. ఆయన చేసే యజ్ఞములలో పాల్గొనే ఋత్విక్కులు, సభ్యుల యొక్క కాంతి దేవతల కాంతితో సమానంగా ఉండేది. యజ్ఞారాధనలో నిమగ్నుడై ఉండుట వలన

**వివేకం బుద్ధియొక్క మహోత్కృష్ట స్థాయి.**


ఆయన కనురెప్పలు క్రిందికి వ్రాలేవి కావు. ఆయన రాజ్యంలోని ప్రజలు యజ్ఞముల యొక్క పవిత్ర ప్రవాహంలో మునిగి స్వర్గ సుఖోపభోగాది వాసనలు లేకుండా నిష్కామ్యంగా యజ్ఞములు నిర్వహిస్తూ యజ్ఞేశ్వరారాధన చేసేవారు.

బలి చక్రవర్తి యొక్క అశ్వమేధానుష్ఠానమును వర్ణిస్తూ శుకదేవుడు పరీక్షిత్తుతో ఇలా అన్నాడు–

**దేవైష్వధ నిలేనేషు బలి వైరోచనః పురీమ్ ।**
**దేవధానీమధిష్ఠాయ వశం నిత్యే జగత్రయమ్ ॥**

**తం విశ్వజయినం శిష్యం, భృగవః శిష్యవత్సలాః ।**
**శతేన హయమేధానాం మనువ్రతమయాజయత్ ॥**

–భాగవతము 8/15/33/–34



మహిష ధ్వజం

అనగా–

యజ్ఞము వలన కలిగిన తేజస్సుతో కూడిన బలిని చూచి దేవతలందరును అంతర్ధానులైనపుడు, లేదా పారిపోయినపుడో విరోచనుని కుమారుడైన బలి స్వర్గ సింహాసనము మీద విరాజమానుడయినాడు. ముల్లోకాలు అతని కథీనములైనాయి. ఆ తరువాత శిష్యవాత్సల్యముగల భృగువంశస్థులయిన బ్రాహ్మణులు అతనికి లభించిన ఇంద్రపదవి చిరస్థాయిగా ఉండుటకయి అతని చేత నూరు అశ్వమేధ యజ్ఞాలు చేయించారు.

బలి చేసిన యజ్ఞాలకు సంబంధించిన వర్ణన నారద పురాణంలో కూడా లభిస్తుంది.

**దుభుజే ధ్యాహతైశ్వర్య పవృద్ధ శ్రీర్మహాబలః ।**
**ఇయాజ చాశ్వమేధైః సంప్రీణన్ తత్పరః**

– నారద పురాణము – 10/31

అనగా–

విశ్వమును జయించినట్లు చేయు యజ్ఞమును నిర్వహించి బలి మహదైశ్వర్య సంపన్నుడే కాక మహాబలశాలియై త్రిభువనాధిపతియై భోగము లనుభవించాడు. అతడు భగవత్ప్రీతికై అనేక అశ్వమేధముల నాచరించాడు.

బాహు మహారాజు ఏడు ద్వీపాలలో ఏడు అశ్వమేధ యజ్ఞాలు చేశాడు. ఆయన రాజ్యకాలంలో భూమి సస్యశ్యామలంగా ఉండేది. దేవరాజయిన ఇంద్రుడు సకాలంలో వర్షాలు కురిపించేవాడు. పాపపు పనులు చేసేవారు అంతమవటం వలన ప్రజలు ధర్మం చేత రక్షింపబడేవారు.

రావణాసురుని దుర్మార్గాలను అంతమొందించి భూమిపై స్వర్గమును నింపిన మర్యాదా పురుషోత్తముడైన భగవాన్ రామచంద్రునికి అశ్వమేధ యజ్ఞము చేయమని సలహా ఇస్తూ లక్ష్మణుడు –

**అశ్వమేధో మహాయజ్ఞం – పావనః సర్వపావనామ్ ।**
**పావనస్తవ దుర్ధర్షో రోచతాం రఘునందన ॥**

– వా.రా. ఉత్తరకాండ 84–23

"ఓ రఘునందనా ! పాపాలన్నింటిని పోగొట్టి పవిత్రం చేసేది అశ్వమేధ యజ్ఞము. ఓ దుర్ధర్షా ! మీకు ఇష్టమైతే ఆ యజ్ఞాన్ని నిర్వహించండి" – అని చెబుతాడు.

అపుడు రాముడు అశ్వమేధ యజ్ఞమును గురించి వాయుదేవుడు, జాబాలి, కశ్యపాదులతో చర్చించినపుడు–

**తేపి రామస్య తత్ శ్రుత్వా నమస్కృత్వా వృషధ్వజః**
**అశ్వమేధం ద్విజాః సర్వే పూజయన్తి శ్యసవశః ॥**

– వా.రా.। ఉత్తరకాండ 94/7

"ఆ ఋషులు రాముని మాటలు విని శివునికి నమస్కరించి అశ్వమేధ యజ్ఞమును ప్రశంసిస్తూ –

**కురు, కురు మహాభాగ ధర్మారణ్యేత్వముత్తమమ్ ।**
**దినే దినే కోటి గుణం యావద్వర్ష శతం భవేత్ ॥**

(స్క.పు. 3/35/4)

"ఓ మహాభాగా ! రామచంద్రా ! మీరీ ధర్మారణ్యంలో

**శ్రద్ధ అంతఃకరణ యొక్క అతి శ్రేష్ఠమైన లబ్ధి.**

ఉత్తమ యజ్ఞానుష్ఠానము చేయండి. దాని ప్రభావము వలన యీ స్థలము యొక్క పవిత్రత నూరు సంవత్సరముల వరకు అభివృద్ధి పొందుతూ ఉంటుంది. మనుష్యులలో కోట్లాది సద్గుణములు వృద్ధి చెందుతూ ఉంటాయి" – అని చెప్పారు.

కాశీరాజు దివోదాసు బ్రహ్మగారి ఉపదేశాన్ని స్వీకరించి యజ్ఞ సామగ్రిని సేకరించాడు. దాని సహాయంతో బ్రహ్మ అశ్వమేధ యజ్ఞమును చేశారు.

**తీర్థం దశాశ్వమేధార్ణతం ప్రథితం జగతీతలే**
**తథా ప్రభృతి తత్రాసీ ద్వారాణస్యా శుభప్రదమ్**
**పురారుద్ర సరోనామ తీర్థ కలశోద్భవ ॥**
**మేథకమ్ పశ్చాజ్ఞాతం విధిపరిగ్రహాత్**

స్కం.పు. 4/52/68/69


అనగా–

నాటినుంచి వారణాసిలో దశాశ్వమేధమన్న పేర ఆతీర్థము ప్రఖ్యాతి పొందినది. మొదట దాని పేరు రుద్రసరోవరము. పది అశ్వమేధములు అక్కడ చేయడం వలననే దానికి దశాశ్వమేధమన్న పేరు వచ్చింది.

గర్గ సంహిత అశ్వమేధ ఖండంలో కృష్ణభగవానుడు ఉగ్రసేనుని చేత అశ్వమేధము చేయించిన వృత్తాంతము కలదు. వారి ప్రేరణ, వ్యాసుని వివరణ మీద యుధిష్ఠిర చక్రవర్తి అశ్వమేధ యజ్ఞము చేసిన విషయం మహాభారతం అశ్వమేధిక పర్వంలో పేర్కొనబడింది. దానిని బట్టి యుధిష్టిరుడు మూడు అశ్వమేధ యజ్ఞములు చేసినట్లు తెలుస్తోంది. యుధిష్ఠిరుని ఈ మహత్తర పరంపరను ఆయన వారసులైన పరీక్షిత్తు, జనమేజయులు కొనసాగించారు.

జనమేజయుడు అశ్వమేధ యజ్ఞము చేసిన తర్వాత ఆ పరంపర అస్తవ్యస్తమయింది. తత్ఫలితంగా రాజనీతిలో విశృంఖలత్వము, ఐశ్వర్యనాశనము, జీవన మూల్యముల పతనము ప్రత్యక్షమయ్యాయి. ఈ గంభీర స్థితిని అర్థం చేసుకొని పుష్యమిత్ర సేనాని క్రీ.పూ. 185లో అశ్వమేధ యాగము చేసి రాజ్యానికి నూతన శక్తిని కలిగించాడు. ఆయన చేసిన ఈ యజ్ఞం వివరాలు ఇపిగ్రాఫియా ఇండికాలో సవిస్తరంగా లభిస్తాయి.

పుష్యమిత్రుని తరువాత భారతదేశము యొక్క పటిష్ఠత అగ్నిమిత్ర వసుమిత్రుల వరకు కొనసాగింది. ఆ తరువాత కాలప్రవాహంలో కొట్టుకుపోయిన ఆ పరాక్రమ చిహ్నాలను ప్రథమ చంద్రగుప్తుని కుమారుడు, గుప్తవంశానికి చెందిన రెండవ చక్రవర్తి సముద్రగుప్తుడు మరల ఏరి పట్టుకున్నారు. ఆయన అశ్వమేధ యజ్ఞానుష్ఠానం ద్వారా సణతట, దువాక్, కామరూప, నేపాల్, కర్తపూర్, పూర్వ మధ్యమ పంజాబులు, మాలవా, పశ్చిమ భారతదేశంలోని గణరాజ్యాలకు, కుషాణులు, శకులకు సమైక్యతలో శిక్షణనిచ్చారు. అశ్వమేధ ప్రభావం వల్ల దక్షిణ భారతమంతా ఏకసూత్రంలో బంధింపబడింది.




ఆయన శౌర్యానికి అబ్బురపడి పాశ్చాత్య చరిత్రకారులు ఆయనను నెపోలియనన్న పేరుతో పిలిచారు. ఆయన చేసిన అశ్వమేధ యాగాలకు సంబంధించిన విశేషాలను కుమారగుప్తుని శాసనాలలో, ఇఫిగ్రాఫియా ఇండికాలో చూడవచ్చు.

సముద్రగుప్తుని తరువాత అశ్వమేధయాగాన్ని నిర్వహించిన రాజుల వివరాలు నామమాత్రంగా ఉన్నాయి. వాటిలో సాంస్కృతిక వైభవం కానీ, భావనాత్మకమైన విస్తరణ గానీ, ప్రజలకు జీవన విధానాన్ని నేర్పే లక్షణాలు గాని కనుపించవు. కానీ ఇప్పుడు జరుగుతున్న ఈ అశ్వమేధ యజ్ఞ పరంపర సముద్రగుప్తుని తరువాత జరుగుతున్న మహత్తర సంఘటన. వీటి ద్వారా గతంలో భారతదేశంలో జరిగిన ఘటనలను గుర్తుతెచ్చుకోవచ్చు. వీటివలన కలిగే మంచి పరిణామాల రూపంలో మరల కృతయుగం ఉదయించి, దేశం సిరిసంపదలతో తులతూగి, భారతీయ జ్ఞాన విజ్ఞానాలు విస్తరించి, విశ్వరాజ్యం ఉదయించడం, వసుధైవ కుటుంబక భావం వ్యాపించడం వంటి ఆశ్చర్యకర పరిణామాలు ప్రత్యక్షంగా అనుభవంలోకి రాగలవనడంలో సందేహం లేదు.

HHH

**విద్య లేకుంటేను విభవమ్ము రోత, వినయమ్ము లేకుంటె విద్యలూ రోత.**

# అశ్వమేధం, సవిత, గాయత్రీ సాధన


సృష్టి నిర్మాణం పరమాత్మ ద్వారా జరిగిందని, ఈ కార్యక్రమం అశ్వమేధ యజ్ఞం అని శతపథ బ్రాహ్మణ గ్రంథంలో ఋషులన్నారు. కాబట్టి మొదటి యజ్ఞకర్త పరమాత్మ. యజ్ఞానికి అధిష్ఠాతకూడా ఆయనే అని ఋగ్వేద, యజుర్వేదాలలో వివరించారు. ఈ ప్రథమ యజ్ఞంలో యజ్ఞకర్తా, యజ్ఞాగ్ని, యజ్ఞ హవిస్సు అన్నీ ఆ పరమాత్మే.

సృష్టికి ముందు అన్ని పదార్థాలు అచేతనంగా పడి ఉంటే పరమాత్మ ప్రాణరూపంగా అందులో చేరి వాటి నన్నిటిని సక్రియ పదార్థాలుగా చేశాడు. అన్నిటా ప్రాణరూపి అయిన పరమాత్మను “అశ్వ” అన్నారు. ఆయన యజ్ఞభావంలో అన్నిటా ప్రవేశించాడు. కనుకనే ఆయనని ‘మేధ’ అన్నారు.

**దేవాం యద్యజ్ఞం తన్వానా అయజన్ పురుషమ్ పశుమ్**

దీని అర్థం – యజ్ఞాన్ని విస్తృతం చేస్తున్న పరమాత్మ దీనిలోనే పశురూపంలో బద్ధుడైఉన్నాడు అని. ‘పశు’ అంటే జంతువు కాదు. చూచేవాడు అని అర్థం ఉంది. ‘అశువ్యాప్నోతి’– అశ్వము అని కూడా అన్నారు. యజ్ఞాగ్నితోపాటు ఆహుతి ఏకమయినట్లే, సృష్టిలోని విభిన్న ప్రాణులలో ఉన్న పరమాత్మ యొక్క యజ్ఞ ప్రక్రియను ‘మేధ’ అన్నారు. మొట్టమొదట పరమాత్మ చేసిన ప్రాణ సంచార ప్రక్రియనే ‘అశ్వమేధ’ మన్నారు. మేధకు క్రియారూపంగా అర్థం తీసుకుంటే – ‘నా ద్వారా చేయబడిన’ అని కూడా అర్థం వస్తుంది. పరమాత్మ చేతన అశ్వరూపంలో సంచరిస్తూ ఉంటుంది. అది పదార్థంలో కాని, ప్రాణిలోకాని చేరితే దానినే మేధ అంటారు.

**పురుష ఏ వేదం సర్వం**
**యద్భూతం యచ్చ భవ్యమ్**
**ఉతామృతత్వస్యేశానః**
**యదన్నేనా తి రోహతి**



వృషభ ధ్వజం

జరిగినది, జరగబోయేది ఆయనే! అమరత్వాన్ని నియంత్రించేది, అందరిలో ఉండేది ఆయనే!

ప్రాణ ప్రసార ప్రక్రియ జరిగాక, దివ్యచేతనను ధరించి దానిని ప్రసారం చేసే సూర్య, చంద్రుల ఉత్పత్తి జరిగింది.

**చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత**

యజ్ఞ పురుషుని మనస్సు నుండి చంద్రుడు, కళ్ళ నుండి సూర్యుడు ఉద్భవించారు.

**హుతః తస్మాద్యజ్ఞాన్ సర్వ రుచః సామాని జజ్ఞిరె ।**

సర్వహుత, యజ్ఞం మూలాననే ఋగ్వేద సామవేదాలు పుట్టాయి.

మూడవ స్థితిలో ప్రకృతి ఆవిర్భవించింది.

**యత్పురుషేణ హవిషా దేవా యజ్ఞమ తన్వత ఇమ**
**వసంతో అశ్యాసీదాజ్యం, గ్రీష్మ ఇధ్మః శరద్ధవిః**

దేవతలు యజ్ఞం చేస్తే – వసంత ఋతువు నేయిగా, గ్రీష్మఋతువు సమిధ – ఇంధనంగా, శరదృతువు హవిష్యాన్నంగా అయ్యాయి.

అంతరిక్షంలో జరిగిన ఈ యజ్ఞం మూలంగా ప్రాణికోటి సృష్టి పోషణ పద్ధతి నడిచింది.

**త్రిపాదూర్ధ్వÊఉదైత్ పురుషః యదోస్యేహా భవాత్ పునః ।**
**తతో విషవన్ వ్యక్రామత్యాశనానశనే అభి ॥**

అన్నాహారులు, కానివారు అన్నిటిని వ్యాపింపచేశారు. ప్రాణ సంచారం అన్నిటిలో జరుగుతూ మేధ అన్నిటా వ్యాపించింది. ప్రాణ సంచారం చేసే దైవికమైన అశ్వమేధం మూలంగా సృష్టి క్రమం నిర్భయంగా సాగుతోంది.

**ప్రాణ సంచారక్ సవితా**

**క్రోధం, లజ్జ, గర్వం, హర్షం, ఆత్మస్తుతి – వీటికి లొంగనివాడు పండితుడు – q^Î°~¡hu.**

సవిత చేతనాశక్తికి మూలం. భూమండలానికి సూర్యుడే సవిత.

సూర్యుడే అశ్వమేధం, సూర్యుని మూలంగా సమస్త ప్రాణి సంచారం నడుస్తోంది.

**అసౌ ఆదిత్య - సోశ్వమేధ**

సూర్యుడే ఉత్తముడు. ఆయనే అశ్వమేధం. శాస్త్రాలన్నీ సూర్యుడే సర్వప్రాణులకు చైతన్యాన్నిస్తాడని నిరూపిస్తూ చెప్పాయి.

సూర్యుడు దినకరుడు. ఉదయమే తన చిరుహస్తాలతో ప్రాణి కోటిని లేపి నిత్య చైతన్యాన్ని నింపుతాడు. అందుకే ఆయనను **'ప్రాణ స్వరూపం'** అంటారు.

సవితయే ప్రాణం అని నొక్కి చెప్పింది ఐతరేయ బ్రాహ్మణం.

**ఆదిత్యాహవై ప్రాణః -** ఆదిత్యుడే ప్రాణం

**విశ్వరూపం హరిణం జాత వేదసం**
**పరాయణం జ్యోతిరేకం తపంతం**
**సహస్రరశ్మిః శతధా వర్తమానః**
**ప్రాణ ప్రజానాముద మత్యేష సూర్య**

అంటే - సమస్త ప్రపంచానికి ప్రాణ స్వరూపం సూర్యుడే! ఈయన తప్ప జీవశక్తి నిచ్చే వారెవరూ వేరొకరు లేరు. వేడి, వెలుతురు, జీవశక్తి, ఋతుపరివర్తన మొదలైన కార్యక్రమాలన్నీ నిర్వర్తిస్తూ అమృతకలశంలా నిత్యం సూర్యుడు ఉదయిస్తాడు.

ప్రాణి చేతనత్వం సూర్యుని ద్వారా జరుగుతుంటే అతనిని సోశ్వమేధం - అశ్వమేధం అని చెప్పారు. అశ్వమేధ యజ్ఞంలో సవితా సాధన ఆహుతి ఎలా ఇవ్వాలనే పద్ధతులు వివరించబడ్డాయి. శతపథ బ్రాహ్మణంలో

**అథ సావిత్రీ మిష్ఠం నిర్వపతి । సమిత్రే ప్రసవిత్రే**
**సవితావై ప్రసవితా సవితా భÊఇమ్**
**యజ్ఞం ప్రసువాదితి ॥**

సవితకు ఇష్ఠి ఇవ్వబడుతుంది. సవితాప్రసారం కోసం సవిత యజ్ఞప్రేరణ నిస్తుంది.


**అథ ద్వితీయాం నిర్వపతి, సవిత్ర ఆసవిత్రే**
**సవితావా ఆసవితా సవితా మÊఇమం**
**యజ్ఞం మాసు వాదితి ॥**

రెండవ ఆహుతి సవితా ఆసవితాకు ఇయ్యబడుతుంది. సవిత ఆసవిత. సవితాదేవుడు మనకు యజ్ఞంలో ప్రేరణ కల్పించుగాక!

**అథ తృతీయాం నిర్వపతి సవిత్రే సత్యప్రసవాయ**
**హవై సత్యప్రసవోయ సవితుః సత్యేనమే ప్రసవినేమం,**
**యజ్ఞం ప్రసువాదితి ॥**

మూడవ ఆహుతి సత్యాన్ని ఆవిర్భవింపచేస్తుంది. సత్యాన్ని ఆవిర్భవింపచేయడంతో యజ్ఞానికి ప్రేరణ లభిస్తుంది.

భూమండలానికంతటికి ప్రాణ సంచార కేంద్రమైన సూర్యుడి ప్రాణ ప్రక్రియని విస్తరింపచేసి వృద్ధి చేయడానికి అశ్వమేధం ఉపయోగపడుతుంది. అశ్వమేధం దేశ ప్రజల ప్రయోజనం కోసమే చేయాలి.



గదా పతాకం

సవిత గాయత్రీ మహామంత్రానికి దేవత. విశిష్టమైన కోరికలు తీర్చుకొనడానికి గాయత్రిని ఆధారం చేసుకొని సవితాశక్తిని సాధన చేయాలని శాస్త్రాలు చెపుతున్నాయి. సూర్యుడు ప్రాణరూపమైతే గాయత్రి ప్రాణుల త్రాణ రక్షించే ప్రాణవిద్య. అసలు ఇవి రెండూ ఒక దాని కొకటి పూరకాలు.

**సోహై షా గాయాంస్త్రే ।**
**ప్రానావైగాయాస్తత్ ప్రాణాస్తంత్రే**
**తద్ యద్ గయాంస్త్రే తస్మాత్ గాయత్రీ నామ-స**
**యామ్-వామ్ మన్యాహర్షైవసా,**
**సయస్మై అన్యాహ తస్య ప్రాణాం స్త్రాయతె ।**

గోవులను రక్షించేది కనుక గాయత్రి అన్నారు. ప్రాణాలను గోవులంటారు. గురువు ఏ సావిత్రిని ఉపదేశిస్తాడో

**మితభాషణం, మిత స్వచ్ఛాహారం, ఇంద్రియ నిగ్రహాల ద్వారా మనిషి తనలోని విద్యుచ్ఛక్తిని పెంచుకోవచ్చు.**

అది ఈ గాయత్రే. ఈ మంత్రం ఎవరికి ఉపదేశించబడుతుందో అది వారిని రక్షిస్తుంది.

అథర్వవేదంలో గాయత్రీ మాతస్తుతి '**స్తుతా మయా వరదా**' ప్రసిద్ధమైనది.

**"వేదమాతా ప్రచోదయాంతాం"**

సరియైన మార్గంలో నడిపించేది గాయత్రి. సవిత ప్రసవశక్తిని, ప్రేరణను ఉత్పత్తి చేసేది. గాయత్రి బ్రహ్మవర్చస్సును ప్రసాదించేది అని అథర్వణవేదంలో చెప్పారు. శతపథబ్రాహ్మణంలో సూర్యుణ్ణి బ్రహ్మవర్చస్సు అన్నారు.

**అసౌవా - ఆదిత్యా. ఏకాకీ చరత్యేష బ్రహ్మవర్చసమ్**

ఒంటరిగా నడిచే సూర్యుడే బ్రహ్మవర్చస్సు.

పై విషయాలు చదువుతూంటే స్పష్టమయ్యేది ఏమిటంటే – అశ్వమేధ యజ్ఞం ప్రాణ సంచార ప్రక్రియ రూపంలో ప్రజాపతి ద్వారా చేయించబడింది.

సూర్యుడన్నా, బ్రహ్మవర్చస్ అన్నా, అశ్వమేధం అన్నా, ఒకటే అర్థం. గాయత్రీ మహా విద్యవలన కూడ బ్రహ్మ వర్చస్సు ఉత్పన్నమవుతుంది.



చక్ర పతాకం

దేశ సౌభాగ్యం కోసం, కళ్యాణం కోసం, ఉన్నతి కోసం అశ్వమేధం చేస్తే సూర్యోపాసనా, గాయత్రి సాధన అనివార్యం. అందుకే ఈ రోజుల్లో అశ్వమేధ యజ్ఞ పరంపర పల్లె పల్లెకు, గడప గడపకూ తిరిగి మనిషి మనిషికి గాయత్రీ ఉపాసన ఆవశ్యకతను వివరించి ఆచరింప చేయడం కర్తవ్యమైంది. దివ్య చైతన్య ఆవిర్భావం కోసం, అశ్వమేధం కోసం, అనివార్యమైన దేవసంస్కృతి దిగ్విజయ యాత్రకోసం అనుకూల వాతావరణం నెల కొల్పడానికి కోట్ల కొలది భక్తులు గాయత్రీ ఉపాసకులుగా మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రండి. గాయత్రీ మహామంత్రం మహిమను తెలుసుకోండి.

H H H

## పని ఒకటే; దృష్టికోణం వేరు

స్వామి వివేకానంద శిష్యులతో కూడి పర్యటనకై బయలుదేరారు. దారిలో ఒక దేవాలయ నిర్మాణం జరుగుతోంది. స్వామి అక్కడ ముగ్గురు కూలీలతో సంభాషణ జరిపారు. ముగ్గురిని అడిగిన ప్రశ్న ఒకటే, 'భాయీ, ఏం చేస్తున్నావు?' ఒకడు జవాబు చెప్పాడు– 'చూస్తున్నారు కదా, గాడిదలాగా పనిచేస్తున్నాను. రోజంతా కష్టపడితే ఏదో కాస్త దొరుకుతుంది. పైపెచ్చు యజమాని తిట్లు బెదిరింపులు కూడా భరించాలి. విధి అలా వ్రాసి పెట్టి ఉంది. ఏంచేస్తాం? అనుభవించక తప్పుతుందా?' అప్పుడు రెండవవాడు చెప్పాడు – 'దినభత్యం సంపాదించుకొనేందుకు ఏదో ఒకటి చేయాలి కదా మరి. మరో పని ఎక్కడా దొరకనప్పుడు ఏం చేయగలం? పొట్టపోసుకోవాలికదా ఎలాగో అలా? బ్రతుకు తెరువుకోసం ఈ భారాన్ని మోస్తున్నాను.' ఇప్పుడు మూడవ వాని వంతు వచ్చింది. భక్తి భావనతో అతను ఇలా చెప్పాడు. – 'ఇటు చూడండి. ఇక్కడ దేవునికి మందిరం తయారవుతోంది. నేను చెమటోడ్చి పని చేస్తున్నాను. ఈ గుడి నిర్మాణంలో నా శ్రమ బిందువులు కూడా కొన్ని వినియోగపడుతున్నాయి. నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇదే నాకు తృప్తి. ఇటు తిండి గడుస్తున్నది. అటు దేవుడి పని కూడా పూర్తి అవుతున్నది.'

ఈ ముగ్గురు కూలీలతో సంభాషణ ముగిసిన తరువాత స్వామీజీ శిష్యులతో ఇలాచెప్పారు. 'మీరు విన్నారుకదా. ఈ ముగ్గురూ పనిచేసే పద్ధతిలోను, భావాలలోనూ ఎంత వ్యత్యాసం ఉంది! మందిరాన్ని ముగ్గురూ నిర్మిస్తున్నారు. ఒకనిది గాడిద బరువు మోస్తున్నట్లుగా నిస్సహాయత. రెండవవాడిది యంత్రంలాగా పనిచేస్తున్నాననే చింత. పనిలో నిమగ్నుడయిన మూడవవానిది సమర్పణ భావన. ఈ ముగ్గురూ చేసే పనితీరులో నిపుణతలో కూడా ఇదే తేడా ఉంది. పనిచేసేటపుడు ఆ పనిపట్ల ఉండే దృష్టికోణానికి చాలా ప్రాధాన్యం ఉంది. భావన చాలా ముఖ్యమైన అంశం.'

**ఊబవళ్లు సౌందర్యం కాదు. డబ్బుండడం గొప్పతనం కాదు.**

# సౌరశక్తిని మథించే ప్రక్రియ అశ్వమేధం

సూర్యునికి, మానవ జీవనానికి గల సంబంధం తెలుసుకోవాలి అనుకుంటే మనం విజ్ఞాన శాస్త్రం అందించిన భౌతిక ప్రయోజనాలకు మాత్రమే పరిమితం కాకూడదు. భారతీయ ఆధ్యాత్మిక రంగంపైన కూడ దృష్టి సారించడం అత్యవసరం. జలంలో, వాయువులో, వనస్పతులలో, భౌతిక జగత్తులో మార్పునకు కారకుడుగానే సూర్యుని పాశ్చాత్య దేశాలలో గుర్తిస్తారు. కాని సాధనా విజ్ఞానవేత్తలు మనిషి మనోభావాలతో కూడ సూర్యునికి సంబంధం ఉందని చెపుతారు. ఈ సూక్ష్మ విజ్ఞానాన్ని వివరిస్తూ గెలీలియో సూర్యుడు సంపూర్ణుడు కాడని చెప్పాడు. సూర్యుడు ఒక విధమైన చైతన్య శక్తి. అది సౌరమండలంలోని ప్రతి పరమాణువులోను విరాజిల్లుతున్నది. అంతేకాక పరమాణువులలో ఉన్న సూర్య బీజాలు సూర్యునితో సమానమైన శక్తిని, సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇంతకు ముందు ఈ విషయం పూర్తిగా ఉపేక్షించబడింది. తరువాతి వైజ్ఞానికులు విస్తృత అధ్యయనం చేసి, మానవుడు పూర్తిగా సూర్యునిపైనే ఆధారపడి ఉన్నాడని నిర్ధారించారు. సూర్యునితో మానసిక సంబంధం ఏర్పరచుకొని ప్రకృతి రహస్యాలను, శక్తులను పొందడానికి, ఆత్మ వికాసానికి గాయత్రీ విద్య మాధ్యమంగా ఈ దేశంలో విస్తృత పరిశోధనలు జరిగాయి.

మానవుని శరీరం పృథ్వి, సూర్యుల సమ్మేళనంతో తయారైంది. కనుక ఈ శరీరం పృథ్వి వలననే కాక సూర్యుని వలన కూడ తీవ్ర ప్రభావానికి లోనవుతుంది. అన్నం, జలం మొదలయిన పృథ్వీరసాల సేవనం వల్లనే శరీరంలో ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ ధాతువులు, గంధకం మొదలయిన తత్వాలు ఉత్పన్నమవుతున్నాయి. అలాగే ఈ తత్వాలకన్న సూక్ష్మమైన ప్రాణశక్తి కూడ ఈ శరీరంలో పని చేస్తున్నదని శరీరాన్ని గురించి అధ్యయనం చేయడం వలన స్పష్టమవుతుంది. ప్రాణం వలననే శరీరంలో స్పందనలు ఏర్పడుతున్నాయి. శరీరంలోని కదలికలన్నీ ప్రాణం ఉన్నప్పుడే జరుగుతాయి. ఈ క్రియలన్నీ జడత్వంలో జరగవు. అన్ని తత్వాలలోను ప్రాణం సూక్ష్మమైనది. అందువలన దానిని గుర్తించలేము. గాయత్రీ విద్య ద్వారా దీనిని సునాయాసంగా తెలుసుకోవచ్చు.

ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యునిలో మౌలికంగా రెండే తత్వాలు ఉన్నాయి అంటారు. ఒకటి – హైడ్రోజన్, రెండు – హీలియం. సూర్యుడు హైడ్రోజన్‌ను గ్రహించి దానిని హీలియంగా మారుస్తాడు. దీని ద్వారానే సూర్యునికి శక్తి లభిస్తుంది. ఉష్ణము, వెలుగు ఉత్పన్నమవుతాయి. ఈ ప్రక్రియ అనేది లేకపోతే సూర్యుడు మనకు కనిపించను కూడా కనిపించడు. సూర్యుడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి తత్వము. దానిని ఆత్మ అనవచ్చు. ప్రాణశక్తి అనవచ్చు. భగ భగ మండే అగ్నిగోళం అనవచ్చు. సూర్యుడు మండే అగ్నిగోళమని భ్రమపడే వారు దూరదృష్టితో సూర్యుని అధ్యయనం చేసి తీరాలి. సూర్యునిలో యజ్ఞకుండంతో సమానమైన అగ్ని జ్వాలలు ఉద్భవిస్తూ ఉండడమే కాక వెలుగు, వేడి, విద్యుత్తులు సమ్మిళతమైన శక్తి సుడిగుండాలు బ్రద్దలవుతూ ఉంటాయని దీనివలన స్పష్టమవుతుంది.

ఇలాంటి క్రియలే కొన్ని మన శరీరంలో కూడ జరుగుతుంటాయి. అలాంటి శక్తి ఆలోచనల రూపంలో మనలో ఉంది. ఇది కేవలం స్పందనలాంటి క్రియే. అందువలన ఇది మనకు కనిపించదు. అయితే శరీరంలోని శక్తిలో అధిక భాగం ఈ విధంగానే బయటపడుతుంది. మనిషిని వివిధ స్థూల తత్వాలతో కూడిన ప్రాణిగా అంగీకరించినపుడు – సూర్యుడిని కూడ అవే శక్తుల సూక్ష్మ వాయువుల స్థితి కలిగిన ఆలోచించే ప్రాణిగా అంగీకరించవలసి వస్తుంది. సూర్యశక్తి అనంతమైనది. విశాలమైనది. అది నిరంతరం ఇస్తూనే ఉంటుంది. అందువలననే దానిని దేవతగా సంబోధించే ఆచారం ఉన్నది. ఈ విధంగా భావనలు, ఆలోచనల కేంద్రంగా పరిగణించి

**కాలం నీ కోసం ఆగదు అని తెలిపే సాధనం గడియారం.**

సూర్యుడిని మథించితే శారీరక, మానసిక, సామాజిక, పారిశ్రామిక, బుద్ధిపర, ఆధ్యాత్మిక వరాలను పొందవచ్చు. గాయత్రీ మంత్రం ద్వారా ఈ విద్యే భూమి మీద స్థాపించబడింది.

ఈ మహామంత్రంలోని 24 అక్షరాల కంపనాలు సామాన్య తత్వాలతో నిండిన మనిషికి సూర్యునితో స్థూల సంబంధాన్ని ఏర్పరుస్తాయి. సూర్యునిలోను, మనిషిలోను ఉన్న తత్వం ఒక్కటే. శాస్త్రకారులు ఈవిధంగా చెబుతున్నారు.

**"సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ"** – సూర్యుడు జగత్తుకి ఆత్మ. మన చేతన శరీర జగత్తుకి ఆత్మ. ఈ రెండు చేతనా శక్తులను సమాన గతిలో కంపింపజేసి సంబంధాన్ని స్థాపించే సామర్థ్యం ఈ 24 అక్షరాలలో ఉన్నది. దీనినే గాయత్రీ మంత్రం అంటారు.

ఈ కారణంగానే ఉపాసనా తత్వవేత్తలు గాయత్రీ మాతను నిత్యం ఉదయకాల సూర్యమండల మాధ్యమంగా ధ్యానించాలని చెబుతారు –

శాస్త్ర వచనాల ప్రకారం –

**గాయత్రీ భావయేద్ దేవీం సూర్యసార కృతాశ్రయమ్।**
**ప్రాతర్మధ్యాహ్నే ధ్యానం కృత్వా జపేత్సుధీ ॥**

– శాకానంద తరంగిణి 3/4/1

అర్థం :– బుద్ధిమంతుడైన మనిషి సూర్యుని రూపంలో ఉన్న గాయత్రీ దేవిని ప్రాతఃకాలం, మధ్యాహ్నం, సాయంకాలం ధ్యానించి జపం చేయాలి.

సూర్యునికీ, గాయత్రికీ తేడా లేదు. అగ్ని, వేడిమి లాగా ఈ రెండూ కలసి ఉంటాయి. ఈ ఐక్యతను ఋషులు ఈ విధంగా చెబుతున్నారు–

**నమస్తే సూర్య సంకారో సూర్య గాయత్రికే Eమలే ।**
**బ్రహ్మవిద్యే మహావిద్యే వేదమాతా నమోస్తుతే**

అనగా – సూర్యునితో సమాన రూపం గల ఓ గాయత్రీ, నీవు అమలవి (స్వచ్ఛమైన దానివి), బ్రహ్మ విద్యవి, మహావిద్యవి, వేదమాతవి. నీకు నా ప్రణామం.

ఈ మహామంత్రం సాధన చేసే వారిలోకి సూర్యశక్తి ప్రవహించడం ప్రారంభమవుతుంది. విజ్ఞాన శాస్త్ర నియమాల ప్రకారం – రెండు కేంద్రాలలోని ఒక కేంద్రంలో శక్తి తక్కువగా ఉన్నపుడు రెండూ సమతూకం పొందేవరకు మొదటి కేంద్రం నుండి రెండవ కేంద్రానికి శక్తి ప్రవాహం జరుగుతూ ఉంటుంది. గాయత్రి వలన లభించే సిద్ధి ఈ తాదాత్మ్యం యొక్క పరిపక్వ స్థితే. అపుడు మనిషి ఈ భౌతిక శరీరంతోనే సూర్యశక్తితో సమానంగా సర్వవ్యాపి, సర్వదర్శి, సర్వ సమర్థుడు అవుతాడు. వాతావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని, మానసిక విషయాలను తెలుసుకునే సామర్థ్యాన్ని పొందడమే కాక, అత్యంత సూక్ష్మమైన శక్తులకు అధికారి అవుతాడు. ఈ కారణంగానే వారిలో సద్బుద్ధి, పరమార్థ భావన అంతర్గతంగా వికసిస్తాయి. ఉపాసనతోపాటు తమ సద్గుణాలను, సదాలోచనను మరింతగా సత్కర్మలలో వినియోగిస్తారు.

ప్రశాంతంగా, ప్రసన్నంగా ఉన్నవారికి ఏదైనా విషయాన్ని భావనాత్మకంగా నివేదిస్తే వారినుండి ఆశావహమైన మద్దతు లభించడం సహజం. నిశ్చలంగా, ప్రశాంతంగా ఉన్న జలాశయంలో ఒక రాయి విసరడం ద్వారా తరంగాలను ఉత్పన్నం చేయవచ్చు. ఇది భావన, విజ్ఞానాల సమ్మిళిత కార్యం. భారతీయ శాస్త్రకారులు ఏ ఆచారాలను, ఏ విజ్ఞానాన్ని ఆవిష్కరించినా ఈ సిద్ధాంతాన్ని దృష్టిలో పెట్టుకునేవారు. పరమపూజ్య గురుదేవులు ఈ సూక్ష్మ దర్శనాన్ని దృష్టిలో పెట్టుకొనే అనేక విలక్షణ ప్రయోగాలు చేశారు. సాధనా తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం – ప్రత్యేకమైన అవసరాల కోసం ప్రత్యేకమైన రీతిలో గాయత్రి ఉపాసన, యజ్ఞాది కార్యక్రమాలు చేపడితే, సూర్యదేవుని ఆధ్యాత్మిక శక్తులను విశేషంగా ఆకర్షించవచ్చు. దాని వలన కేవలం మనకే కాక సమాజానికి, దేశానికి, విశ్వానికి సుఖ సమృద్ధిని, శాంతిని సంపాదించి పెట్టవచ్చు.

**కన్నులు లేనివాడు అంధుడు కాదు. విద్యావిహీనుడే అంధుడు.**

1958 అక్టోబరులో జరిగిన సహస్రకుండీ యజ్ఞం ఇలాంటి ఒక ప్రయోగమే. వాతావరణ శాస్త్రవేత్తలు కూడ ఈ విషయాన్ని సమర్థించారు. 1.7.1957 నుండి 31.12.1958 వరకు ఖగోళ శాస్త్రవేత్తలు "అంతర్జాతీయ శాంత సూర్య సంవత్సరం" 'ఇక్వసీ'గా ప్రకటించారు. ఈ కాలంలో సూర్యుడు పూర్తిగా శాంతంగా ఉన్నాడు. శాస్త్రవేత్తలకు దీని మీద అనేక అధ్యయనాలు, ప్రయోగాలు చేసే అవకాశం కలిగింది. ఈ దినాలలో పూజ్య గురుదేవుల నిర్దేశకత్వంలో సాధకులు విశేష గాయత్రీ సాధనలు చేశారు. 1958 అక్టోబరులో నాలుగు రోజుల యజ్ఞం తరువాత ఆయన ప్రయోగాలు ఎప్పుడూ కుంటుపడలేదు. ప్రజ్ఞా పురశ్చరణలు, సూర్యధ్యానము, కల్పసాధన, మహాయజ్ఞాలు దేశవ్యాప్తంగా జరిగి, వాటిని అధ్యయనం చేసే అవకాశం కలిగింది. ఆ అధ్యయనాల ఉద్దేశ్యం వాటి ప్రయోజనాలను సమస్త విశ్వ సమాజానికి చేర్చడమే. ఇలాంటి ప్రయోజనాలను దేవశక్తుల నుండి సులభంగా పొందవచ్చు.

ఈ ప్రయోగాలతో పాటు విశ్వం యొక్క కార్యకలాపాలలో భారీ మార్పులు, చేర్పులు జరిగాయి. ప్రకృతి తన విధానాన్ని మార్చుకోవడమే కాక ప్రజల ఆలోచనలలో, భావనలలో కూడ మార్పులు వస్తున్నాయి. పాశ్చాత్య దేశాలలోని విలాస ప్రియులు, భౌతిక వాద జన సముదాయం కూడా ఆధ్యాత్మికతను ఆశ్రయించడానికి ఆతురత చూపుతున్నారు. భరతఖండం విశ్వ పరివర్తనకు మూలకేంద్రము. దీనిని కేంద్రంగా చేసుకొని విశ్వపరివర్తన కోసం సూక్ష్మ జగత్తులో జరుగుతున్న కార్యకలాపాలను సాధనాపరులు సహజంగానే చూడగలుగుతారు. దైనందిన జీవితంలో సూర్యుని శాంత స్థితి ప్రాతఃకాలంలోను, సంధ్యాసమయంలోను ఉంటుంది. ఈ సమయాలలోనే నవరాత్రులు జరుపుకోవడం మన ఆనవాయితీ. ఈ సమయాలలో సాధన చేసే విధానం సూర్యుని భౌతిక ప్రకృతి యొక్క అన్వేషణా ఫలితమే. అది పూర్తిగా విజ్ఞాన సమ్మతం. దీర్ఘకాల కాలచక్ర ప్రకారం ఈ దినాలలో మహాకలి జరుగవలసి ఉంది. అంతర్జాతీయ శాంత సూర్య సమితి 1964 జనవరి 1 నుండి డిశెంబరు 1965 వరకు రెండవ శాంత సూర్య సంవత్సరాలుగా ప్రకటించింది. సూర్యునిలో కొన్ని విశేష స్పందనలు ఉత్పన్నం అవుతున్నాయని ప్రకటించింది. తరువాత సూర్యునిలో మచ్చలు కనిపిస్తాయి. తద్వారా భూమి వాతావరణంలో పెద్ద గందరగోళం ఏర్పడుతుంది. సూర్యునిలోని మచ్చలు కారణంగా భూమి మీద ప్రకృతి పరివర్తనల క్రమం 1999 తరువాత వస్తుంది. అయితే మహాకాలుని ప్రణాళికకు అనుగుణంగా శీఘ్రగతిన విశ్వపరివర్తన చేసే లక్ష్యాన్ని ఈ క్రమం తారుమారు చేసింది. ఫలితంగా అతివృష్టి, అనావృష్టి, యుద్ధాలు, మహమ్మారి రోగాలు ఎదురవుతాయి. ప్రకృతి ప్రకోపాల నుండి సూర్యశక్తితో సంబంధం ఏర్పరచుకున్నవారే రక్షింపబడతారు.

భారతదేశం పరాయి పాలన కబంధ హస్తాలలో 1500 సంవత్సరాలు బంధింపబడవలసి వచ్చింది. ఆ దుష్ప్రభావం ఇప్పటికీ ఉన్నది. గాయత్రీ తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం- అది 20వ శతాబ్దం తోటే అంతమవుతుంది. గ్రహగణితాల ప్రకారం భూమి సూర్యుని చుట్టూ ఒక సారి తిరగడానికి 9కోట్ల 30 లక్షల మైళ్ళు పయనించాలి. ఈ యాత్రను భూమి గంటకు 67 వేల మైళ్ళ వేగంతో పయనించి 365.25 రోజులలో పూర్తి చేస్తుంది. ప్రతి భ్రమణానికి 1/4 దినం పెరుగుతూ ఉంటుంది. ఒక నూతన సంవత్సరాన్ని పూర్తి చేసుకొని భూమి మళ్ళీ అదే కక్ష్యలోనికి ప్రవేశించడానికి 365.25.4×1461 సంవత్సరాలు పడుతుంది.

ఈ 1461 సంవత్సరాల క్రమం 2000 సం॥నకు పూర్తయింది. ఈలోగా సూర్యుని ప్రచండ శక్తులు భూమి మీద ఆవిర్భవించాయి. మానసికంగా ఆధ్యాత్మికవాదులు అనేవారు ఉండరు. ఆ శక్తులు ఆ విధంగా భ్రష్టు పట్టిస్తాయి. గాయత్రీ ఉపాసకులు ఈ పరివర్తనలను కుతూహలంగా చూస్తుంటారు. ఈ కఠిన పరిస్థితులలో సైతం స్థిర బుద్ధితో వ్యవహరిస్తారు. తల్లి ఎంత కోపగించుకున్నా పిల్లవాడు భయపడడు. అటువంటి సాహసాన్ని గాయత్రీ సాధకుడు పొందుతాడు. అంతేగాక ప్రార్థన ద్వారా అటువంటి పరిస్థితులను శాంతపరుస్తాడు.

**కళ్ళు లేనివాడు కాక - తన తప్పు కప్పిపుచ్చుకునేవాడే అంధుడు.**

ఈ దినాలలో భారతభూమిలోనే కాక సమస్త విశ్వంలో జరుగుతూన్న అశ్వమేధ యజ్ఞముల పరంపర పూజ్య గురుదేవుల ప్రేరణతో ప్రారంభమైన విలక్షణ ప్రయోగమే. ఈ ప్రయోగాన్ని 1958లో జరిగిన సహస్రకుండీయ మహాయజ్ఞము యొక్క కొనసాగింపుగా చెప్పవచ్చు. అశ్వమేధ యజ్ఞ ప్రక్రియతో గాయత్రికి, సూర్యునికి లోతైన సంబంధం ఉన్నది. శతపథ బ్రాహ్మణం ప్రకారం.

**సవితా వై ప్రసవితా సవితా మఇమం**

**యజ్ఞం ప్రసువాదితి**

– శతపథ బ్రాహ్మణం 13/4/2/6. అశ్వమేధ ప్రకరణం

అర్థం :– సవితను ప్రేరేపించే ఓ సవితా! నా ఈ యజ్ఞమునకు ప్రేరణ నిమ్ము.

ఇదే ప్రకారం గాయత్ర్యే జుహోతి అని చెబుతూ గాయత్రీ మంత్ర ఆహుతులు ఇచ్చే విధానం ఉన్నది. ఈ ప్రక్రియ ద్వారా మానవ జాతికి ఖచ్చితంగా సూర్యునితో సంబంధం ఏర్పడుతుంది. తద్వారా సమస్త విశ్వానికి అనేక వరాలు, లాభాలు సమకూరుతాయి.

అంతరిక్ష కిరణాల ఉత్తర జ్యోతి, భూమ్యాకర్షణ క్షేత్రము అయిన అయనోస్ఫియర్ మీద సూర్యుని ప్రభావాన్ని అధ్యయనం చేసిన తరువాత వైజ్ఞానికులు సూర్యుడు తనకు తానే ఉత్తేజితుడవుతాడని చెప్పారు. ఉత్తేజితుడయిన సూర్యుడు తన సౌరమండలాన్ని (భూమితో సహా) మథనం చేస్తాడు. ఆ మథనం నుండి జ్వాలలు, సూక్ష్మ కణాలు కురుస్తాయి. తరువాత ఈ కణాలు ఎక్కడ విలీనమవుతాయో వైజ్ఞానికులకు అంతుచిక్కడం లేదు. అయితే ఆత్మవిద్యావేత్తల అభిప్రాయం ప్రకారం – సృష్టిలోని ప్రతి అణువణువులోను ఈ ఉత్తేజిత కణాలు అల్లకల్లోలాన్ని సృష్టిస్తాయి. దీనివలన స్థూల ప్రకృతేకాక మనిషి యొక్క సూక్ష్మ ప్రకృతి కూడ ప్రభావితం అవుతుంది. ఆలోచనలు, భావనలు, సంకల్పాలు, విశ్వాసం అన్నీ పరివర్తన చెందుతాయి. విజ్ఞానవేత్తలకు ఇది అవగాహన కాకపోవచ్చు. సామూహికంగా రాజనీతి, పరిశ్రమలు, వ్యాపారం, ఉద్యోగాలు, యుద్ధం, సామాజిక కార్యకలాపాల మీద అది చూపే ప్రభావాన్ని బట్టి మనం ఆయా స్థితిగతులను గమనించవచ్చు.

సాధనా గమ్యంలో ఈ రహస్యాల అనుభూతి అశ్వమేధ ప్రక్రియ యొక్క ప్రయోజనంగా, సత్పరిణామంగా విదితమవుతుంది. సాధకులు వేగంగా గాయత్రీ విద్య యొక్క అంతరాంతరాల్లోకి ప్రవేశిస్తారు. సాధన, జ్ఞానార్జన, సంయమనాలలో వారి ప్రవృత్తులు వృద్ధి చెందుతాయి. ఇలాంటి వ్యక్తులే ముందుండి సమస్త విశ్వానికి మార్గదర్శనం చేస్తారు.

గాయత్రి తత్వ మర్మజ్ఞుల ప్రకారం – విశ్వరచనలో రెండే తత్వాలున్నాయి. అవి – దేవతలు లేదా ప్రాణం; భూతాలు లేదా పదార్థం. ప్రాణం లేకపోతే పదార్థంలో కదలిక ఉండదు. పంచభూతాలతో తయారయిన మానవుని దేహం గాయత్రి అక్షరాలలో భాగం. ఉచ్చారణ తరువాత గాయత్రీ అక్షరాలు గాలిలో విలీనమవుతాయి. దాని రెండవ భాగం ప్రాణం – సవిత. దానికి దృశ్య భాగం భౌతికమే అయినా అదృశ్య భాగం మనోమయం. ఈ రూపంలో సూర్యుడు అత్యధిక శక్తిశాలి. ఋషులు సూర్యుడిని త్రయీ విద్య అన్నారు. అనగా సూర్యునిలో మూడు తత్వాలు ఉన్నాయి. ఒకటి స్థూల తత్వం. దీనితో శరీరం తయారవుతుంది. రెండు ప్రాణం. దీనివలన చేతనా శక్తి లభిస్తుంది. మూడు మనసు. ఇది చేష్టలను చేస్తుంది. గాయత్రీ సాధన ద్వారా మనం స్వయంగా సూర్యునితో సంబంధం ఏర్పరచుకున్నపుడు ఆరోగ్యం, తేజస్సు, మంచి మనసు అనే రూపాలలో ఆధ్యాత్మిక లాభం లభిస్తుంది. అశ్వమేధ ప్రక్రియలోని ఒక గొప్ప ప్రయోజనం మానవ సమాజానికి ఈ విద్య యొక్క జ్ఞానాన్ని సరియైన రీతిలో అందించడం. అందువలన భూమి మీద సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరుస్తాయి. ప్రస్తుత యుగపరివర్తన, సంధి, సంక్రాంతి సమయంలో ఈ తత్వాన్ని అవగాహన చేసుకొని సమస్త విశ్వంలో వ్యాపింపజేసే వారికి శ్రేయస్సు, గౌరవం, అధికంగా లభిస్తాయి.

H H H

**అదృష్టం గల డాక్టరుకు ఆయుష్షు గల రోగి దొరుకుతాడు.**

# సూక్ష్మ జగత్తును సంస్కరించే అశ్వమేధ యజ్ఞం

అశ్వ మేధ యజ్ఞంలోని సమస్త కార్యకలాపాలను పర్యవేక్షించినపుడు అది సూక్ష్మజగత్తును, జన మానసాన్ని సంస్కరించే అత్యంత విలువైన ప్రయోగమని స్పష్టమవుతుంది. భౌతిక విజ్ఞానంతోపాటు సూక్ష్మ జగత్తులోని అదృశ్య వాతావరణంలో దేవత్వాన్ని వృద్ధిపరచే తత్త్వం యజ్ఞంలో ఉన్నది. దాని వలన మానవాళి సుఖశాంతులకు అద్భుత సహాయం లభిస్తుంది. వాయుశోధన ఉపయోగం తన స్థాయిలో ఉన్నది. మరొక వాస్తవం కూడ ఉన్నది. వాయుశోధనకన్న మిన్నగా వాతావరణ నిర్మాణం దీని ప్రముఖ ప్రయోజనం. పవిత్ర వేదమంత్రాల యొక్క సస్వర ఉచ్చారణ విశ్వ చేతనలో పవిత్ర తత్త్వాలను నింపే దివ్య ప్రకంపనాలను సృష్టిస్తుంది. సామాన్య అగ్నిని యజ్ఞాగ్నిగా దేవాగ్నిగా మార్చే కార్యాన్ని అధ్వర్యులు, ఉద్గాతల వంటి ప్రత్యేక యాజకులు శ్రద్ధతో, సంకల్పబలంతో చేస్తారు. పవిత్రమైన హవన ద్రవ్యాల హవనం వలన ఉత్పన్నం అయ్యే శక్తి సూక్ష్మ జగత్తులో ప్రయోజనకరమైన పరివర్తన తెస్తుంది. అశ్వమేధ ప్రయోగం వలన ప్రయోజన కరమైన తత్త్వాలు వాతావరణంలో ప్రవేశిస్తాయి. అవి అదృశ్య రూపంలో విశ్వకల్యాణ భూమికను నిర్వహిస్తాయి.

ప్రస్తుతం వాయు కాలుష్యం గురించి ఎక్కువ చర్చ జరుగుతోంది. అణువిస్ఫోటనాలవల్ల కలిగే కాలుష్యం గురించి, పగ, ప్రతీకారాల ఫలితాలను గురించి జనం చింతిస్తున్నారు. తత్త్వవేత్తలు సూక్ష్మ వాతావరణం గురించి మరింతగా ఆలోచిస్తారు. మానవుని దుశ్చేష్టల తుపాను కంటే వాతావరణ ప్రవాహం మరింత శక్తివంతమైనదని వారికి తెలుసు. వాతావరణ ప్రవాహంలో వ్యక్తులు, సమూహాలు ఆటబొమ్మల్లా కొట్టుకుపోవలసిందే. వివిధ దేశాలలోని ప్రాంతాలలోని పరిస్థితులు, నమ్మకాలు, అభిరుచులు, సంస్కృతులు విభిన్నంగా ఉంటాయి. ఆయా ప్రాంతాలలో పుట్టిన పిల్లలు అక్కడి వాతావరణ ప్రభావానికి అనుగుణంగా తయారవుతారు. వారి స్వభావం, ఆలోచన, కార్యకలాపాలు ఆ ప్రాంత ప్రజల ఆచార వ్యవహారాలకు దగ్గరగా ఉంటాయి. దీనినే యుగపరంపర అంటారు. చల్లని లేదా వేడి వాతావరణం మార్పు చెందేటపుడు ప్రాణులు, వనస్పతులు, పదార్థాల యొక్క స్థితి, స్వభావం మారిపోతాయి. కార్యకలాపాలలో ఋతువులకు అనుగుణంగా అనేక పరివర్తనలు జరుగుతాయి.

భూమి మీద లభించేవన్నీ మానవుని ఆర్జనలు కావని విజ్ఞాన వేత్తలకు తెలుసు. సూక్ష్మశక్తుల వలన జరిగేవి మరెన్నో ఉంటాయి. ఆ పరివర్తన ప్రభావం భూమి మీద భారీగా ఉంటుంది. దానివలన పదార్థాల, ప్రాణుల పరిస్థితిలో ఆశ్చర్యకరమైన మార్పులు సంభవిస్తాయి. అయస్కాంత తుఫానులు, సుడిగుండాలు సామాన్య పరిస్థితులను ఎంతగా అతలాకుతలం చేస్తాయో అందరికీ తెలుసు. అంతరిక్షంలోని అదృశ్య శక్తుల విషం వలన భూమి మీద హిమయుగం వచ్చింది. జల ప్రళయాలు, సముద్ర పరివర్తన, భూ ప్రళయాలు సంభవించాయి. భవిష్యత్తులో భూమి మీద ప్రాణుల పరిస్థితిలో అసాధారణమైన మార్పు జరగబోతోంది. దానికి కారణం సామాన్య సంఘటనలు కావు. అంతరిక్షంలోని అదృశ్యమైన గందరగోళమే దానికి కారణం.


వ్యక్తి తన నిజ జీవితంలో ఎప్పుడూ స్వతంత్రుడు, శక్తివంతుడు. కాని విశాల బ్రహ్మాండంలో ఏర్పడే గందరగోళ పరిస్థితులలో అతని స్థానం స్వల్పమైనది. అతడు నీటితో నిండిన మేఘాలను వర్షింపజేయలేడు. మృత్యువు నుండి, వృద్ధాప్యం నుండి బయటపడడంలో అసమర్థుడు. పరిస్థితుల మీద ఆధిపత్యం సంపాదించడంలో నిస్సహాయుడు. ప్రవాహ వేగం నుండి తనను తాను రక్షించుకోవడానికి ఎంతోకొంత ప్రయత్నం చేయగలుగుతాడు. వణికించే చలినుండి రక్షించుకోవడానికి వేడి పుట్టించే ఉన్ని వస్త్రాలను ధరించడంలాంటి ఆత్మరక్షణ పనులు కొన్ని చేయగలడు.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. మనిషి వాతావరణం ముందు ఎప్పుడూ అసహాయుడేనా, అసమర్థుడేనా? సూక్ష్మ ప్రవాహాలను ప్రభావితం చేసి వాటిని అనుకూలంగా మార్చుకునే శక్తి మానవునికి ఉన్నది. జీవి ఈశ్వరుని అంశ. మానవీయ చేతన బ్రహ్మాండ చేతనలో ఒక అంశ. ప్రతి అంశలోను మూలం యొక్క

**ఆహ్వానం లేకుండా వెళ్లేవాడు, అడగని వ్యక్తికి చెప్పేవాడు అధములు - q^Î°~¡hu.**

లక్షణాలు తప్పక ఉంటాయి. ప్రయత్నం ద్వారా దాని మూలశక్తితో సమానంగా దానిని వికసింపచేయవచ్చు. విత్తనం చాలా చిన్నది. అది చెట్టు యొక్క అంశ. కాని ఆ చెట్టు స్థాయి వరకు వికసించగల శక్తులన్నీ దానిలో ఇమిడి ఉన్నాయి. అవకాశం లభిస్తే మూల స్వరూపం అయిన వృక్షం స్థాయికి అది ఎదగగలదు. జీవాత్మయొక్క చురుకుతనం పెరుగుతూ ఉంటే, అది మహాత్మ, దేవాత్మ, పరమాత్మ స్థితి వరకు ఎదగగలుగుతుంది.

జడ ప్రకృతి యొక్క వైభవం చాలా ఎక్కువ. అయినా దానిని నియంత్రించేది చేతనా శక్తి. శరీరంయొక్క అస్తిత్వం, కార్యకలాపాలు ప్రాణశక్తి పనిచేసేంత వరకే ఉంటాయి. ఈ భౌతిక ప్రపంచం బ్రహ్మచైతన్యం యొక్క బాహ్యరూపం. ప్రకృతి బ్రహ్మయొక్క నీడ మాత్రమే. బ్రహ్మమే వాస్తవ జగత్తు. జగత్తులోని జడత్వం మీద చేతన యొక్క, బ్రహ్మ సత్తా యొక్క నియంత్రణ ఉన్నది. వికసితమైన జీవాత్మ తనకు తానుగా బ్రహ్మశక్తితో సంబంధం ఏర్పరచుకొని దానితో ఐక్యమైనపుడు, అది వాతావరణంలో అవసరమైన మార్పులు, చేర్పులు తేగల సామర్థ్యాన్ని పొందుతుంది. ప్రతికూల వాతావరణాన్ని అనుకూలంగా మార్చుతుంది.


ద్రోణ కలశం

చేతనా శక్తి ద్వారా వాతావరణంలో కావలసిన పరివర్తన తీసుకురావడం సాధ్యమే. అదృశ్య జగత్తులో కొన్నిసార్లు ప్రేరణలు ఉద్భవిస్తాయి. ఆ ప్రేరణల తుఫానులో మస్తిష్కం యొక్క పొరలు గడ్డిపోచల్లా ఎగరడం ప్రారంభమవుతుంది. యుద్ధోన్మాదం అలాగే ఉద్భవిస్తుంది. ఆ సమయంలో అధికసంఖ్యాకులు జగడాలాడుతూ ఉంటారు. అందుకు సర్వసన్నద్ధులుగా ఉంటారు. అద్భుతమైన ఆవేశం అంతటా ఆవరించి ఉంటుంది. చెప్పినా అర్థం చేసుకోలేని స్థితి ఉంటుంది. గాలిలో ఉన్న చురుకైన వేడిమి కారణంగా సామాన్య మస్తిష్కాలు ఒకరకమైన సమ్మోహన శక్తికి లోనై ఉంటాయి. ఆ ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటాయి. యుద్ధోన్మాదాలు, ప్రాంతీయ కలతలు, కొట్లాటలతో వాతావరణం ఎంత ప్రమాదకరంగా మారుతుందో శాస్త్రాన్ని అధ్యయనం చేసేవారికి తెలుస్తుంది. అలాంటివే మరో తరహా సూక్ష్మ ప్రవాహాలు వివిధ సమయాలలో ఉత్పన్నమవుతూ ఉంటాయి. అసంఖ్యాకములైన మస్తిష్కాలను దేవత్వంవైపు తీసుకొని వెళ్ళడానికి అవి తుఫానులవలె పనిచేస్తాయి.

ఒక సమయంలో ప్రజాస్వామ్య వెల్లువ ఉప్పొంగింది. అది రాచరికాన్ని ప్రపంచం నుండి వెళ్ళగొట్టింది. ఆ స్థానంలో ప్రజా ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అలాగే కమ్యూనిస్టు భావనలు కూడ ఉద్భవించాయి, వ్యాపించాయి. అంతరించిపోతున్నాయి. అది ఒక గాలి మాత్రమే. సముద్రపు ఆటుపోటుల భయంకర రూపాన్ని తీరప్రాంత ప్రజలు అప్పుడప్పుడు చూస్తుంటారు. అలాగే కొన్ని రకాల ఆలోచనా పరంపరలు కూడా కొన్నిసార్లు వస్తుంటాయి. అవి అసంఖ్యాకులను కట్టకట్టుకొని ఈడ్చుకువెళ్ళి ఎక్కడికో తీసుకువెళ్ళి పడవేస్తాయి.

బుద్ధభగవానుని ధర్మచక్ర ప్రవర్తన భౌతిక సాధన ప్రధానమైనది కాదు. పరంపర ప్రధానమైనది. అది సాధనాలతో ఆచారాలను ఉత్పన్నం చేయలేదు. బుద్ధుడి ఆలోచనలే వాతావరణాన్ని వేడెక్కించాయి. ఆ వాతావరణం లక్షలాది జ్ఞానులను, యోగ్యులను, సంపన్నులను తమ ఆత్మనే ఆహుతి చేయగల ధర్మ సైనికుల శ్రేణిలోనికి సునాయాసంగా తీసుకువచ్చి నిలబెట్టింది. ధర్మ ప్రచారకులలో ప్రతి ఒక్కరూ తమ తమ కాలాలలో తమ తమ పద్ధతులలో వాతావరణాన్ని వేడెక్కించే భావ తరంగాలను ఉత్పన్నం చేశారు. ఆ ప్రవాహంలో ఎంతోమంది కలగలసి పనిచేశారు. ఇలాంటి ప్రవాహాల సామర్థ్యం చాలా గొప్పగా ఉంటుంది. ఆ శక్తితో ప్రపంచంలోని ఏ ఇతర శక్తి సాటిరాదు. అదృశ్య వాతావరణంలోని, సూక్ష్మ వాతావరణంలోని సత్యాలను రహస్యాలను కనుగొన్న వారికి ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

అలాగే అశ్వమేధ యజ్ఞాల పరంపర యొక్క లక్ష్యం వ్యక్తిత్వ సంస్కరణ, సమాజనిష్ఠలో శిక్షణ ఇవ్వడం. శీల నిష్ఠ, సమాజ నిష్ఠల గొప్పతనాన్ని గురించి, ప్రయోజనాన్ని గురించి ఈ యజ్ఞంలోని విశిష్ట కర్మకాండకు చెందిన వ్యాఖ్యలద్వారా, వివేచనల ద్వారా నేర్పి తెలియజేయవచ్చు. ఇది శ్రద్ధాయుత ప్రక్రియ అని చెప్పవచ్చు. ఈ ప్రక్రియ ద్వారా ఉత్కృష్ట చింతన, ఆదర్శ

**అనుభవం జ్ఞానానికి జనని.**

కర్తృత్వాల ధర్మ శిక్షణ సులభమవుతుంది. అశ్వమేధ యజ్ఞంలోని ఈ జ్ఞానయజ్ఞ మహిమ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.

కాని ఇంతకంటే సమర్థమైనది, మహత్తరమైనది మరొకటి ఉంది. అశ్వమేధం వల్ల జగత్తులో చురుకుతనం, ఉత్సాహం ఉత్పన్నమవుతాయి. దీనితోపాటు భౌతిక జగత్తుపై సూక్ష్మశక్తులు పనిచేసే విధంగా ఏర్పాట్లు చేయాలి. సూక్ష్మ ప్రవాహాలకు సహకరించడం వలన ఆశించిన ప్రయోజనాలను పొందడం తథ్యం. గాలి వెనుక నుండి వీస్తుంటే పడవలకు, నడిచి వెళ్ళే వారికి ప్రయాణం సులభమవుతుంది. యుగపరివర్తనకు వాతావరణం అనుకూలించడానికై మనం అలాంటి ప్రచండ ప్రయత్నం చేయాలి. అశ్వమేధ యజ్ఞం ఈ దిశగా చేస్తున్న ఒక దివ్య ప్రయోగం.

విశిష్ట ఆధ్యాత్మిక ప్రక్రియ యొక్క ప్రచండశక్తితో వాతావరణంలో వ్యాపించి ఉన్న చెడును తొలగించవచ్చు. చురుకైన ప్రతిభావంతులే తమ ప్రాణశక్తితో యుగాన్ని మార్చగలరు. అవతార పురుషులు ఆనాటి పరంపరను మార్చివేస్తారు. సరిగ్గా అదే విధంగా అశ్వమేధ యజ్ఞాలలో చేతనాత్మక శక్తి ప్రచండ రూపంలో ఉత్పన్నమై సూక్ష్మ జగత్తును సంస్కరిస్తుంది. సుఖ శాంతులతో కూడిన పరిస్థితులను ఉత్పన్నం చేసి, ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించే విధంగా సూక్ష్మ జగత్తును తయారుచేస్తుంది. అది దైవ అనుగ్రహం తరహాలో పనిచేస్తుంది.




సూక్ష్మ వాతావరణాన్ని సంస్కరించడం కోసం ఇంతకు ముందు ఆధ్యాత్మిక వేత్తలు అనేక దివ్య ప్రయోగాలను ఆయా సమయాలలో చేశారు. శాస్త్రాలలో ఇందుకు ప్రమాణాలు లభిస్తాయి. రావణుని కాలంలో కలుషిత వాతావరణాన్ని సంస్కరించే పని మిగిలిపోయింది. శ్రీరాముడు దీనికోసం 10 అశ్వమేధ యజ్ఞములు చేశాడు. కంసుడు, దుర్యోధనుడు, జరాసంధుడు లాంటి రాక్షసుల సంహారం జరిగినా మహాభారత కాలంలో వాతావరణ కాలుష్యం ఏర్పడింది. శ్రీకృష్ణ పరమాత్మ దానికి విరుగుడుగా పాండవుల చేత అశ్వమేధ యజ్ఞాలను నిర్వహింపజేశాడు. విశ్వామిత్ర మహర్షి అసురత్వాన్ని నిర్వీర్యం చేయడానికి ఒక గొప్ప యజ్ఞాన్ని నిర్వహించాడు. అది ఈ స్థాయికి చెందిన విశిష్ట ప్రయోగమే. ఆ విషయం రాక్షసులకు తెలిసి తాటకి, మారీచుడు, సుబాహుల నేతృత్వంలో యజ్ఞాన్ని భగ్నం చేయడం ప్రారంభించారు. యజ్ఞ రక్షణకు రామలక్ష్మణులు వెళ్ళవలసి వచ్చింది. ప్రయోగం ఫలించి అసురత్వం నశించింది.

ఇవన్నీ ఆయా సమయాలలోని విప్లవాత్మక పరిణామాలు. పరంపర యొక్క పరివర్తనయే విప్లవం. పెళ్ళగించి పడవేసే ధ్వంస రచన దానిలో ముందుగా వస్తుంది. ఇది భౌతిక పక్షం. ఆత్మిక పక్షంలో ఆత్మ నిర్మాణానికి ప్రాధాన్యత ఉంటుంది. కనుక ధ్వంసం ఒక్కటే రాదు. చీకటిని తరిమివేయడానికి వెలుగు వ్యవస్థను ఏర్పాటు చేయడం వివేకవంతుల లక్షణం. ప్రస్తుతం అశ్వమేధ యజ్ఞం ద్వారా జరుగుతున్న ఈ గొప్ప ప్రయత్నంలో నిర్మాణాత్మక కార్యక్రమాలే ఉంటాయి. ముఖ్యంగా వాతావరణాన్ని సంస్కరించే ప్రక్రియగానే దీనిని గుర్తించాలి. దీనివలన పరాప్రకృతిని ద్రవింపజేసి కోరిన ప్రతిఫలం పొందడం జరుగుతుంది.

చరిత్రాత్మక ప్రయత్నాలు పునరావృతం అవుతున్నట్లుగా కూడా భావించవచ్చు. ఇందువలన అంతరిక్షంలోని కాలుష్యాన్ని వినాశకర విషపూరిత పరిస్థితులను సరిచేయవచ్చు. సూక్ష్మ జగత్తును అసాధారణంగా ప్రభావితం చేసి పరిశుద్ధం చేసే ఈ గొప్ప ఉద్యమం ఋషులు, కృతయుగం నాటి మహనీయుల మార్గదర్శనాన్ని అనుసరిస్తున్నది. సత్ప్రవృత్తులు ఏ అనుపాతంలో పెరుగుతాయో అదే అనుపాతంలో దుష్ప్రవృత్తులు నశిస్తూ ఉంటాయి. హానికరమైన తత్వాలు సహజంగానే నివారించబడతాయి. యుగపరివర్తనలోని ఉద్దేశ్యం సులభంగా పూర్తవుతుంది.


ఈ యజ్ఞ పరంపరలో యుగ పరివర్తనలోని స్థూల, సూక్ష్మ తత్వాలన్నీ కలగలసి ఉంటాయి. అవి జన మానసాన్ని, విస్తృత వాతావరణాన్ని పరిశుద్ధం చేసి 21వ శతాబ్దిని ఉజ్వల భవిష్యత్తుగా తీర్చిదిద్దుతాయి. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని వ్యక్తిని, సమాజాన్ని, ప్రకృతిని, విశ్వాన్ని మార్చే సూక్ష్మధారలను అవతరింపజేసే సామర్థ్యం కలిగిన అశ్వమేధ యజ్ఞాల విశిష్ట ప్రణాళిక అమలుజరుగుతోంది.

H H H

**అపజయాలు లోపాలను వెల్లడిస్తాయి. విజయాలు వాటిని దాచుతాయి.**

# యజ్ఞాలకు రారాజు అశ్వమేధం

ఏ యజ్ఞం "భువనస్య నాభి"గా, బ్రహ్మాండం యొక్క నాభిగా, చెప్పబడిందో అది శ్రేష్ఠకర్మ లేక దివ్య పురుషార్థ రూపంలో ప్రతి క్షేత్రంలో వ్యాపించి ఉంది. మొదటి యజ్ఞీయ పురుషార్థం సృష్టి యొక్క ఆదిలోనే జరిగింది. విష్ణువు యొక్క నాభినుండి తామర మొగ్గ వచ్చింది. అది వికసించి కమలం అయింది. ఆ కమలం నుండి సృష్టికర్త బ్రహ్మ బయటకు వచ్చి సృష్టి క్రమాన్ని ప్రారంభించాడు. ఇది ఆలంకారిక వర్ణన. ఇందులో మొదటి యజ్ఞీయ పురుషార్థం గురించే చెప్పబడింది.



దండ పతాకం

''యజ్ఞో వై విష్ణుః'' యజ్ఞమే విష్ణువు. యజ్ఞము భవనానికి నాభి, అని చెప్పటం ద్వారా కమలం లేక బ్రహ్మ ఏ నాభి నుండి వచ్చారో అది యజ్ఞమే అని స్పష్టమవుతోంది. యజ్ఞం యొక్క అంగములు కమలపు రేకుల రూపంలో వికసించాయి. ఆ వికాస ప్రక్రియ నుంచి ఏ హితకరమైన యజ్ఞీయ సృజనశక్తి ఉత్పన్నమైనదో దానినే రాష్ట్రీయ బ్రహ్మ అని పిలిచారు. ఈ విధంగా ప్రకటించబడిన యజ్ఞీయ సృష్టియొక్క సంతులనం కోసం, వికాసం కోసం యజ్ఞీయ అనుశాసనం లేక పురుషార్థాన్ని వికసింపచేసి జాగృతం చేసే ప్రయత్నాలు జరిగాయి.

సూర్యచంద్రులు, వాయువు, అగ్ని, జలము, పృథ్వి అన్నీ యజ్ఞీయ క్రమాన్ని తమవిగా చేసుకొని, సృష్టియొక్క పోషణ, రక్షణ, వికాసాలను చేయ నారంభించాయి. సముద్రం, మేఘం, పర్వతాలు, నదులు, వనస్పతులు, వృక్షాలు యజ్ఞీయ అనుశాసనాన్ని అనుసరిస్తున్నాయి. జంతువులు, పశువులు, క్రిమికీటకాలు కూడా తమ శక్తిని అనుసరించి యజ్ఞ క్రమములో ఉన్నాయి.

సర్వశ్రేష్ఠ ప్రాణియైన మనిషికూడా దివ్య అనుశాసనాన్ని పాటిస్తున్నాడు. పరస్పర ప్రేమ, సహకారం, సమైక్యతలను సాధించుకున్నాడు. తన పనులలో దయ, దానం మొదలైన వాటిని అనుసరిస్తున్నాడు. ఈ యజ్ఞీయ జీవనక్రమం యొక్క ఫలశ్రుతి రూపంలో కృతయుగ వాతావరణం యొక్క అనుభూతి అతనికి చాలాకాలం వరకు లభిస్తూ వచ్చింది. కాలప్రవాహంలో మనిషి యజ్ఞీయ అనుశాసనం నుంచి వైదొలగాడు. యజ్ఞీయ అనుశాసనం యొక్క పరిరక్షణకోసం అనేక యజ్ఞీయ కర్మకాండలు వికసించాయి. అనుశాసనంలోకి తేవటం కోసం అనేక ప్రయోగాలు కాలానుగుణంగా జరిగాయి, సఫలమైనాయి.

దేవతా ప్రవృత్తులను వికసింపచేసుకోవటానికి దేవ యజ్ఞము, మనుషులకు అతిధులకు స్నేహ సన్మానాలను ఇవ్వటం కోసం నృయజ్ఞము, అనేక జీవ జంతువుల పోషణకోసం భూత యజ్ఞము, బలివైశ్వ యజ్ఞాదులు చేస్తారు. పోషక ప్రవృత్తిని వికసింపచేయటానికి విష్ణు యజ్ఞం, మనో జాగరణకు రుద్రయజ్ఞం, అనాచార నిర్మూలనకు చండీ యజ్ఞం చేస్తారు.

పశుసంపదను వృద్ధిచేసుకోవటానికి గోమేధం, అజమేధం మొదలైనవి ఉన్నాయి. తరువాత కాలంలో మేథ అనే శబ్దాన్ని దురుపయోగ పరచారు. కానీ 'మేథ' అనే శబ్దం యజ్ఞానికి పర్యాయపదం.

సమాజంలో సత్ప్రవృత్తులను పెంచటం కోసం యజ్ఞరూపంలో 'వాజపేయ' యజ్ఞం, రాజనీతికి సంబంధించిన నియమాలను బలపరచటం కోసం అశ్వమేధం మొదలైనవి

**దేహధారణకు కావలసిన దానికి మించి గ్రహించడం దొంగతనం.**


చేస్తారు. అశ్వమేధం ఈ యజ్ఞాలన్నింటిలోను సర్వశ్రేష్టమైన యజ్ఞరాజము.

ఈ అశ్వమేధ యజ్ఞానుష్ఠానం సామాన్యమైన కర్మకాండ కాదు. ఇది రాజుయొక్క రాజ్యకాంక్షను పూర్తి చేసికోవటం కోసం చేసే అహంకారపూరితమైన చర్య కాదు. ఈ మహాయజ్ఞానుష్ఠానం యొక్క స్వరూపం ఋషుల హృదయాన్ని అవిష్కరిస్తుంది.

## అశ్వశబ్ద పరిశీలన

అశ్వ శబ్దము యొక్క సామాన్యమైన అర్థం గుఱ్ఱం. లౌకిక అర్థంలో ఇది సరైనదే. కాని యజ్ఞ సందర్భంలో దాని మౌలికమైన అర్థాన్ని గ్రహించాలి. **అశ్ క్వన్ అశ్నుతే అధ్వానమ్, అశ్నుతే వ్యాప్నోతి**. అంటే – త్వరగా వెళ్ళేది. మార్గంపై వ్యాపించేది అని అర్థం.

**"మహా శనో భవతివా అశ్వః, బహు అశ్నాతీతి ఇతి అశ్వః"**. అనగా అధికంగా ఆహారాన్ని స్వీకరించేది అశ్వం.


అజ ధ్వజం

గుఱ్ఱానికి ఉపయోగించే ఇతర సంజ్ఞలు కూడా ఈ అర్థానికి సమీపంగా ఉంటాయి. 'అత్య' అంటే "అతతి గచ్ఛతి", అంటే గతిశీలి. 'హయ' అంటే "హయతి గచ్ఛతి". "అశ్వ" అంటే గమన శీలము, చంచలము అని అర్థము.

అశ్వాన్ని గుణ వాచకంగానే శాస్త్రాలు స్వీకరించాయి. జాతివాచక సంజ్ఞగా గ్రహించలేదు. **"ఇంద్రోవై అశ్వ"** (కౌషీతకి బ్రాహ్మణం) అంటే ఇంద్రుడే అశ్వం. **"శౌర్యో వా అశ్వః"** (గోపథ బ్రాహ్మణం) అంటే సూర్యుని యొక్క శూరత్వము లేక తేజస్సే అశ్వం. వేదాలలో అనేక చోట్ల యజ్ఞాగ్నిని అశ్వంగా పేర్కొన్నారు. ఋగ్వేద మంత్రాలలో – **గంధర్వో అస్యరశనా మగృభాణత్ సూరా దశ్వం వసవో నిరతష్ట** – అంటే అశ్వం సూర్యునికి ప్రతీక. అంటే యజ్ఞాగ్నిని సూర్యుని ద్వారా ప్రకటించారు. **"వీర్యో వై అశ్వః"** సంపదే అశ్వం. **అగ్నిర్వా అశ్వః, ఆజ్యం మేధః**, అగ్నియే అశ్వం, నేయియే మేధము.

శతపథ బ్రాహ్మణ మంత్రానికి వాఖ్యానం చేస్తూ దయానంద మహర్షి ఈశ్వరుని అశ్వంగా భావించారు. **"అశ్వతో యత్ ఈశ్వరో వా అశ్వః" "అశ్నుతే వ్యాప్నోతి సర్వా జగత్సో అశ్వ ఈశ్వరః"** – అంటే, సమస్త ప్రపంచంలో వ్యాపించి ఉన్న అశ్వమే ఈశ్వరుడు.

పై శాస్త్రీయ ఉదాహరణలను అనుసరించి అశ్వ శబ్దానికి గుఱ్ఱం అనే అర్థాన్ని ఇవ్వటం మన అజ్ఞానమేనని తెలుస్తోంది. ఈ అజ్ఞానం కారణంగానే ఎన్నో భ్రమలు ఉత్పన్న మౌతున్నాయి.

## మేధ శబ్ద పరిశీలన

మేధ శబ్దం యజ్ఞానికి పర్యాయపదం. దానికి ఒక అర్థం వధ అనికూడా ఉంది. కాని శాస్త్రంలో ఆ అర్థంలో దాని ప్రయోగం నిషేధించ బడింది. ద్వేషం, హింస, క్రూరత్వం మొదలైన వాటిని శాస్త్రాలు అయజ్ఞీయమని పేర్కొన్నాయి. అనగా యజ్ఞ సందర్భంలో వాటిని ప్రయోగించ కూడదు.

మేధ శబ్దానికి హింస అనే అర్థాన్ని విడిచి చూడగా దానికి మేధా సంవర్ధనం, సమైక్యత మొదలైన అర్థాలు వస్తాయి. మేధా శబ్దం యొక్క ఉత్పత్తిలో మిత్, మిద్ మేత్, మేద్ మొదలైన ధాతువులతో సంబంధం ఉంది. వాని అర్థం కలవడం, కలపటం, తెలుసుకోవడం, ప్రేమించడం, పట్టుకోవడం. మేధకి అర్థం బుద్ధిబలం, శక్తిబలం. యజ్ఞం, అర్పణ, రసం, సారం, పూజ, పవిత్రత వంటి అర్థాలలో కూడ ఇది ఉపయోగింపబడుతుంది.

వాజసనేయ సంహిత సర్వమేధ ప్రకరణంలో మేధ


**జలం పర్వతాలను కరిగిస్తుంది. గండశిలలను నునుపు చేస్తుంది. అభ్యాసం మహిమ అది.**

శబ్దం యొక్క అర్థం భాష్యకారులచే చేయబడింది.

### అశ్వమేధ శబ్దార్థం

పైన చెప్పబడిన శాస్త్రీయమైన అర్థాలను తెలుసుకున్న తరువాత అశ్వమేధ శబ్దం యొక్క ప్రాధాన్యం తెలుస్తుంది.

అశ్వం గతిశీలతకు, శౌర్యానికి, పరాక్రమానికి, మేధ మేధాశక్తికి శ్రేష్ఠతకి, బుద్ధి మతిత్వానికి ప్రతీక కావటంలో అశ్వమేధం యొక్క నిజమైన అర్థం శౌర్య పరాక్రమాలనే కళ్యాణ గుణాలని తెలుస్తుంది.




అశ్వాన్ని క్షాత్రశక్తికి, మేధను, బ్రాహ్మశక్తికి ప్రతీకగా భావించటంలో – ఆ రెంటి కలయికతో ఒక పవిత్రమైన, గొప్పదైన యజ్ఞకర్మ జరుగుతుంది. ఉత్కృష్టమైన ఆలోచనాశక్తి, శ్రేష్ఠ ప్రయోజనానికి సమర్పితమైన పురుషార్థముల కలయికలోనే ఆదర్శ సమాజం లేక రాష్ట్రం యొక్క నిర్మాణం జరుగుతుంది. అందుకని రాష్ట్ర నిర్మాణాన్ని అశ్వమేధం అని చెప్పడం జరిగింది. **రాష్ట్రం వా అశ్వమేధః** అంటే రాష్ట్రమే అశ్వమేధం. ఈ సందర్భంలోనే ముందు ఇలా చెప్పారు. "**రాష్ట్రం వై అశ్వమేధః తస్మాద్రాష్ట్రీ అశ్వమేధేన యజేత్**" అంటే రాష్ట్రమే అశ్వమేధం అందుకని అశ్వమేధం మాధ్యమంగా రాష్ట్రాన్ని సమైక్యపరచాలి.

శతపథ బ్రాహ్మణంలో అనేకసార్లు "**అశ్వమేధేన యజేత్**" అనే వాక్యం ప్రయోగించబడింది. "**యజ్ఞేన యజ్ఞమయజన్త దేవాః**", అనగా దేవతలు యజ్ఞంతో యజ్ఞం యొక్క యజనాన్ని చేశారు. శ్రేష్ఠకర్మ కొరకు ఉద్దేశం యజ్ఞీయము కావలన్నది స్పష్టమే. సాధన సుసంస్కారవంతమైన యజ్ఞం కావాలి. దాని క్రియ యజ్ఞీయ అనుశాసనంలోనే ఉండాలి. అందుకనే శతపథ బ్రాహ్మణంలో యజమానికి అశ్వమేధ సంజ్ఞ ఇవ్వబడింది.

మేధస్సును బ్రహ్మాండంలో గతిశీలం చేసే క్రమాన్ని లక్ష్యంగా చేసుకొని శతపథ బ్రాహ్మణంలోని మంత్రాలలో సూర్యుడు అశ్వమేధంగా చెప్పబడ్డాడు. ఇదే క్రమంలో మంత్రంలో చంద్రుని అశ్వమేధంగా చెప్పారు.

ఈ పరిశీలన ఫలితంగా అశ్వమేధాన్ని ఇంతగొప్పది, దుష్కరమైనది అని ఎందుకన్నారో అర్థమౌతుంది. దీనిని అందుకనే అనుకూల ఫలములను ఇచ్చే యజ్ఞముల రారాజు అని అన్నారు. దీనికింత మహత్వ మున్నప్పటికీ దీనిని చేసే సాహసం ఎవరో దానవంతులు మాత్రమే చేయగలుగుతున్నారు.

దివ్యమేధను లేక దివ్యపురుషార్థాన్ని జాగృతంచేసి దానిని సమైక్యపరచి దేశీయ స్థాయిలో యజ్ఞీయ జీవనక్రమంలో జనులందరిని జోడించడం అటువంటి పెద్ద బాధ్యతాయుతమైన పని. ఇలా ఇంతకుముందు కొంత జరిగింది. ఇలా చేయమని మరల మహాకాలుడు నిర్దేశిస్తున్నాడు. అతని అనుచరులు దానిని నిష్ఠాపూర్వకంగా చేయటానికి తత్పరులై ఉన్నారు. ఫలితంగా గత వైభవం తిరిగి లభిస్తుంది.

అశ్వమేధ అనుష్ఠానం కోసం అన్ని వ్యవస్థలు చేయబడ్డాయి. యుగఋషి యొక్క తీవ్రమైన తపము దీని నిమిత్తమే జరిగింది. యజ్ఞీయ భావనద్వారా పరాక్రమాన్ని చూపించటం కోసం మన సృజన సైనికుల విజయ వాహినులు తయారయినాయి. యుగపురుషరూపుడైన మహాకాలుడు దీనిని నిర్ధారించాడు. కఠోర సాధన ద్వారా జాగృతమైన మేధ మహాప్రజ్ఞ. ఇప్పుడు గతిశీలమైన అశ్వమేధ అనుష్ఠానం రాష్ట్రానికి పూర్వ వైభవాన్ని ప్రసాదిస్తుంది.


H H H

**జీవుడికీ దేవుడికీ మధ్య ఉన్న తెరయే అహంకారం. అది అవగుణాలకు పుట్టినిల్లు.**

# యజ్ఞబలి, దేవ దక్షిణ

యజ్ఞంతో పాటు 'స్వాహా', 'స్వధా'ల ప్రయోగాన్ని శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి. త్వమేకం శరణం ఏకమాత్ర (నీవే శరణు పొందడానికి యోగ్యుడివి, సమర్థుడివి) త్వమేకం వరేణ్యమ్ (నీవు మాత్రమే వరించగలిగిన వాడివి, ధరించదగిన వాడివి).

యజ్ఞారాధనలో 'స్వాహా' సమర్పితం కావడానికి, 'స్వధా' స్వయంగా ధారణ చేయడానికి విధాన రూపం. స్వాహాకు మూడు అర్థాలున్నాయి.



మకర ధ్వజం

1. "సుసుష్ఠు ఆహా-సు-ఆహా" - అర్థం సుందర కథనం.
2. "స్వ వాక్ ఆహ ఇతి" - మన వాణి అనుమతిలో చెప్పిన వాక్యము.
3. "స్వ ఆహుతం హవిర్జుతిహోవా " శక్తిని, ప్రతిభను, భావనను అగ్నికి ఆహుతి ఇవ్వడం.

స్వాహాకారం యజ్ఞంలో ఉపయోగించడం జరుగుతుంది. యజ్ఞ సంచాలకుడు యాజకుల భావనలను పైనియమాలకు అనుగుణంగా తయారుచేసి ఉంచుతాడు. కాని దీనితోనే యజ్ఞం పూర్తయినదని భావించరాదు. దానితో పాటు స్వధా ప్రయోగం జరుగుతుంది. అపుడే యజ్ఞం పూర్తయినట్లు భావించాలి.

'స్వధా'కు కూడ మూడు రకాల అర్థాలున్నాయి.

1. మన నిజస్వభావాన్ని, నిశ్చయాన్ని సంకల్ప ధారణ చేయడం.
2. అభిరుచిపూర్వకంగా, ప్రసన్నంగా ధరించే ప్రక్రియ.
3. పితరులకోసం ఇచ్చే బహుమతి - ఆహుతులు.

పితృకర్మలో స్వధానమః అనే వాక్యం అనేకసార్లు ప్రయోగించ బడుతుంది. పితృదేవతలు ప్రసన్నంగా దీనిని గ్రహించి తృప్తి చెందాలి అని భావం.

యజ్ఞం యజ్ఞభావనలను తృప్తి పరచడాన్ని, ఆహ్వానిత దేవతలను, సహాయపడిన విశేషజ్ఞులను సంతుష్టిపరచడాన్ని నిర్దేశిస్తున్నది. ఇది లేకుండా యజ్ఞం పూర్తయినట్లు భావించరాదు. దీనిని యజ్ఞం యొక్క 'స్వధా' ప్రయోగంగా చెప్పవచ్చు.

ఇక్కడ యజ్ఞబలి - దేవ దక్షిణ గురించి చెప్పాలి.

యజ్ఞంలో బలి అంటే హింసాత్మకంగా చేయడం కాదని పూర్వ శాస్త్రాలలో స్పష్టంగా చెప్పడం జరిగింది. భోజ్య పదార్థాలను - అన్నము మొదలయిన వాటిని - శ్రద్ధగా అర్పించడాన్ని యజ్ఞ కర్మకాండలో బలి అంటారు. శ్రాద్ధ కర్మలో దేవబలి, గోబలి, కాకబలి గురించి, బలివైశ్వదేవత గురించి చెపుతూ ఈ విషయం స్పష్టం చేయడం జరిగింది. యజ్ఞంలో యజ్ఞపురుషుని, ఆహ్వానిత దేవ శక్తులను భోజనం అర్పించి తృప్తిపరచడం జరుగుతుంది. దీనిని బలి అంటారు. కార్యక్రమం సమాప్తమయిన తరువాత కూడ శ్రద్ధను కలిగిఉండడం వలన దేవశక్తులు తృప్తిపడతాయి.

యజ్ఞ మీమాంసలో ఇలా స్పష్టంగా వ్రాయబడి ఉంది.

**బలిస్తు త్రివిధో జ్ఞేయస్తాన్త్రికః స్మార్త ఏవ చ ।**
**వైదికశ్చేతి......।**
**వైదికం తు బలిం దధ్యాదోదనం స్విన్నమాపవత్ ।**
**సరోచనమతి క్రూర దైవతే వటకాన్వితమ్ ॥**

అనగా - బలి మూడు రకాలుగా జరుగుతుంది. తాంత్రికము, స్మార్తము, వైదికము. ఉడికిన మినుములు అనగా మినుములతో కూడిన అన్నము వైదికబలి. అతిక్రూర దేవతలకు గారెలు, సిందూరముతో కూడిన అన్నమును బలి ఇవ్వాలి.

దేవతలకు శుద్ధసాత్విక ఆహారమే ప్రియమని స్పష్టంగా తెలుస్తోంది.

కాని దేవతలకు భోజనం పెట్టి వారిని తృప్తిపరచడం కూడా ప్రతీకరూపమే. పదార్థాలన్నీ వారే మనకు ఇచ్చారు. వాటిలోని కొంతభాగాన్ని వారికి సమర్పించి మనం మన కృతజ్ఞతను వ్యక్తీకరిస్తాము. అర్పించిన సామాగ్రిని మనకోసం వినియోగించుకోకుండా పరమార్థభావంతో పంచాలి. ఈ పరమార్థ కార్యాలతో దేవతలు తప్పకుండా సంతుష్టులవుతారు.

దేవతలను తృప్తిపరచడాన్ని, సంతుష్టులను చేయడాన్ని


జీవహింస లేక జీవించువారిని, కాలయముడు కూడ కనికరించు.

దేవదక్షిణ అంటారు. ఆహ్వాన కర్తలో శ్రద్ధ నిజంగా ఉన్నపుడే దేవతలు సంతుష్టులవుతారు. గౌరవంతో పాటు అనుసరణ ప్రవృత్తి శ్రద్ధలో మిళితమై ఉంటుంది.

గీతా కథనం – **యోయచ్ఛ్రద్ధ స ఏవ సః.**

అనగా – ఎవరు ఏవిధంగా శ్రద్ధ చూపుతారో వారు ఆవిధంగా ఉంటారు. శ్రద్ధకు అనుగుణంగా తయారవడమే శ్రద్ధకు నిజమైన ప్రమాణం. నిజమైన శ్రద్ధను ప్రామాణికంగా చూపి దేవతలను తృప్తిపరచాలి. మనలో దేవత్వం వికసించే వ్రత సంకల్పాన్ని దేవ దక్షిణగా ఇవ్వాలి.

దేవత్వ వికాసానికి రెండు మార్గాలున్నాయి. 1.దేవతలకు ప్రతికూలమైన దుష్ప్రవృత్తులు, వికారాలను తొలగించుకోవడం, 2.దేవతలకు అనుకూలమైన సత్ప్రవృత్తులను, సత్కర్మలను జీవితంలో పెంచుకోవడం.



అంకుశ పతాకం

సామాన్యంగా వివేకవంతులు తమలోని వికారాలను తొలగించుకొని సంస్కారాలను ఆచరించేందుకు ప్రయత్నిస్తారు. కాని ఈనాడు అవాంఛనీయ ప్రవృత్తులు జోరుగా ఉన్నాయి. సామాన్య సంకల్పంతో ముందుకు సాగలేము. అందువలన యజ్ఞమయ వాతావరణంలో దేవశక్తుల సంరక్షణలో ఆత్మ నిర్మాణ, ఆత్మ వికాసాలకోసం సంకల్పిస్తే అధిక లాభం చేకూరుతుంది.

దేవ సంస్కృతిని జన జీవనంలో పునః ప్రతిష్ఠించడం కోసం అశ్వమేధం ప్రయోగాలు చేయడం జరుగుతున్నది. దీనికోసం దేవశక్తుల, ఋషుల సహాయాన్ని అర్థించడం జరుగుతుంది. వారు ప్రసన్నంగా సహాయం చేయడానికి ముందుకు వస్తారు. సామర్థ్యానుసారం వరాల వర్షాన్ని కురిపిస్తారు. అయితే ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఎవరికి ఇవ్వాలి? ఎందుకు ఇవ్వాలి? నిర్ధారిత ఉద్దేశ్యం కోసం ప్రామాణిక వ్యక్తులకు వారు తప్పకుండా వరాలు ఇస్తారు. శ్రేష్ఠ ఉద్దేశ్యాల ప్రకటన యజ్ఞానుష్ఠానంతో పాటు జరుగుతుంది. దానిలో పాల్గొనేవారు ఆ ఉద్దేశ్యం కోసం యజ్ఞం చేస్తారు.

ప్రామాణికత అంటే ఏమిటి ? అది వ్యక్తిగత ప్రశ్న. బహుమతి కోసం బాలకులు, విద్యార్థులు ఆతురతగా ఉంటారు. తమ ఉపాధ్యాయుని అనుగ్రహం పొందడానికి ప్రయత్నం చేస్తారు. ఇలాంటి సమయాలలో మాటలకన్నా చేతలే ముఖ్యం. "చేసి చూపించవోయ్" అంటుంటారు.

దేవ దక్షిణ విషయంలో కూడ మనం మన ప్రామాణికతను నిరూపించుకోవాలి. దేవత్వం వైపు వెళ్ళగోరేవారు ఖచ్చితమైన సంకల్పాన్ని తీసుకోవాలి. మనలో ఉన్న చిన్న చిన్న వ్యసనాలను త్యజించాలి. సోమరితనం లాంటి దుర్గుణాలను వదలివేయాలి. ఇదే విధంగా సద్గుణాల వికాసానికి సంకల్పించాలి. నియమిత ఉపాసన, స్వాధ్యాయం, లోక కల్యాణం కోసం సమయాన్ని, ప్రతిభను వెచ్చించడం జరగాలి. ఇలాంటి నియమాలను రత్నాలుగా వర్ణించవచ్చు. వీటిని లేదా సేవా సాధనల చిన్న చిన్న లక్ష్యాలను స్వీకరిస్తున్నామని చేసే ప్రకటన దేవదక్షిణలో అంతర్భాగం.

యజ్ఞం తరువాత అనుయాజ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. యజ్ఞంలో ఉత్పత్తి అయిన శక్తిని సరియైన రీతిలో వినియోగించే ప్రక్రియ ఇందులో ఉంటుంది. దేవ సంస్కృతి వ్యాప్తి, దేశ ఐకమత్యం ఇక్కడ ఉద్దేశించబడింది. దేవ సంస్కృతి సూత్రాలను జీవితంలో చురుకుగా అవలంబించి ఆచరించే విధంగా అందరినీ ప్రేరేపించాలి. ఉత్సాహపరచాలి. ఇదే దేవదక్షిణ.

ఈ అశ్వమేధ యజ్ఞం అత్యంత తీక్షణమైన శక్తిని ఉత్పన్నం చేస్తుంది. ఈ శక్తిని ఉపయోగించుకోవడానికి ముందుకు వచ్చేవారికి సుఖశాంతులు, సంతోషం, శ్రేయస్సు, యశస్సు లభిస్తాయి. వాటి ద్వారా అసాధ్యం అనుకున్నది సాధ్యపడుతుంది.

యజ్ఞీయశక్తిని విస్తరింపచేయడం వల్లనే యజ్ఞీయ భావనలు ప్రజలలో పెంపొందుతాయి. యజ్ఞీయ ఆలోచనలు, కర్మలు వృద్ధి చెందుతాయి. సంకల్పబలం కలవారి యజ్ఞీయ పురుషార్థం వినాశకర ధోరణులను వెదికి వెదికి నాశనం చేసే శక్తిని ఉత్పన్నం చేస్తుంది. ఉజ్వల భవిష్యత్తు యథార్థ రూపాన్ని సంతరించుకొని ముందుకు వస్తుంది.


మానవజాతికి శ్రేయస్సును, సౌభాగ్యాన్ని ప్రసాదించే ఈ ప్రయోగంలో తమ ప్రతిభను, శౌర్యాన్ని కుశలతను చూపి సహృదయులు చరిత్రాత్మకమైన పాత్రను పోషిస్తారని, శ్రేయస్సును పొందుతారని ఆకాంక్షిస్తున్నాం.

H H H

**పువ్వులో సువాసనలా దేహంలో ఆత్మ ఉంది.**

# యజ్ఞ విజ్ఞానం - యజ్ఞ కుండ విజ్ఞానం

సూక్ష్మ ప్రకృతిలో సంచలనాన్ని సృష్టించి భౌతిక జగత్తును ప్రభావితం చేయటంలో యజ్ఞ ప్రక్రియ అసాధారణ సామర్థ్యాన్ని కల్గి ఉన్నది. దీనికి సంబంధించిన విజ్ఞానం అతి విస్తృతం, గంభీరం అయినది. దీని ప్రయోజన మేమిటి ? చైతన్య జగత్తులో దీనికోసం ఎలాంటి తరంగాలను ఉత్పత్తి చేయాలి? అనే ప్రశ్నలకు సమాధానంగా వివిధ యజ్ఞములు, హవనకుండ స్వరూపములు, కర్మకాండ నిర్ధారణలను గురించి తెలుసుకొనవలసి ఉన్నది. యజ్ఞవేత్తలైన మహర్షులు ఎంతో కృషిచేసి లోతుగా అన్వేషించి, అనేకమైన ప్రయోగాలను, పద్ధతులను, కర్మకాండ విధానాలను కనుగొనడం జరిగింది. వీటిని విస్తృతంగా బోధపరచటంలో మహాగ్రంథాలు తమ అశక్తతను వ్యక్తం చేశాయి. దిగువ పంక్తులలో కేవలం వాటి వెలుగును దర్శింపచేసే ప్రయత్నం మాత్రమే జరుగుతోంది.



హంస ధ్వజం

1. యజ్ఞవేత్తల ఆదేశానుసారం వివాహం తరువాత విధి పూర్వకంగా జరిపే అగ్నిస్థాపనను మాతాగ్ని అంటారు. దీని ద్వారా నిత్యం ఉదయం, సాయంత్రం, హవనాది కర్మలు జరుపబడుతాయి.

2. **గార్హపత్యము** : ఆహ్వానింపబడిన దక్షిణాగ్నులను విధిపూర్వకంగా స్థాపన చేసి, శ్రౌతాధానమని దానికి పేరు పెడతారు. ఈ అగ్నులలో జరుపబడే యజ్ఞములను శ్రౌతకర్మ అనే పేరుతో పిలుస్తారు.

3. **దర్శ, పౌర్ణిమాస యాగము** : అమావాస్య, పూర్ణిమలలో జరిగే యజ్ఞములను వరుసగా దర్శ, పౌర్ణిమాస యజ్ఞములని అంటారు.

4. **చాతుర్మాస యజ్ఞము** : నాల్గు నెలలపాటు చేసే ఈ యజ్ఞములలో నాల్గు భాగాలున్నాయి 1) ఫాల్గుణ పూర్ణిమలో వైశ్వ దేవ పర్వము, 2) ఆషాఢ పూర్ణిమనాడు వరుణ ప్రయాస పర్వము, 3) కార్తీక పూర్ణిమ రోజున శాఖ మేధ పర్వము, 4)ఫాల్గుణ శుక్ల పాడ్యమినాడు సుతాసీరీయ పర్వము.

5. **నిరూఢ పశుబంధ యజ్ఞము** : ప్రతి సంవత్సరం వర్ష ఋతువులో లేదా ఉత్తరాయణ, దక్షిణాయనములందు సంక్రాంతిరోజున ఒకసారి జరుపబడే యజ్ఞము.

6. **అగ్రేణ యజ్ఞము** : ప్రతి సంవత్సరం వసంత, శరదృతువులందు క్రొత్త ధాన్యము, యవలతో జరుపబడే యజ్ఞము.

7. **సౌత్రామణి యజ్ఞము** : ఇంద్రుని నిమిత్తమై చేసే యజ్ఞము సౌత్రామణి యజ్ఞమని అంటారు. ఇది రెండు విధాలు 1.స్వతంత్రము, 2.అంగభూతము.

8. **సోమయాగము** : సోమలత ద్వారా జరుపబడు యజ్ఞము. దీనికి 16గురు ఋత్విక్కులు ఉంటారు. దక్షిణను స్వీకరించి యజ్ఞమును చేయువారు ఋత్విక్కులు అని పిలవబడతారు. సోమయాగము యొక్క 16 గురు ఋత్విక్కులు నాల్గు విధాలుగా ఉంటారు. 1.అధ్వర్యుగణము, 2.బ్రహ్మగణము, 3.హోత్రు గణము, 4.ఉద్గాత గణము. సోమయాగములో ఏడు రకములు ఉన్నాయి. 1) అగ్నిష్టోమము – యజ్ఞ సమాప్తి సామవేద విధానంలో జరిగి తరువాత ఇతర సామము పఠింపబడినచో దానిని అగ్నిష్టోమము అంటారు. 2) ఉక్త్వ సామము 3) షోడసీ సామము. 4) వాజవేయ సామము. 5) అతిరాత్ర సామము, 6) అసోర్యామ సామము. దీనిని పఠించి ఏ యజ్ఞములనయితే సమాప్తి చేస్తారో ఆ యజ్ఞక్రమము ఉక్త్వాది నామములతో పిలువబడుతున్నాయి. 7)అన్యాగ్నిష్టోమము. అగ్నిష్టోమాసామము అనంతరము ఏ యజ్ఞములోనయితే షోడసీసామము పఠించబడుతుందో

**ఇంద్రుడైనా తనను తాను పొగుడుకుంటే గడ్డిపరకకన్నా తేలిక అవుతాడు – KŒ}ä>½¼_È°.**

దానిని అన్యాగ్నిష్టోమమని అంటారు.

9. **ద్వాదశీ యజ్ఞము** : ఇది సత్ర అహీనబేధము ననుసరించి రెండు విధాలు. 16 గురు ఋత్విక్కులు, దాన దక్షిణలు స్వీకరించిన ఆహితాగ్ని బ్రాహ్మణులు జరిపించే దీనిని సర్పయాగమని అంటారు. త్రిసంధ్యలలో జరుపబడు యజ్ఞమును సుత్యా అని అంటారు. ఇలాంటి రెండు సుత్యాలనుండి 11 సుత్యాలు ఏ యజ్ఞములో జరుగుతాయో, అలాగే వీటి ఆది అంతములు యందు యజమాన కర్తలు దాని యందు పాల్గొంటారో ఇలాంటి సోమయాగాన్ని అహీనమని అంటారు.

10. **గవానయన యజ్ఞము** : ఈ యజ్ఞము 385 రోజులు జరుగుతుంది. దీనిలో 12 దీక్షలు, 12 ఉపసద్‌లు, 361 సుత్యాలు ఉంటాయి.


గ్రహ పాత్ర

11. **వాజపేయి యజ్ఞము** : యజ్ఞము యొక్క ఆద్యంతములందు అగ్నిష్టోమ యజ్ఞము జరుగుతుంది. దీనిలో 17,17 మూరల స్తంభములు ఉంటాయి. ఇది 40 రోజులు జరుపబడుతుంది.

12. **రాజసూయ యజ్ఞము** : దీనిలో అనుమతి వంటి ఇష్టి, పవిత్ర వంటి అనేక యజ్ఞాలు ఉంటాయి. ఈ యజ్ఞము 33 నెలలలో పూర్తి అవుతుంది. సాంస్కృతిక దిగ్విజయము కొరకు సమర్థుడు, సార్వభౌముడు అయిన ప్రజా నాయకుడు ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తాడు.

13. **చయన యాగము** : ఏ యజ్ఞములో ఇటుకలతో వేదిక నిర్మాణము జరుగుతుందో దానిని చయన యాగమని అంటారు. ఈ వేదిక 10 మూరల పొడవు, వెడల్పు కల్గి ఉంటుంది. దీనిని ఆత్మ అని అంటారు. దీని దక్షిణ ఉత్తరములయందు ఆరేసి మూరల తిన్నెను నిర్మాణం చేస్తారు. దీనిని దక్షిణ పక్షము, ఉత్తర పక్షము అని పిలుస్తారు. పశ్చిమ దిక్కు నిర్మించబడిన 5 1/2 మూరల కైవారంగల తిన్నెను పుచ్ఛ అని పిలుస్తారు. దీని ఎత్తు 5 మూరలు ఉంటుంది. అందువలన దీనిని పంచచితికస్తండిల అని అంటారు. దీని నిర్మాణంలో 14 రకాల ఇటుకలను ఉపయోగిస్తారు. చయనయాగము యొక్క వేదికలో సమస్త ఇష్టికలు 11170 ఉంటాయి.

14. **పురుష మేధ యజ్ఞము** : ఈ యజ్ఞంలో పురుషులను స్తంభాలకు బంధించి తరువాత వదిలివేస్తారు. దీనిలో 11స్తంభాలు ఉంటాయి. ఈ యజ్ఞం 40 రోజులలో పూర్తి అవుతుంది. యజ్ఞానంతరం వానప్రస్థాశ్రమము స్వీకరించ బడుతుంది.

15. **సర్వమేధ యజ్ఞము** : ఈ యజ్ఞంలో అన్నిరకాలైన వనస్పతులు, అన్నము హవనం చేయబడతాయి. ఇది 34 దినాలలో సమాప్తమవుతుంది.

16. **పితృమేధయజ్ఞం** : ఈ యజ్ఞంలో పితృ దేవతల అస్తికల దహనం జరుగుతుంది. దీనిలో ఋత్విక్కులుగా కేవలము యజుర్వేద తంత్రమును నడుపు అధ్వర్యులే ఉంటారు.

17. **ఏకాహ యజ్ఞం** : ఒక రోజంతా జరిగే యజ్ఞమును ఏకాహ యజ్ఞమని అంటారు. ఏ యజ్ఞములోనైతే ఒక సుత్యా, సోమయాగము, విశ్వజిత్, సర్వజిత్, భూష్టోమము వంటి వందకంటె ఎక్కువ యజ్ఞాల సూత్రాలు నిహితమై ఉంటాయో దానిని ఏకాహ యజ్ఞమని అంటారు.


18. **అహీన యజ్ఞం** : రెండు సుత్యాల నుండి 11 సుత్యాల వరకు జరుపబడే యజ్ఞాన్ని అహీన యజ్ఞమని అంటారు. ఇది కూడ వివిధ నామాలతో శతాధిక సూత్రాలద్వారా విశదీకరించబడింది.

19. **అశ్వమేధ యజ్ఞం** : సాంస్కృతిక దిగ్విజయం కొరకు ప్రజా నాయకుడు ఈ యజ్ఞానుష్ఠానాన్ని ఆచరిస్తూ ఉంటాడు. ఇది యజ్ఞములకు రాజుగా నిర్ధారించబడింది. దీనివల్ల దృశ్య

**నిన్ను గురించి నీవు చెప్పుకోకు. మంచి చెప్పుకుంటే ఎవరూ నమ్మరు. చెడు చెప్పుకుంటే ఇంకెంత ఉన్నదో అనుకుంటారు.**

అదృశ్య జగత్తులలో అనేక చమత్కారాలు ఉత్పన్నమవుతాయి. దిగ్విజయం కొరకు ఈ యజ్ఞంలో సర్వాలంకృత అశ్వాన్ని వదిలిపెడతారు. దీనిలో 21 మూరలు గల 21 విజయ స్తంభాలు ఉంటాయి.

20. **సత్రములు** : 12 నుండి 16 వరకు, 1 నుండి 33 వరకు, 35 నుండి 40 వరకు, 49 నుండి 100 వరకు, అలాగే 308, 1000 సుత్యాలుగల అనేక సోమయాగాలు ఉన్నాయి. వీటిని సత్రములు (యజ్ఞములు) అని అంటారు.



గరుడ ధ్వజం

యజ్ఞముల యొక్క స్వరూపం, విధానం, వైవిధ్యములను అనుసరించి, అవసరాన్ని, విశిష్టతను దృష్టియందు ఉంచుకొని కుండముల యొక్క ఎంపిక జరుగుతూ ఉంటుంది. సూక్ష్మదృష్టి కలిగిన వారు హవన కుండము అనేది అంతరిక్షంలో వ్యాపించిన బృహత్సోమము యొక్క అవతరణకు ఆధారమని తెలుసుకోగల్గుతారు. ఈ యజ్ఞ కుండములోనికి దేవశక్తుల యొక్క అనుగ్రహం వర్షించి, అది యజ్ఞధూమముతో కలిసి మొత్తం విశ్వంలో వ్యాపిస్తుంది. ఈ నిర్మాణం వేసే ఆహుతులపైన, ప్రయోజనకర్త యొక్క సంకల్పముపైన ఆధారపడి ఉంటుంది.

కుండ సిద్ధికారులను అనుసరించి 50 నుండి 100 ఆహుతులు ఈయదలిస్తే మోచేయి నుండి చిటికిన వేలు వరకు ఒక వేయి ఆహుతులు ఈయదలిస్తే, ఒక మూర మొత్తము, 10,000ల ఆహుతులకయితే రెండు మూరలు, ఒక లక్ష ఆహుతులకయితే 10 మూరలు, అదే విధంగా 10 లక్షలు లేక కోటి ఆహుతుల నిమిత్తం క్రమంగా 6 మూరలనుండి 16 మూరలు కల్గిన హవనకుండాన్ని నిర్మించవలసి ఉన్నది. భవిష్యోత్తర పురాణము, స్కంద పురాణము, శారదా తిలకములలో ఇలాంటి వివరణలు లభిస్తాయి. వీటి యొక్క మరికొన్ని విశిష్ఠతలను స్పష్టం చేస్తూ కుండ సిద్ధికారులు వ్యక్తీకరించే అభిప్రాయాలు ఏమంటే-

తాంత్రిక ఉపాసనలలో ప్రయోగించబడే యంత్రములు, కాగితములు, లోహపు రేకులపై గీసే వంకర టింకర రేఖల వంటివి ఇవి ఎంత మాత్రము కావు. వీటిని దేవశక్తుల యొక్క ప్రతిబింబములుగా భావించి తదనురూపంగా దైవశక్తులను ఆకర్షించడం జరుగుతుంది. ఇలాగే కుండ నిర్మాణం యొక్క ఉద్దేశ్యము కూడా సౌందర్య ప్రదర్శన ఎంత మాత్రము కాదు. విభిన్న ఆకృతుల యొక్క ఉద్దేశ్యము అనేక శక్తిధారల యొక్క ఆకర్షణతో ముడిపడి ఉంటుంది. అందుకే శాస్త్రకారులు వీటిని శిల్పుల ద్వారా సవ్యంగా ఖచ్చితంగా నిర్మాణం గావించాలని నిర్దేశించారు.

ఆధునిక కాలంలో వ్యాప్తిలో ఉన్న కర్మకాండలలో చతుష్కోణం, అర్ధచంద్ర త్రికోణం, వృక్షము, విషమ షడస్ర, విషమ అష్టాస్ర, పద్మ, సమషడస్ర, సమఅష్టాస్ర, యోని కుండములు ఉపయోగంలో ఉంటున్నాయి. నిలువు విస్తరణకు సంబంధించిన నియమ నిబంధనలవలెనే కుండ సిద్ధ శారదా తిలకములలో కుండముయొక్క లోతును గురించిన వివరణ మనకు లభిస్తుంది. వీటి అనుసారం కుండము యొక్క విస్తరణ, ఎత్తు ఎంతవరకు ఉంటాయో అంత లోతు మొదటి మెట్టువరకు ఉండవలసి ఉంది. అలాగే లోతులో 24వ భాగంతో కుండ నిర్మాణం జరగటము శ్రేష్ఠము. క్రియాసారము, లక్షణ సంగ్రహములలో ఒక మేఖల(మెట్టు) గల కుండము అధమము అని, రెండు మేఖలల కుండము మధ్యమము అని, మూడు మేఖలల కుండము ఉత్తమము అని పేర్కొనబడింది. మరికొందరు విద్వాంసులు 5 మేఖలల కుండము ఉత్తమోత్తమమైనదిగా నిర్ధారించారు. ఈ మూడు మెట్లకు సత్వ రజస్తమో గుణాలను భావన చేస్తూ వాటికి ప్రతీకగా 3 రంగులు పూయబడతాయి. అలాగే 5 మేఖలల యజ్ఞకుండమైతే పంచతత్వాలను భావనచేస్తూ ఆ 5 రంగులు పూయవలసి ఉన్నది.

కుండ నిర్మాణము జామితి, భూమితి, క్షేత్రమితి, వాస్తు శాస్త్రములతో సంబంధాన్ని కల్గి ఉన్నది. ఈ విషయంలో ఎక్కువ ఆసక్తి గల్గిన జిజ్ఞాసువులు కుండ సిద్ధ, భవిష్య పురాణము,


**తక్కువ తిను. ఎక్కువ కాలం జీవించు.**

వాయుపురాణము, అనుష్ఠాన ప్రకాశము, పంచరాత్ర క్రియాసార సముచ్చయము, శారదా తిలకము మొన్నగు గ్రంథాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఇతర కర్మల ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకొని వివిధ లక్ష్యాలను నెరవేర్చటం కోసం వివిధ ఆకారాలు కల్గిన కుండములను వివిధ దిశలలో నిర్మాణం చేయటం వలన శ్రీఘ్ర ఫలసిద్ధి కలుగుతుంది. ఈ కారణంవల్ల కూడా నిర్మాణంలో వైవిధ్యం ఏర్పడింది. బహుపృచ పరిశిష్ఠాది గ్రంథములలో –

**భుక్తా ముక్తే తథాపుష్టౌ జీర్ణోద్ధారే విశేషతః ।**
**సదాహోమే తథా శాంతవృతం వరుణాదిగ్మతం ॥**

అని ఉన్నది.

అనగా – భుక్తి, ముక్తి, పుష్టి, జీర్ణోద్ధరణ, శాంతి కొరకు పశ్చిమ దిశలో వృత్తాకార కుండ నిర్మాణం చేసి హవనం చేయవలసి ఉంది. ఈ ప్రకారంగానే దిశాబేధం యొక్క విశేషాన్ని స్పష్టం చేస్తూ ఇతర గ్రంథకర్తలు ఏమి వ్రాసారంటే – స్తంభన కోసం తూర్పు దిక్కున చతురస్ర కుండము, భోగప్రార్తి కొరకు అగ్నేయ దిశలో యోని కుండము, గెలుపు (మారణం) కొరకు దక్షిణ దిశలో అర్ధచంద్రాకార కుండము లేదా నైరుతి దిశలో త్రికోణాకార కుండము, శాంతికొరకు పశ్చిమ దిశలో వృత్తకుండము, ఉచ్చాటన (పిశాచాలను పారద్రోలుటకు) కొరకు వాయువ్య దిశలో షడస్ర కుండము, పౌష్టిక కర్మ కొరకు ఉత్తర దిశలో పద్మకుండము, ముక్తి కొరకు ఈశాన్యంలో అష్టాస్ర కుండము నిర్మించవలసి ఉన్నది. వీటిలో కొన్ని విశిష్ట కార్యముల కొరకు కూడా ఉపయోగించబడతాయి.


కమండల పతాకం

పుత్రప్రాప్తి కొరకు యోని కుండము, భూత ప్రేత గ్రహ బాధల నిర్మూలన కొరకు పంచాస్ర లేక ధనుర్జా వృత్తి కుండము, హింసాత్మక దోష నివారణకు సప్తాస్ర కుండములను ఉపయోగిస్తారు.

నిత్య నైమిత్తిక కర్మకాండలో హవన కుండ నిర్మాణము వీలుకాని పక్షంలో 4 అంగుళాల ఎత్తు, ఒక మూర పొడవు, వెడల్పు కల్గిన మట్టిపాత్రకు బంగారు రంగు పూసి దానిలో హోమం చేయవచ్చునని శారదా తిలకంలో చెప్పబడింది.

శాస్త్రకారులు చెప్పిన విధంగా "కుండమేవ విధానస్యాత్ స్తండిలేన సమాచరేత్". ఈ పాత్రను యజ్ఞకుండము ఉంచే ప్రదేశంలోనే నిజ జీవితాన్ని చరితార్థం చేసికోవటానికి ఉపయోగించుకోవాలి. యజ్ఞ విధానం, ఉపకరణముల విశిష్టత, సూక్ష్మ శక్తులు – వీటి గురించి అవగాహన చేసికొని వ్యవహారిక జీవితంలో వాటిని అమలుపరచాలి.


ఈ దృష్టితో చూస్తే ప్రస్తుతం చేయబడుతున్న అశ్వమేధ మహాయజ్ఞ పరంపర నభూతో నభవిష్యతి అని చెప్పవచ్చు. వీటిని అంతరిక్షంలోను, దృశ్య జగత్తులోను కూడ నవయుగానికి తగిన వాతావరణ నిర్మాణానికి చేసే సర్వసమర్థమైన ప్రయోగములుగా గుర్తించవలసి ఉంది. ఒక వైజ్ఞానిక ప్రయోగకర్త తన ప్రయోగము యొక్క సిద్ధాంతాలను, విధానాలను ఉపకరణముల యొక్క విలువను, సూక్ష్మతను, సామర్థ్యాన్ని బాగా తెలుసుకొని వాటిని ఎలాగైతే ఆచరణలో పెట్టగల్గుతున్నాడో అదేవిధంగా ఈ అశ్వమేధ యజ్ఞాల ప్రయోగం కూడా జరుగుతోంది. వీటిలో ఉపయోగించే కుండములు, మండపములు, కర్మకాండ అన్నీ శాస్త్రీయ పద్ధతిని అనుసరించి ఉంటాయి. దీనివల్ల అశ్వమేధం ఫలవంతంగా కావటమే కాక వైదిక క్రియాకలాపాలు, సాంప్రదాయాలకు సంబంధించిన గొప్ప శిక్షణ కూడా లభిస్తుంది. ఈ మహాయజ్ఞములో భాగస్వామ్యం వహించేవారు వైదిక యాగంలో మహర్షి గణాలలో తామూ ఒకరైనట్లు అనుభూతి పొందుతారు. అనుభూతి అనే ఈ నిధి వారికి జీవితాంతం ఋషిత్వ ఉదయము, వికాసముల కొరకు ప్రేరణను ఇస్తూ ఉంటుంది.

H H H


**ఆశావాది విమానాన్ని కనిపెడతాడు. నిరాశావాది పేరాచూట్‌ను కనిపెడతాడు.**




యోని కుండం




అర్ధచంద్ర కుండం




త్రికోణ కుండం




వృత్త కుండం




సమ అష్టాస్ర కుండం



సమషడస్ర కుండం



చతుష్కోణాస్ర కుండం



పద్మ కుండం

ప్రపంచమే ఉత్తమ గ్రంథం.

## గురుదేవుల అమృతవాణి

# యజ్ఞసంస్కృతి పునరుద్ధరణ మహాకాలుని సంకల్పం

ప్రాచీన కాలంలో ప్రజలు సామూహిక చర్చల ద్వారా, సామూహిక కృషి ద్వారా తమ సమస్యలన్నింటిని పరిష్కరించుకొనేవారు. చక్రవర్తులందరిమీదా, ప్రభుత్వాల మీదా, ఇతర పాలకులమీదా వారు ఆధారపడేవారు కారు. నేటికీ, ప్రభుత్వం కన్న, పరిపాలనా వ్యవస్థలకన్న సమాజం అనేక విషయాలలో మరింత ప్రముఖ పాత్ర వహిస్తోంది.

రక్షణ, రవాణా, పన్నుల విధింపు, ఆర్థిక వికాసం, పౌరచట్టాల రూపకల్పన వంటి స్థూల జీవన విధానానికి సంబంధించిన స్థూల వ్యవహారాలను పాలనా యంత్రాంగాలు నిర్వహించగలుగుతాయి. అయితే అవి ప్రజల మనస్తత్వాన్నీ, భావనలనూ 'పాలించ'లేవు.

ఉదాహరణకు – సౌశీల్యం, నిజాయితీ, నైతిక ప్రవర్తన సమకాలీన సామాజిక కట్టుబాట్ల ద్వారా రూపొందుతాయి, వర్ధిల్లుతాయి. ప్రభుత్వ యంత్రాంగం ఏదీ వాటిని రుద్దజాలదు, పోషించజాలదు. తత్వవేత్తల, మత నాయకుల, మనీషుల లక్ష్యం ప్రజల శ్రేయస్సును పెంపొందించడం. అయితే, సామాన్య ప్రజలతో సన్నిహితులు అయితే – ప్రజల విశ్వాసాన్ని వారు ప్రభావితం చేయగలుగుతారు; తద్వారా సామాజిక ధోరణులను వారు ప్రభావితం చేయగలుగుతారు.

### మేధోమథనానికై మహాయజ్ఞాలు

మనిషి ప్రాపంచిక సుఖాలకూ, ఆకర్షణలకూ లొంగిపోవచ్చు. ఫలితంగా – సామాజిక, సాంస్కృతిక విలువలూ, సంప్రదాయాలూ వికృతి పొందవచ్చు. ఆ స్థితిలో ప్రజల హితాన్ని కోరే నాయకులూ, మనీషులూ ఆ వికృతులను తొలగించే బాధ్యతను స్వీకరిస్తారు.

రాజసూయ, అశ్వమేధములవంటి మహాయజ్ఞాలు సమకాలీనమైన సవాళ్లను ఎదుర్కొనడానికీ, లోపాలను సరిదిద్దడానికీ, మంచి భవిష్యత్తు కోసం కార్యాచరణ పథకాల రూపకల్పనకూ, అమలుకూ ఉద్దేశించబడిన మేధో మథన సమావేశాలకు మాధ్యమాలుగా పనిచేసేవి.

మహాభారత యుద్ధం తర్వాత యధిష్ఠిర చక్రవర్తి రాజసూయ యజ్ఞం నిర్వహించాడు. దేశంలో, దేశం చుట్టూ ఉన్న రాజ్యాలన్నింటి అధిపతుల సామూహిక భాగస్వామ్యంతో సమైక్యంగా, సార్వభౌమంగా, శక్తివంతంగా జాతిని తిరిగి నిర్మించడం ఆ యజ్ఞం వెనుక ఉన్న ఉద్దేశ్యం.

రామచంద్ర ప్రభువు అశ్వమేధ యజ్ఞం నిర్వహించాడు. సామాజిక, జాతీయ జీవన వ్యవస్థలోని, విస్తృతమైన ప్రజా జీవనంలోని దోషాలను నిర్మూలించి, దివ్య మూల్యములను విస్తరింపజేయడం దాని లక్ష్యం. యజ్ఞ అశ్వాన్ని దేశం నలుమూలలకూ పంపడం ద్వారా ఆయన ఈ యుగ సంస్కార సందేశాన్ని వ్యాప్తి చేశాడు. అభిప్రాయాలను కలబోసుకోవడానికీ, ఈ బృహత్ పరివర్తనకు అవసరమైన వ్యవస్థలను నిర్మించడానికీ ఒక స్థలంలో సమావేశం కావలసిందిగా ఆయన ఋషులనూ, మునులనూ, సంస్కర్తలనూ, పాలకులనూ, మేలుకొన్న ఆత్మలనూ ఆహ్వానించాడు.

### దినచర్యలో అంతర్భాగం హవనం

ఆ రోజులలో అగ్నిహోత్రం లేక హవనం ప్రజల దినచర్యలో అంతర్భాగంగా ఉండేది. గాయత్రీ ఉపాసన, హవనం చేయనిదే ప్రజలు భోజనం చేసేవారు కారు. ఆంతరిక సంస్కరణనూ, ఆధ్యాత్మిక ప్రగతినీ ఆకాంక్షించే మనమంతా ఈ క్రమశిక్షణను మన జీవితాలలో రంగరించుకోవాలి.

సామాజిక, ఆధ్యాత్మిక విప్లవం కోసం అశ్వమేధ, రాజసూయ యజ్ఞాలు నిర్వహించబడేవి. రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి వాజపేయ యజ్ఞాలు జరిగేవి. ఇవి

**దేవుడే ఉత్తమ స్నేహితుడు.**

ధార్మిక సమ్మేళనాలు. ప్రజల సామూహిక భాగస్వామ్యంతో ఈ యజ్ఞాలన్నీ జరిగేవి. ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందిన మహనీయులు, ఋషులు, ప్రతిభామూర్తులు, నిపుణులు, సమాజంలోని వివిధ వర్గాల నాయకులు, సాంస్కృతిక, సామాజిక ధోరణులను ప్రభావితం చేయగలిగిన మహావ్యక్తులు ఈ యజ్ఞాలలో పాల్గొనేవారు.

సామాన్య ప్రజానీకం ఈ యజ్ఞాలలో పాల్గొని, వీటి బహుముఖ ప్రయోజనాలను పొందేవారు. ఆయా సిద్ధాంత చర్చల ప్రయోజనాన్ని పొందేవారు. మహర్షుల దర్శనం చేసుకునేవారు. తమ వ్యక్తిగత, కుటుంబ సమస్యలపై వారి మార్గదర్శనాన్ని పొందేవారు. రాజాశ్రయంతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఈ యజ్ఞాలు జరిగేవి. రాజులు ఈ యజ్ఞాలను గౌరవించేవారు. యజ్ఞాలలో, పరిపాలనపై రక్షణపై జరిగే చర్చలలో పాల్గొనేవారు.

కుంభమేళాలు వాజపేయ యజ్ఞాలకు ప్రసిద్ధ ఉదాహరణలు. హరిద్వార్, నాసిక్, ఉజ్జయిని వంటి వివిధ స్థలాలలో ఇవి జరిగేవి. ఇప్పుడూ కుంభమేళాలు జరుగుతున్నాయి. అయితే అవి సామూహిక పూజలకూ, కలుషితమైన నదులలో స్నానాలకూ పరిమితం అవుతున్నాయి.

## యజ్ఞభావనను పునరుద్ధరించే పని

ఆధునిక యుగానికి అనుగుణమైన రీతిలో వాజపేయ యజ్ఞాల వెనుక ఉన్న భావనను పునరుద్ధరించడానికై గాయత్రీ పరివార్ వివిధ స్థలాలలో భారీ యెత్తున 25 కుండముల యజ్ఞములను దేశమంతటా నిర్వహిస్తోంది. స్థానిక సమస్యల నేపథ్యంలో సాంఘిక సంస్కరణపై మనం ఈ యజ్ఞాలలో మన దృష్టిని కేంద్రీకరిస్తున్నాం. వరకట్నం, మద్యపానం, సాంస్కృతిక పతనం, దారిద్ర్యం, నిరుద్యోగం మున్నగు సమస్యలు ప్రాచీన కాలంలో లేవు. కనుక, మన ధర్మ శాస్త్రాలలో వీటి పరిష్కారాల ప్రస్తావన కనబడదు.

ఋషులు ప్రతి యుగంలోనూ జన్మిస్తారు. సామాన్య ప్రజల ఉన్నతికీ, శ్రేయస్సుకూ వారు ప్రాతిపదికలు నిర్మాణం చేస్తారు. దిశను నిర్దేశిస్తారు. ప్రేరణను ప్రదానం చేస్తారు. మతవేదిక ద్వారా ప్రజా శిక్షణనూ, ప్రజల సామాజిక నైతిక ఉన్నతినీ సాధించడం మన ఋషి సంస్కృతిలోని ఒక ప్రముఖ భాగం. ఈ సామూహిక యజ్ఞముల ద్వారా దానిని పునరుద్ధరించడానికి మనం కృషిచేస్తున్నాం.

## సద్గుణ సంపద పెంపుదలకు

మహా యజ్ఞముల ద్వారా సామూహిక కృషి సాధనంగా సామాజిక స్పృహ, సామాజిక సంస్కరణ పెంపొందింపబడతాయి. వాతావరణం క్షాళన అవుతుంది. వీటితో పాటు మహాయజ్ఞములు ప్రజల నైతిక అభ్యున్నతిని సాధిస్తాయి. యజ్ఞం మనకు బోధించేవి పరోపకారం, ఉదాత్తమైన కర్మలు. యజ్ఞంలో పాల్గొనేవారికి మనం ఈ విషయం బోధిస్తాం. పవిత్ర ఆలోచన, నిజాయితీ, దయ, ఇతరుల హితం కోసం సహకారం అనే సద్గుణాలను అలవరచుకుంటే తప్ప ప్రపంచం మీకు మంచి చేయదు. నీతిరాహిత్యం అనేది శ్వాస ద్వారా వ్యాపించే అంటువ్యాధి వంటిది. మనం పర్యావరణాన్ని కలుషితం చేస్తూ ఉంటే, మనకు నిర్మలమైన, ఆరోగ్యప్రదమైన గాలి దొరకదు. ఆలోచనల, భావనల సూక్ష్మజగత్తు విషయంలో ఇది మరీ నిజం. కనుక, మీరు యజ్ఞ బోధనలను మీ హృదయంలో, మనస్సులో నింపుకోవాలి.

ఒక ఉదాహరణ. మీరు భోజనం చేస్తున్నారు. దాన్ని సాధ్యపడేటట్లు చేసిన జ్ఞాత, అజ్ఞాత వ్యక్తులను అందరినీ ఆ సమయంలో మీరు గుర్తుంచుకోవాలి. మీరు తినే అన్నం బియ్యంతో తయారవుతోంది. ఆ వరి ధాన్యం పొలంలో పండుతోంది. రైతులు, కూలీలు, పశువులు దానికోసం పడ్డ శ్రమ గురించి మీరు ఆలోచించండి. వారి సహకారం లేనిదే మీకు అన్నం రావడం సాధ్యపడదు – మీ వద్ద ఎంత ధనం ఉన్నా, మీరు ఎంత పెద్ద పదవిలో ఉన్నా. మీరు విజయాలు, సుఖాలు, ఆస్థులూ పొందుతున్నారు. వీటన్నింటి కోసం మీ కుటుంబానికి, మీ సమాజానికి, మీ జాతికి యావత్ ప్రపంచానికీ

**గొప్పవారికి వ్రతమే సుఖం. అల్పులకు సుఖమే వ్రతం.**

మీరు ఋణపడి ఉన్నారు. మీరు కృతఘ్నులుగా ఉండకూడదు. ఇతరులపట్ల మీ కర్తవ్యాలను ఉపేక్షించకూడదు.

## సహస్ర కుండీయ యజ్ఞం ఓ అద్భుతం

భారీయెత్తున డబ్బు ఖర్చుపెట్టి, కార్మికులను నియమించి జరిపే పెద్దపెద్ద సభలు కావు యజ్ఞాలు. అనేక మంది వ్యక్తుల సాధన, సంకల్ప బలం, అంకిత భావం, శ్రద్ధాభక్తులు, ఉదాత్త ఆశయాలు సామూహికంగా కేంద్రీకృతం అయినపుడే ఈ యజ్ఞాలు విజయవంతం అవుతాయి. నా మహాపురశ్చరణ సాధన పూర్తయిన సందర్భంగా, నా గురుదేవుల దివ్య ప్రేరణతో, దివ్య ఆదేశం ప్రకారం – మన సంస్థ మొదటి సహస్ర కుండీయ యజ్ఞం నిర్వహించింది. నావద్ద ఉన్న కొద్దిపాటి వనరులతో చరిత్రాత్మక వైభవం కలిగిన అంతటి మహా సంఘటన జరగడం అద్భుతమని ప్రజలు భావించారు.

ఆ యజ్ఞంలో వేలాదిమంది పాల్గొన్నారు. వారందరి బసకూ, భోజనాలకూ తగు ఏర్పాట్లు జరిగాయి. ఇంతటి బృహత్ కార్యం ఎలా సాధ్యమయింది? ప్రాపంచికమైన అవగాహనకు అందని విషయం అది. ఇది పరమేశ్వరుని పథకం. ప్రజ్ఞావతారం యొక్క యోజనలను ప్రకటించే పథకం. ఎన్ని కష్టాలు ఎదురయినా, పరమేశ్వర ఇచ్ఛ ద్వారా ప్రేరణ పొందిన ఉదాత్త కార్యాలు ఎన్నడూ ఆగిపోవు. లక్షలాది వ్యక్తుల చిన్నచిన్న అంశదానాలు, అజ్ఞాత వ్యక్తుల నుండి ఆశించని సహాయం, భక్తులు సమర్పించిన బృహత్తరమైన సామూహిక శ్రమ, "అపరిమితమైన సంఖ్యలో ఉన్న ప్రజలకు వడ్డించినప్పటికీ పరిమితమైన ఆహారం అక్షయంగా ఉండడం" వంటి అద్భుతాలు – ఇలాంటి ఏ రూపంలో అయినా సహాయం అందుతుంది. పనులు పూర్తవుతాయి.

## యజ్ఞానికి కావాలి సాధన

ఇలాంటి యజ్ఞాలకు సాధన అత్యవసరం. ఏవేవో మంత్రాలతో ఏవేవో ఔషధులను ఆహుతి చేయడం అనే కేవల కర్మకాండ ఆధ్యాత్మిక ప్రయోజనాల దృష్ట్యా అంత ప్రధానం కాదు. మీ ఆహుతుల కోసం భగవంతుడు ఆకలితో ఎదురుచూడడం లేదు. పూజ, భక్తి గీతాల గానం, ప్రార్థనలు అనే కేవల కర్మకాండ ఉపాసన – సాధనకు చాలదు. భగవానునికి నచ్చేవి – మీ నైతిక ప్రవర్తన, మీ సుగుణ సంపద, మీ నిజాయితీ, మీ దయా దాక్షిణ్యాలు, మీ కర్తవ్య నిష్ఠ, మీ పరోపకార పారీణత. ఆత్మ సంస్కరణ, నైతిక పరివర్తన అనే గుణాలు మీలో నిజంగా ఉంటే – యజ్ఞంలో పాల్గొన్నందువల్ల మీకు శాశ్వత ప్రయోజనం కలుగుతుంది.

యజ్ఞం యొక్క వైదిక సంప్రదాయాన్ని పునరుజ్జీవింప చేయాలంటే – యజ్ఞ విజ్ఞానాన్ని తిరిగి స్థాపించవలసి ఉంది. బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్ ఇందుకు అగ్రగామిగా నిలుస్తోంది. మీరు యజ్ఞోపతీ పరిశోధనశాలను చూడాలి. అక్కడ అమర్చబడి ఉన్న శాస్త్ర పరికరాలను చూడాలి. యజ్ఞం చేయడం వల్ల శరీరం పని చేయడంలో కలిగే వైద్యపరమూ, శారీరికమూ, ఆంతరికమూ అయిన మార్పులను ఈ పరికరాలు నమోదు చేస్తాయి. మెదడులో, మనస్సులో వచ్చే మార్పులను నమోదు చేస్తాయి. ప్రజల శారీరిక మానసిక ఆరోగ్యానికీ, పర్యావరణ సమతూకాన్ని తిరిగి నెలకొల్పడానికీ యజ్ఞాన్ని శాస్త్రీయంగా ప్రయోగించే విధానాలు క్రమంగా విస్తరిస్తాయి. మహాకాలుని సంకల్పం ఇది.

## మహాకాలుని యోజన ఇది

సూక్ష్మ వాతావరణాన్ని సంస్కరించే ఉదాత్త లక్ష్యంతో జరుగుతూన్న అపూర్వమైన ఆధ్యాత్మిక ప్రయోగాలు మనం నిర్వహిస్తూన్న కొన్ని యజ్ఞాలు. జీవాత్మలలో ఉన్న పరమాత్మను మేలుకొల్పే యజ్ఞాలు ఇవి. యుగ పరివర్తనకు, కృతయుగ అవతరణకూ మహాకాలుని యుగ యోజనలోని అంతర్భాగాలు ఇవి. గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో జరుగుతూన్న ఈ యజ్ఞములను నిర్వహించడం ద్వారా, వీనిలో పాల్గొనడం ద్వారా కృతయుగాన్ని అవతరింపజేయడంలో ప్రజ్ఞావతారానికి సహచరులం కావడం మనకు అందిన దివ్య సౌభాగ్యం.

H H H


**గురి చూసి గుంటనక్కను కొట్టే కన్న, గురి తప్పినా పులినే కొట్టు – <¬`Ç¼ª•~Òƒìƒì.**

# ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 24

## హిమాలయం నుండి ఆహ్వానం - 4

గుహ లోపల ప్రవేశించిన, శ్రీరామ్ అక్కడ కొన్ని రాళ్లు ఉంచబడినట్లు చూచారు. గురుదేవులు ఆ రాళ్లలో ఒకదాని చూపి, "అక్కడ కూర్చో" – అన్నారు. శ్రీరామ్ ఆ రాయిపై కూర్చున్నారు. వెంట తెచ్చిన బట్టలు, ఇతర సామాను క్రిందనే ఉంచారు. శ్రీరామ్ గురుదేవులవైపు పరకాయించి చూడసాగారు. వారు తమ చలిమంట దగ్గర ఉన్న పాత్రలో దేనినో చూస్తున్నారు. వారా పాత్ర పుచ్చుకుని లేచారు. వెనుక ఉన్న గోడవరకు వెళ్లారు. గుహలో తగినంత వెలుతురు లేదు. అంతా మసక మసకగా ఉంది. గురుదేవులు గోడవద్ద కొద్దిసేపు నిలబడి తనవద్దకు వచ్చినట్లు మాత్రం శ్రీరామ్ చూడగలిగారు. వారా పాత్రను శ్రీరాముకు అందిస్తూ, "ఇది త్రాగు. నిద్రపో" – అన్నారు.

పాత్రలో ఏమున్నదని అడగాలని శ్రీరామ్‌కు అనిపించలేదు. త్రాగగా ఆ ద్రవం వెచ్చగా ఉంది. ఉప్పగా – తీయగా ఉంది. ఆయన త్రాగడం చూచి, గురుదేవులు ఇలా అన్నారు – ఇది సంజీవనీ రసం. దీన్ని త్రాగగానే నీ ఆకలిదప్పులు తీరిపోతాయి. నీ శరీరానికి అవసరమైన పోషణ లభిస్తుంది.



ఆ సంజీవనీ రసం త్రాగగానే, శ్రీరామ్‌కు తృప్తి అనిపించింది. ఆయనకు నిద్ర వస్తోంది. గురుదేవులు తమ చలిమంట వద్ద కూర్చున్నారు. ఇంధనం వేయడంతో మంట పెరిగింది. వాతావరణంలో వెచ్చదనం వస్తోంది. నిద్రపోయే ముందు శ్రీరామ్ గురుదేవులకు ప్రణామం చేశారు. తన ఎడమచేయి తలక్రింద పెట్టుకుని పడుకున్నారు.

ఆయన నిద్ర లేచేసరికి గుహలో ఎవరూ లేరు. గురుదేవులూ లేరు. ఆయన సూచన కాని, నిర్దేశం కాని లేదు. నిద్ర లేచిన వెంటనే శ్రీరామ్ చటుక్కున కూర్చున్నారు. నిద్ర లేచేటపుడు ఉండే బద్ధకం లేదు. కూర్చొనగానే ఆయన తన చుట్టూ చూచారు. శిల దగ్గర ఒక దొన్నెలో రెండు పండ్లు ఉంచబడ్డాయి. ఆ దొన్నెను ఏదో అడవి పండు తొక్కను కోసి తయారు చేశారు. ఆ పండు కొబ్బరికాయ కన్న పెద్దదై ఉండాలి. కనుకనే ఆ దొన్నె అంత పెద్దదిగా ఉంది. ఆ పండ్లు తినాలనే కోరిక కలిగింది. అయితే మనసు, బుద్ధి ఆ కోరికపై అంకుశం ప్రయోగించాయి. తాను ఎంతసేపు నిద్రపోయిందీ ఆయనకు తెలియలేదు. సంధ్య–పూజ తర్వాతనే ఆహారం తీసుకోవాలి.

శిలనుండి లేచి, శ్రీరామ్ గుహ ద్వారం వైపు వెళ్లారు. ఆ గుహ అంత పద్ధతి ప్రకారం అమర్చబడి లేదు. అయినా శుభ్రంగా ఉంది. ధూళి, మట్టి ఆ ప్రాంతంలో లేనేలేవు – గాలికి ఎగిరి రావడానికి. ఆయన గుహ బయటికి వచ్చారు. గుహకు త్రోవ ఎత్తు పల్లాలుగా ఉంది. జాగ్రత్తగా నడవాలి – అనిపించింది. గురుదేవులతో పాటు ఆయన గుహలోపలికి వచ్చారు. అప్పుడు ఇలాంటి ఆలోచన రాలేదు. ఎవరో ఒడిలో ఎత్తుకొని తీసుకువస్తున్నట్లు అప్పుడు అనిపించింది. ఇప్పుడు బయటికి వెళుతూ జాగ్రత్తగా అడుగు వేశారు.

ఆయన గుహ బయటికి వచ్చి చూచారు. కనుచూపు మేరకు మంచు వ్యాపించి ఉంది. మధ్యమధ్యలో రంగురంగుల పువ్వులు, పొదలు ఉన్నాయి. ఆకాశంలో సూర్యుడు మెరుస్తున్నాడు. ఇక్కడికి వచ్చినపుడు దృశ్యం మరోవిధంగా ఉంది. గుహలో ఎంతసేపు ఉన్నదీ తెలియడంలేదు. లోపలికి వచ్చినప్పటికీ, ఇప్పటికీ బయటి దృశ్యం ఎలా మారిందో చూస్తే, చాలా సమయం గడచినట్లు అనిపించింది.

### సిద్ధభూమికి ప్రవేశ ద్వారం

శ్రీరామ్ కొద్దిసేపు ప్రకృతి అందాలను తిలకించారు. ఆ తర్వాత గుహ పరిసరాలపై దృష్టి సారించారు. కొద్దిదూరంలో సెలయేరు పారుతోంది. దానిదగ్గరకు వెళ్లాలనే కోరిక కలిగింది. సెలయేటి ఒడ్డుకు చేరి, నీటిని తాగారు. నీరు బావుంది. చల్లగానూ లేదు. వేడిగానూ లేదు. మైదాన ప్రాంతాలలో మార్చి – ఏప్రిల్

**ఎవడి బొమ్మలు మాటలో అతడు చిత్రకారుడు. ఎవడి మాటలు బొమ్మలో అతడు కవి – ‡•#°Q®O\÷.**

నెలల వేడిలో సెలయేళ్లలో, నదులలో నీరు ఎలా ఉంటుందో అలా ఉంది. లోయలో చలి ఉంది. కనుక ఆ నీరు మరింత హాయి అనిపించింది. నీరు తాకగానే, సంధ్యావందనం చేయాలని గుర్తు వచ్చింది.

శ్రీరామ్ వెంటనే స్నానం చేశారు. అక్కడే కూర్చుని సంధ్య వార్చసాగారు. సూర్యునికి అర్ఘ్యం ఇచ్చారు. ప్రదక్షిణం చేశారు. నిర్ణీతమైన జపం చేశారు. జప నివేదన పూర్తయింది. ఆయన లేవసాగారు. ఎదురుగా ఒక యువ సన్యాసి నిలబడి ఉన్నాడు. 25 – 26 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. శరీరం సన్నగా ఉంది. అయితే ఎముకలు దృఢంగా ఉన్నాయి. ఎగుబుజాలు, నిలబడిన తీరు, హావభావాలు – వీటివల్ల అతడి శరీరం పుష్టిగా, సమర్థంగా ఉన్నట్లు కనబడింది. అతడి చేతిలో ఏదో కందమూలం ఉంది. శ్రీరామ్ లేవగానే, అతడా కందమూలాన్ని ఇస్తూ, "దీనిని తీసుకోండి" – అన్నాడు.

శ్రీరామ్ ఇలా అన్నారు –

"క్షమించండి. నేను నా మార్గదర్శక సత్తా వద్దకు వచ్చాను. వారి అనుమతి లేకుండా తినలేను." వద్దంటే సరిపోయేది; గురుదేవులవద్దకు వచ్చాననే సంజాయిషీ ఎందుకు – అని ఆ మాట అన్న తర్వాత అనిపించింది. ఆ యువ సన్యాసి ఇలా అన్నాడు – "మీ గురుదేవులే దీన్ని మీకు ఇవ్వమని నన్ను ఆదేశించారు."

గురుదేవులు తమ ప్రతినిధిని పంపవలసిన అవసరం ఏముంది? ఇంతవరకు ఇస్తూ వచ్చిన విధంగా ఆయన సరాసరి తనకే నిర్దేశం ఇవ్వవచ్చు కదా – అనే ప్రశ్న మనసులో ఉదయించింది. ఈ అనుమానం రాగానే, యువ సన్యాసి ఇలా అన్నాడు –

"నేను మీ సహశిష్యుడను. వారి నిర్దేశం అందగానే మీ వద్దకు వచ్చాను. ఈ కందమూలం సాధకులకు బాగా ఉపకరిస్తుంది. ఆకలి దప్పులను తీర్చుతుంది. చలినుండి కాపాడుతుంది. శరీరంలోని కండరాలను యోగ సాధనకు అనుగుణంగా వదులు చేస్తుంది."

తన మనసులో వచ్చిన అనుమానాలకు శ్రీరామ్‌కు కొంచెం బాధ కలిగింది. మనసులోని మరో మూలనుండి ఇలా వినిపించింది– "సిగ్గుపడవలసిన అవసరం లేదు. మెలకువ వహించడం మంచిదే కదా."

మనసులో మరో ఆలోచన మెదిలింది – ఎవరి ఆశ్రయంవల్ల ఇంతవరకు రావడం సాధ్యపడిందో, వారిపై నమ్మకం ఉంచవలసిందే.

ఆ యువ సన్యాసి ఇచ్చిన కందమూలం రుచి సింఘాడే (ఒకవిధమైన నీటిమొక్క ఫలం) పండు రుచిలా ఉంది. అయితే అది తృప్తి నిస్తోంది. ఒక ముక్క తినగానే కడుపు నిండినట్లు అనిపించింది. శ్రీరామ్ యువ సన్యాసిని ఇలా అడిగారు –

"గురుదేవులు ఈ గుహలో నివసిస్తారా?"

అతడిలా జవాబిచ్చాడు –

"నివసించరు. వారిక్కడ ఉండరు. వారికి ఉన్న అనేక ఆవాసాలలో ఇది ఒకటి. వారు ఏ సమయంలో అయినా వస్తారు. అవసరం ఉన్న చోటికి వెళ్లిపోతారు."

"మీరు వారి సన్నిధిలో ఎంతకాలంనుంచి ఉంటున్నారు?"

– అని శ్రీరామ్ అడిగారు.

అతడిలా జవాబిచ్చాడు –

"ఇక్కడ రోజులు, నెలలు, సంవత్సరాల లెక్క ఉండదు. దానిమీద దృష్టి ఉండదు. సూర్యోదయ, సూర్యాస్తమయాలు మాత్రమే గుర్తుంటాయి. అది చాలు."

"మరి, ఒక వ్యక్తి వయస్సు ఎలా తెలుస్తుంది?"

– అని శ్రీరామ్ అడిగారు.

యువసన్యాసి ఇలా అన్నాడు –

"దాని అవసరం రాదు. ఒక విశిష్ట ఆత్మిక స్థితిని చేరుకున్న సాధకులే ఇక్కడికి రాగలుగుతారు. ప్రతి వ్యక్తీ రాలేదు. ఇది సిద్ధభూమికి ప్రవేశద్వారం. ఈ స్థితికి చేరిన సాధకుని శరీరం సమయం, స్థలముల ప్రభావంనుండి విముక్తి పొందుతుంది."

శ్రీరామ్ చింతనలో లీనమైనారు. ఒక పిలుపు ఆయనను ఆ స్థితినుంచి వెలికితెచ్చింది. గురుదేవుల పిలుపు అది. మేలుకోమని వారు చెపుతున్నారు. వారు కేవలం "శ్రీరామ్" అని మాత్రమే పిలిచారు. గాఢ నిద్రలో ఎవరో కుదిపి లేపినట్లు – శ్రీరామ్ లేచి నిలబడ్డారు. ఎదురుగా గురుదేవులు నిలబడి ఉండడం చూచి, శ్రీరామ్ సహజంగా చేతులెత్తి ప్రణామం చేశారు. "ఇక్కడ నుండి

**కష్టాలు ఒంటరిగా రావు. అవి అవకాశాలను వెంట తెస్తాయి.**

ముందుకు వెళ్లవలసిన సమయం వచ్చింది" – అని వారన్నారు. తమవెంట రమ్మని సైగ చేశారు.

ఈ సంబోధన వైఖరీ వాణిలో జరిగిందో, పరావాణిలో జరిగిందో స్పష్టం కావడం లేదు. ఆ సంబోధన సరాసరి ఆంతరిక చేతనకు పంపబడి ఉండవచ్చని శ్రీరామ్ అనుకున్నారు. అలా పంపడానికి స్వరం, కంఠం అవసరం ఉండవు.

గురుదేవుల సైగ చూచి, శ్రీరామ్ ఉన్నవారు ఉన్నట్లు వారి వెనుక నడవసాగారు. ఆవల్‌ఖేడానుండి వెంటతెచ్చిన బట్టలు, సంచులు అసలు గుర్తుకు రాలేదు. గురుదేవులు వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. వారు నేలపై అంత సహజంగా నడవడం నడవడం అనిపించలేదు. గురుత్వాకర్షణ ప్రభావం వారిమీద పడడం లేదని అనిపించింది. గాలిలో ఈదుతున్నట్లు అడుగులు పడుతున్నాయి. దూది పింజలవలె, పొగతో ఏర్పడిన ఆకారంవలె వారు ముందుకు వెళుతున్నారు. ఆయన వెంట నడవడానికి శ్రీరామ్‌కు శ్రమపడవలసి రాలేదు. సెలయేటి ఒడ్డు చేరిన తర్వాత ఇద్దరూ ఆగారు.

## దివ్యభూమి: దివ్య గమనం

గురుదేవులు సెలయేరులో ప్రవేశించారు. వారు నీళ్లమీదకూడ భూమిమీదవలె నడుస్తున్నారు. వారు నడవడంవల్ల సెలయేటి నీళ్లలో కదలిక రావడంలేదు. గురుదేవుల పాదాలు నీళ్లలో దిగుతూన్నట్లుకాని, తడుస్తూన్నట్లు కాని అనిపించలేదు. శ్రీరామ్ ఒడ్డున నిలబడ్డారు. గురుదేవులు ఒక బ్రహ్మకమలంవద్ద ఆగారు. దానిని తాకారు. చెయ్యి పైకెత్తారు. ఆ పువ్వు వారి చేతిలోకి లేచి వచ్చింది. అది మామూలు పువ్వులకన్న బాగా చిన్నది. పువ్వురేకు పరిమాణంలో ఉంది. బ్రహ్మకమలాన్ని తీసుకుని వారు ఒడ్డుకు వచ్చారు. దాన్ని శ్రీరామ్ చేతుల్లో పెట్టారు.

బ్రహ్మకమలం తాకగానే శరీరం బాగా తేలికయిపోయినట్లు శ్రీరామ్‌కు అనిపించింది. చలికూడా పోయింది. నలువైపులా విస్తరించి ఉన్న మంచు, చలిగాలులు. అయినా శరీరం వణకడం లేదు. గురుదేవుల ఉనికివల్ల నలువైపులా వేడిమి వలయం అంతకుముందే ఆయనను ఆవరించి ఉంది. బ్రహ్మ కమలం చేతుల్లోకి తీసుకున్న తర్వాత ఒక క్రొత్త స్ఫూర్తి అనుభవమయింది. వేగంగా అడుగులు వేస్తూ నడవడంవల్ల వచ్చిన కొద్దిపాటి అలసట మాయమయింది. మార్గదర్శక దివ్యసత్తా ముందుకుసాగారు. శ్రీరామే వారిని అనుసరించారు. పాదాలు నేలను తాకడంలేదు. నడవడానికి శ్రమపడవలసిరావడం లేదు. సిద్ధులు ఎందుకు అవసరం అవుతాయి – అనే ప్రశ్న మనసులో మెదిలింది. ఎత్తుపల్లాల దారులలో నడచి శరీరం అలసిపోకుండా కూర్చుని ఆసనం, ధ్యానం చేయడానికి ఇబ్బంది కలుగకుండా.

ముందు నడుస్తున్న గురుదేవులు కొద్దిగా ఆగి, ఇలా అన్నారు –

"కారణం అది మాత్రమే కాదు. సిద్ధులు సాధకుని యాత్రలో సూచనలవంటివికూడా. సిద్ధులు లభిస్తే సాధన సక్రమంగా జరుగుతూన్నట్లు అనుకోవాలి. అయితే అక్కడే ఆగిపోకూడదు. సిద్ధులను చూచి మాత్రమే సాధన స్థితిని తెలుసుకో నవసరం లేదు. అవి లేకుండా కూడ సాధన సాగవచ్చు."

వాయుతత్వంతో తయారైనట్లు తేలికయిన శరీరంతో శ్రీరామ్ – గురుదేవులను అనుసరించి నడుస్తున్నారు. కొన్నిమైళ్లు వెళ్లి ఉండవచ్చు. ఆ దుర్గమ ప్రదేశం అంగుళం అంగుళం పరిచయం కాసాగింది. వందమైళ్ల పరిధిలో తిరుగుతూ ఉంటే కాల గమనం తెలియలేదు. అరగంట – గంటలో యాత్ర పూర్తయినట్లు తోచింది. అది పూర్తిగా నిర్జన ప్రదేశం. మనుషుల జాడ ఎక్కడా లేదు. అయినా జనం అక్కడ నివసిస్తున్నట్లు, వారు ఎక్కడికో వెళ్లినట్లు అనిపించింది. వారి శ్వాసల వెచ్చదనం, కొద్దిసేపటి ముందు వెళ్లిన జాడ అనుభవం అవుతోంది. వాతావరణంలో రకరకాల వాసనలు వ్యాపించి ఉన్నాయి.

సూక్ష్మదేహాలు ధరించిన సత్తాలు ఇక్కడ యజ్ఞం – అగ్నిహోత్రం చేస్తూ ఉంటారు. వారి సత్తా ఎంత సూక్ష్మమో, ఆ యజ్ఞం అగ్నిహోత్రం అంత సూక్ష్మం. శ్రీరామ్ మనసులో ఈ భావన సహజంగా ఉదయించింది. అయినా ఆయన మళ్లీ ప్రశ్న అడగలేదు. ఆ ప్రదేశమంతా తిరిగిన తర్వాత, లేదా ఎన్ని పరిక్రమలు (ప్రదక్షిణలు) చేయాలో అన్ని చేసిన తర్వాత – గురుదేవులు ఒక స్థలంలో ఆగమని సైగ చేశారు. వారు స్వయంగా ఒక శిలమీద కూర్చున్నారు. శ్రీరామ్ వారి ఎదుట చేతులు కట్టుకుని నిలబడ్డారు. కూర్చున్న గురుదేవులు పార్థివ శరీరాన్ని ధరించి ఉన్నారు. ఆయనను చూచి, తాకి ఆయన ఉన్నట్లు తెలుసుకోగలుగుతాము. శ్రీరామ్‌వైపు

**రాపిడి లేకుండా రత్నం మెరుగుపడదు. కష్టాలు పడకుండా మనిషి మెరుగుపడదు.**

చూచి, వారు సైగ చేశారు. అటు దృష్టి సారించమని చెపుతున్నారు.

శ్రీరామ్ వారు సూచించిన దిశకు దృష్టి మళ్లించారు. దృష్టి తగలగానే వేద మంత్రాల ధ్వనులు నినదించసాగాయి. ఎదురుగా లోయలో 24 గురు సన్యాసులు వేరు వేరు కుండాలవద్ద కూర్చుని యజ్ఞం చేస్తున్నారు. ఆ సన్యాసులలో అన్ని వయస్సులవారూ, అన్ని దేహస్థితులవారూ ఉన్నారు. శరీరాల స్థితి చూస్తే, వారి వయస్సులు 30 నుంచి 80 సంవత్సరాలవరకు ఉన్నట్లు తోచింది. వారి స్వరం, మంత్రోచ్చారణ శైలి అతి ప్రాచీన యుగం నాటివని అనిపించింది. ఆహుతులు వేస్తున్న తపస్వుల శరీరాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నాయి. వారు దీర్ఘకాలం ఉపవాసాలు చేసినట్లు, లేదా శరీరాలను ఏదోవిధంగా కష్టపెట్టినట్లు అనిపించలేదు - దూరంనుంచి చూచినప్పటికీ.

## విశిష్టమైన నిర్దేశం

అగ్నిహోత్రాన్ని చూచి, శ్రీరామ్ తనను తాను మరచిపోయారు. శిలమీద కూర్చున్న గురుదేవులు ఇలా అన్నారు–

"వీరు ఋషిసత్తాలు. విశ్వంలో సద్ధర్మ పోషణకోసమై వీరు తప - అనుష్ఠానంలో నిమగ్నులై ఉంటారు. తమ మోక్షం కోసం, తమ పుణ్యం కోసం సాధన జరపవలసిన అవసరం వీరికి లేదు. వీరా స్థితిని పొంది ఉన్నారు. పరమకారుణిక భావంతోనే వీరిక్కడ తపం - జపం జరుపుతున్నారు. ప్రపంచంలో సంతులనాన్ని సాధించడానికై ఇకముందు తపస్సు, యజ్ఞ అనుష్ఠానాలు అవసరం అవుతాయి. ఆ బాధ్యతను నీవు నిర్వహించవలసి ఉంటుంది."

గురుదేవుల మాట విని, శ్రీరామ్ తల వంచారు. వారి ఆజ్ఞ శిరోధార్యం అని చెప్పడానికి సంకేతం అది. గురుదేవులు తిరిగి ఇలా అన్నారు -

"సూక్ష్మ వాతావరణాన్ని క్షాళన చేయడానికై కర్మకాండ చాలదు. అందులో ప్రాణం కూడ ఉండాలి. యజ్ఞాలలో, అనుష్ఠానాలలో, ధార్మిక కార్యక్రమాలలో శక్తిని ఉత్పత్తిచేసే సామర్థ్యం తపఃపూతమైన ఆత్మలకే ఉంటుంది. ఆ మహాతపస్సును నీవు ప్రారంభించి ఉన్నావు. సూక్ష్మ జగత్తుయొక్క సంస్కరణ కోసం కూడా నిద్రాణమైన ఆత్మలను మేలుకొలపడం కోసం కూడ నీవు విశేషమైన కృషి చేయవలసి ఉంటుంది. తగు సమయంలో వాటి విధి - విధానాన్ని నీకు తెలియజేస్తూ ఉంటాను."

ఈ మాటలతో గురుదేవులు తమ నిర్దేశాన్ని ముగించారు. వైఖరీ వాణిలో ఇంతవరకు చెప్పింది చాలు - అనే భావం వారి ఆ ముగింపులో సూచితం అయింది. ఇకముందు ఇవ్వవలసిన సందేశాలు ఆంతరిక చేతనలో తమకు తాముగా ఉదయిస్తాయనే భావమూ అందులో ధ్వనించింది.

మార్గదర్శక సత్తా ప్రయాణానికి సిద్ధమైనారు. యజ్ఞం చేస్తూన్న సిద్ధ ఆత్మలు తమ స్థలాలను వదలి దగ్గరకు వచ్చినట్లు శ్రీరామ్‌కు అనుభూతి కలిగింది. ఇంతకుముందు వారి సంఖ్య 24గా కనబడింది. ఇప్పుడా సంఖ్య పెరిగింది. వివిధ దిశలనుండి వారు వచ్చి ఉన్నట్లు అనిపించింది. వారు వ్యక్తం అయినారని చెప్పడం మరింత సముచితంగా ఉంటుంది. వారందరూ గురుదేవులకు వినయంగా, శ్రద్ధగా ప్రణామం చేశారు. అది చూచి, శ్రీరామ్‌కూడ వారి చరణాలకు ప్రణమిల్లారు.

గురుదేవులు ఇలా అన్నారు -

"ఇక మీదట నీవు నీ అంతస్సును అనుసరించు. అక్కడనుండి వచ్చే ప్రేరణ ప్రకారం పయనించు."

శ్రీరామ్ వారి నిర్దేశాన్ని విన్నారు. నీవు ఎక్కడకు వెళ్లినా, మా సంరక్షణ, ఋషిసత్తాల పరిమార్జన తంత్రం నీకు అందుతాయి - అనే ఊరడింపునుకూడ ఆయన విన్నారు. ఆ యాత్రాపథంలో పయనిస్తూ గంగోత్రి వెళ్లాలనే ప్రేరణకూడ అందింది. కొద్ది సమయం అక్కడ గడపాలని అనిపించింది.

గంగోత్రి చేరడానికి శ్రీరామ్‌కు హెచ్చు సమయం పట్టలేదు. బ్రహ్మకమలం చేతిలో పుచ్చుకున్న తర్వాత శ్రీరామ్‌కు తాను నిరంతరం తేలిక అవుతూన్నట్లు అనుభూతి పొందుతున్నారు. సంకల్ప మాత్రంతో ఆయన తన వేగాన్ని పెంచగలుగుతున్నారు, తగ్గించగలుగుతున్నారు. హిమాలయ క్షేత్రం సరిహద్దు దాటిన తర్వాత ఈ సామర్థ్యాన్ని వినియోగించడం నిలిపివేయాలి. బ్రహ్మకమలం చేతిలో ధరించగానే ఈ సంకల్పం ఉదయించింది. అది గుర్తు వచ్చింది. శ్రీరామ్ వాయువేగంతో గంగోత్రి చేరారు. అక్కడ రెండు మూడు రోజులు ఆగి, శ్రీరామ్ ఆవల్‌ఖేడా తిరిగివచ్చారు.

తన కుమారుడు క్షేమంగా తిరిగిరావడం చూచి, తాఈజీ నిశ్చింతగా ఉన్నారు.

H H H

**దురాలోచనలు చేస్తూ ఉంటే, మంచి పరిస్థితులు లభించడం అసాధ్యం.**

# వార్తలు

## భీమిలి శక్తిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

భీమిలిలోని శ్రీదుర్గా గాయత్రి శక్తిపీఠంలో అక్టోబరు 4 నుండి 13 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరిగాయి. ప్రతిరోజూ అమ్మవారికి ఆయా రూపాలలో అష్టోత్తర సహస్ర నామావళి పూజలు జరిగాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గాయత్రి హారతి, ఉదయం గాయత్రీ యజ్ఞం జరిగాయి. 10, 11, 13 తేదీలలో ప్రత్యేక పూజలు జరిగాయి.

10వ తేదీ సాయంత్రం డాక్టర్ మారెళ్ల శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో "గాయత్రి, లలిత, భాగవత, విశ్వఏకీకరణ మహాయజ్ఞం" జరిగింది. 300 మంది పాల్గొన్నారు. విద్యారంభ, నామకరణ సంస్కారాలు జరిగాయి.

11 ఉదయం జరిగిన ప్రత్యేక పూజలలో వందమంది కన్యలు పాల్గొన్నారు.

13న శ్రీసత్యనారాయణ వ్రతం, త్రికుండి గాయత్రీ యజ్ఞం, పూర్ణాహుతి జరిగాయి.

25 మంది శక్తిపీఠంలో లఘు అనుష్ఠానాలు జరిపారు. మరి 20 మంది తమతమ గృహాలలో లఘు అనుష్ఠానాలు జరిపి, శక్తిపీఠంలో జరిగిన పూర్ణాహుతిలో పాల్గొన్నారు. 2 విద్యారంభ సంస్కారాలు, ఒక నామకరణ సంస్కారం జరిగాయి.

### కొత్తగూడెంలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం

ఇల్లందు గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో కొత్తగూడెం కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్‌వారు ఇటీవల నవకుండీయ గాయత్రీ యజ్ఞం జరిపారు. శ్రీమతి అనసూయమ్మ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీసతీశ్ ఖండేల్‌వాల్ పర్యవేక్షించారు. టి. కైలాసం దంపతులు యజ్ఞం కోసం విశేషంగా కృషి చేశారు. శ్రీమతులు కృష్ణకుమారి, క్యాతం సరోజిని, రాగి శారద, అనితా ఖండేల్‌వాల్, కిరణ్ గుప్త సహకరించారు. యజ్ఞంలో 200 మంది పాల్గొన్నారు.

### నిడమానూరు నారాయణపురం కాలనీలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం

సెప్టెంబర్ 18న కృష్ణాజిల్లా నిడమానూరుకు దగ్గరలో ఉన్న నారాయణపురం కాలనీలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. వేయిమంది పాల్గొన్నారు. శ్రీయుతులు ఏ.వి.ఎన్.ఎస్.కుమార్, వినోద్, శాంతికుంజ్ ప్రతినిధి శ్రీగగన్ కుమార్ దేశముఖ్ యజ్ఞాన్ని నిర్వహించారు. యజ్ఞశాలలో పుస్తకశాలను ఏర్పాటు చేసి, ప్రజలకు యుగ సాహిత్యాన్ని అందించారు. శ్రీకంతేటి రాంమోహనరావు యజ్ఞ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### తూప్రాన్‌లో త్రికుండీయ గాయత్రీ యజ్ఞం

మెదక్‌జిల్లాలోని మండల కేంద్రం తూప్రాన్‌లో అక్టోబరు 6న శ్రీదుర్గాభవానీ సేవాసమితివారు త్రికుండీయ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. శ్రీమతి అనసూయమ్మ ఆధ్వర్యం వహించారు. 200మంది పాల్గొన్నారు. 60 మంది మంత్రదీక్ష తీసుకున్నారు. తర్వాత అన్నదానం జరిగింది. వైశ్య సంఘం అధ్యక్షులు శ్రీఉప్పల కృష్ణమూర్తి, గ్రామ సర్పంచ్ శ్రీ బి. వెంకటరెడ్డి, పలువురు ప్రముఖులు యజ్ఞంలో పాల్గొన్నారు.

### విజయవాడ పాతబస్తీలో త్రికుండీయ గాయత్రీ యజ్ఞం

గణపతి నవరాత్రుల సందర్భంగా విజయవాడ పాతబస్తీలోని ఇమాం పంజావీధిలో గణపతి ఉత్సవాల పందిరిలో త్రికుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. సెప్టెంబరు 12 నుండి నాలుగు రోజులపాటు విజయవాడ కృష్ణలంకలోని ఆనంద భవన్ రోడ్డులో గణపతి ఉత్సవాల పందిరిలో గాయత్రీ యజ్ఞాలు జరిగాయి. చివరి రోజున త్రికుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. 70 మంది పాల్గొన్నారు.

q[†Ç°'Œ̲ ÈHÊ~Œ/•†Ç°Ox~¡Þ, ²ì̀Oz#W`Ç~¡ HÊ~¡/4H=¶•°Ð

ఆగష్టు 7న శ్రీ కె.శ్రీనివాస్ గృహంలో జన్మదిన సంస్కారం, యజ్ఞం. 14న శ్రీ సి. కృష్ణారావు గృహంలో జన్మదిన

**కాలమే ఉత్తమ గురువు.**

సంస్కారం, యజ్ఞం, 18న ఉండవల్లి సెంటరువద్ద శ్రీజి. సత్యనారాయణ జన్మదిన సంస్కారం, యజ్ఞం. 22న కృష్ణలంకలో డి. మురళీమోహన్ కుమార్తె జన్మదిన సంస్కారం, యజ్ఞం. 26న శ్రీ అన్నం బాపారావు గృహంలో యజ్ఞం. 28న శ్రీయుతులు జె.రామచంద్రరావు, వి.నాగధర్‌ల గృహంలో యజ్ఞం. సెప్టెంబరు 3న శ్రీమతి వల్లూరి కస్తూరి గృహంలో యజ్ఞం. 4న శ్రీ జోగ్‌సింగ్ రాజపురోహిత్ గృహంలో యజ్ఞం. 7న శ్రీ భీమ్‌సింగ్ రాజపురోహిత్ గృహంలో యజ్ఞం. 15న శ్రీ జి. రామకృష్ణ గృహంలో యజ్ఞం. 24న శ్రీ పి.సురేశ్ గృహంలో యజ్ఞం.

## విశాఖ షిప్‌యార్డ్‌లో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం

ఆగష్టు 14న విశాఖ షిప్‌యార్డ్‌లో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీయుతులు భగవాన్ డోకియా, విశ్వనాథ్ డోకియా, సింహాచలం పండా ఆధ్వర్యం వహించారు. శ్రీయుతులు పుష్యమిత్ర, దుర్గేశ్ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీమతులు సావిత్రి, రూపవాణి, నాగరాణి, లక్ష్మి, శ్రీయుతులు ఇంద్రజిత్ సింగ్, గణేశ్, బి.బి.రాం, బి.ఎన్.రావు సహకరించారు. తర్వాత అన్నదానం జరిగింది.

ఆగష్టు 21న విశాఖపట్టణం కొత్తశాలిపేటలోని శ్రీమతి రాజేశ్వరమ్మ గృహంలో త్రికుండీయ గాయత్రీ యజ్ఞాన్ని శ్రీయుతులు పుష్యమిత్ర, గురుమూర్తి, శ్రీమతులు ఏ.సావిత్రి, రూపవాణి నిర్వహించారు.

విశాఖ ప్రజ్ఞామండలి నిర్వహించిన ఇతర కార్యక్రమాలు-

ఆగష్టు13న గాంధీగాం షిప్‌యార్డ్ కాలనీలోని శ్రీరామ మందిరంలో రోజంతా గాయత్రీ జపం, సాయంత్రం కలశయాత్ర, సహస్రదీపయజ్ఞం. 13న స్టీల్‌ప్లాంట్ సెక్టార్ - 1లో శ్రీ ఎస్.ఎల్.పి.రావు గృహంలో యజ్ఞం. నిర్వహణ శ్రీహేమచంద్రరావు, 22న కిర్లంపూడి లేఅవుట్‌లోని శ్రీయుతులు సుధీర్‌కుమార్ ఝూ, నిఖిల్ ఝూల గృహంలో 1,25,000 గాయత్రీ మంత్ర జపం, దీపయజ్ఞం. నిర్వహణ శ్రీయుతులు పుష్యమిత్ర, చంద్రశేఖర్ జైన్, శ్రీమతి సావిత్రి. సెప్టెంబరు 5న పెదవాల్తేరులోని శ్రీమతి శ్రీదేవి గృహంలో యజ్ఞం. 11న గొల్లలపాలెంలో, 12న అంతోనీ నగర్‌లో, 17న శ్రీమతి రామకుమారి గృహం సమీపంలో యజ్ఞములు. 18న అక్కయ్యపాలెంలోని శ్రీబొజ్జా పైడిరాజు గృహంలో యజ్ఞం. అక్టోబరు 4న శ్రీమతి సాయిలక్ష్మి గృహంలో జన్మదిన, వివాహదిన సంస్కారాలు, దీపయజ్ఞం. నిర్వహణ శ్రీమతులు సావిత్రి, వసంత, లీలావతి, శ్రీహేమచంద్రరావు. 16న రామకృష్ణా బీచ్‌రోడ్డులోని శ్రీ బి.ఎన్.సాహే గృహంలో యజ్ఞం. నిర్వహణ శ్రీయుతులు పుష్యమిత్ర, చంద్రశేఖర్ జైన్.

H H H

## ఏకాత్మతా సాక్షాత్కారం

భక్తుడైన ఏకనాథుడు ఆరోజున తండ్రి తద్దినం పెట్టవలసి ఉంది. వంట సిద్ధమైంది. పిలిచిన బ్రాహ్మణులు ఇంకా రాలేదు. వాకిట్లో నిల్చుని ఏకనాథుడు ఎదురుచూస్తున్నాడు. అటునుండి ఐదుగురు చండాలురు (మహర్‌లు) వస్తూ కనిపించారు. వంట ఇంట్లోనుండి సువాసనలు వస్తున్నాయి. వారు పరస్పరం అనుకుంటున్నారు. 'అబ్బ, ఏమి సువాసన! ఆకలి లేకపోయినా ఆకలి పుడుతున్నది. అయినా ఇట్టి భోజనానికి మనం నోచుకోలేదుకదా.'

ఏకనాథుడు వారి మాటలు విన్నాడు. వారిని పిలిచి శ్రాద్ధాన్నాన్ని పెట్టాడు. కొంత అన్నం మిగిలింది. దాన్ని గిరిజాబాయి ఈ చండాలుర భార్యలను పిలిచి పెట్టింది. బ్రాహ్మణుల నిమిత్తం అప్పుడు మళ్లీ వంట చేసింది. ఆహ్వానితులైన బ్రాహ్మణులకు కథ అంతా తెలిసింది. వారికి కోపం వచ్చింది. ఏకనాథుడు ధర్మభ్రష్టుడైనాడని వారు చెడామడా తిట్టారు. 'నీవంటి పతితుడి ఇంట మేము భోజనమే చెయ్యము.' అని బెదిరించారు.

ఏకనాథుడు శాంతంగా విన్నాడు. యధావిధిగా శ్రాద్ధసంకల్పం చేశాడు. పితృదేవతలను ధ్యానించాడు. ఆవాహనం చేశాడు. పితృదేవతలు ప్రత్యక్షం అయినారు. స్వయంగా శ్రాద్ధభోజనాన్ని స్వీకరించారు. తృప్తిపడి ఆశీర్వదించి, అంతర్ధానమైనారు. అందుకే చెప్పారు, ఆత్మవత్ సర్వభూతేషు, యఃపశ్యతి స పశ్యతి. ఏకనాథుడికి జీవులందరిలోనూ ఏకాత్మతా సాక్షాత్కారం కలిగింది.

**వశీకరణ మంత్రాలు - ప్రేమ, సహృదయత, ఇతరుల దృక్పథం పట్ల ఆదరం.**